భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

మే 1974

సంపుటము : 51 :   సంచిక : 5 :

ఒడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

మే 1974

—

*

ఆనందవల్లి

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

గౌతమీ వాహినీ కనకరోచిశ్ఛటా
రమణీయ తతసైకతముల మీఁద
కృష్ణవేణీఝరీ కేళీ లసత్పాత్ర
రమలిన పుండరీకముల మీఁద
పరమ నిర్మల తామ్రపర్ణీ తరంగిణీ
కమనీయ తర మౌక్తికములమీఁద
గండకీ వార్వీచికా పరిష్వక్త సా
లగ్రామ పుణ్యశిలాళిమీఁద
కార్తికిక శుభ్రసమయ రాకానిశాక
రాతప సుధాతరంగ సంహతులమీఁదఁ
దరలివచ్చు భవత్కీర్తి ధారవెంటఁ
గెరలి పొల్చితి రసమయాకృతిని నిన్ను.

సౌవర మాధురీ సాధు పుంస్కోకిల
స్పృహణీయ కుహూగీతి విన్నయపుడు
భావజాటజ్ఝాట గహ్వారనిర్గమద్గాంగ
ధార తలంపునఁ దగిలినపుడు
శరదిజ ప్రవిమలాసార చాంద్రీరోచి
సొగపుగా నెమ్మేన సోఁకినపుడు
సముచితక్షేత్ర దర్శన మాచరించుచు
సొగసు నివ్వరిముల్లు చూచినపుడు
నీవు భావనా పథమున నిల్చియుండి
ప్రకృతి సకలంబు చేతన ప్రౌఢ మగును;
నాదవు నాకు వసంత డోలోత్సవంబు
చాలు నొక్కఁ రసానంద ఖేలనంబు.

వెదకుచుందును శబ్ద విన్యాస కౌశలీ
మధురిమాతత చతుష్పథము లందు
తడవుకొందును దదర్థ విభూతి విస్ఫుమర
వ్యాకృతి స్ఫోట గహ్వరములందు
ఓర్మి గవేషింతు నుజ్జ్వల వస్తుక
ల్పన విధానల్ప శిల్పముల యందు
కోర్కి నన్వేషించు కొందు నలంకార
కనక వల్లీ కుడుంగముల యందు
తత్ర తత్ర ప్రతిధ్వన త్సావకీన
విద్యుదాకార రేఖ హృద్వీథి నిలిపి
నీరసంబైన బ్రతుకును స్వారసికము
చేసికొనుటకు నీ కృపాసిద్ధి వలతు.

చిగిరించి పూచిన శిలలతో సౌరభో
ద్గమ చారుతర వదనముల తోడ
వేవెల్గు కరముల విచ్చుకల్వల తోడ
లీలమై నడచు వల్లికల తోడ
ప్రేమార్ద్రముగఁ బల్కరించి కౌఁగిలి యిచ్చి
మేలు చూపెడి తమ్మి పూలతోడ
కర్ణాట సంగీతకముల నాలాపించి
యెదురుకోలిడు సెలయేళ్లతోడ
నియతికృతమైన కొండొక నియమమునకు
లోనుగాని విలక్షణ లోకమందు
నుత్తమ శ్లోకమందు నీ యునికిఁ దెలిసి
వచ్చితిని హ్లాదమయి! విడువకుము నన్ను.

పంచభూతాత్మక పరమాణు చరమాణు
శోధన వీధులం జొచ్చి చొచ్చి
ప్రతి విశ్వ సృజన చర్యా నూతన రసాయ
నాళి సమ్మేళన నలసి యలసి

గ్రహగోళ భాగోళకీ మహారహస్య వి
వేక ప్రతీక్షల విసివి విసివి
చంద్ర మో మండలీ సాంద్రశీతల శిలా
పరిశీలనమ్ముల బడలి బడలి
కిటుకు తెలియక చాల దన్నటులు మఱియున్
వెదకు నెమ్మది యేదొ యభ్యుదయ పథము
నంతరంగైక సంప్రదాయమ్ము సదము—
ఆ పదము వాస్తవము నీవ యవుదు వేమొ !

వికచాంబురహ వనీ వీథిఁ దారిన యట్లు
విచికిలా మోదంబు విరిసినట్లు
కర్పూర చూర్ణంబు కలసి వచ్చిన యట్లు
కల్వ పువ్వులగాలి కదలినట్లు
శివ శిరో హరిణాంక శిశువు నవ్విన యట్లు
ముత్తెమ్ము లౌదలఁ బోసినట్లు
అమృతహ్రద స్నాన మాచరించిన యట్లు
పరమార్థ మాధురి దొరికినటులు
వేయి రేకుల తామరవిరి తనంత
దారవోసిన తేనియం జాఱినట్లు
లందఁజేసితి వొక్క యానందవల్లి
యపునరాగతి నీ యంద యగుత! నాకు.

రుద్రమదేవి రణభూమిలో వీరస్వర్గ మలంకరించెనా?

శ్రీ పి. వి. పరబ్రహ్మ శాస్త్రి

అవును. ఆమె యుద్ధములోనే మరణించెను. కాకతీయ చరిత్రలో నింతవరకు బయల్పడని రహస్యములలో నిదియొకటి. ఈ మహారాజ్ఞి క్రీస్తు 1296 వరకు జీవించియుండెనని కొన్ని శాసనములనుబట్టి తలంపబడు చుండెను. కాని యిటీవల నల్లగొండజిల్లా నకరికల్లు గ్రామమునకు సమీపమందున్న చందుపట్ల యను వేరొక గ్రామములో శివాలయ ప్రాంగణమున నొక శిలపై నిరువైపుల రెండు ప్రత్యేక శాసనములు కనుగొనబడినవి. అందొకటి చాళుక్య విక్రమాదిత్యుని రాజ్యవర్షములకు చెందినది. ఈ సందర్భమున ముఖ్యమైనదికాదు. రెండవది కాకతి రుద్రమదేవికి చెందినది. దాని పాఠ మీావిధముగ నున్నది.

1. స్వస్తి శ్రీ జయా
2. భ్యుదయ శకవర్ష
3. ంబులు 1211 విరో
4. ధి సంవత్సర మార్గ్గశిర
5. శు 12 శు। స్వస్తి శ్రీ మ
6. న్మహా మండలేశ్వర కా
7. కతియ్య రుద్రమ
8. మహాదేవి శివలోకా
9. నకు విచ్చేసిన శివలోక
10. ప్రాప్తిగను మల్లికార్జు
11. నాయునింగారికి శి
12. వ లోకప్రాప్తిగాను వారి
13. భృత్యులు పువ్వుల ము
14. ంమడింగారు చంద్రుప[ట్ల]*
15. సోమనాథదేవరకు గొస
16. గి ఓగిరానకు రాసముద్రా
17. వెనకను నీర్నేలతో—టవి
18. [క్ష...చాయచేల మాం]
19. [గాణి............]
20. [............]
21. [.........నమ]
22. [టిని] ఆ చంద్రార్కముగాను
23. [ధర్మ్మ ధారాపూర్వ్వకముగా]
24. నిస్తిమి.



చందుపట్ల శిలాశాసనము

ఈ శాసనమువలన **మూడు** నూతనాంశములు తెలియవచ్చుచున్నవి.

మొదటిది :

ఈ శాసనము శకవర్షము 1211, విరోధి సంవత్సర మార్గశిర శుద్ధ 12 శుక్రవారము నాటిది. ఇది క్రీస్తు 1289 నవంబరు 27 వ తేదికి సరియగుచున్నది. కాకతీయ రుద్రమదేవి శివలోకమునకు విచ్చేసినట్లును ఆమెకు శివలోకప్రాప్తి నుద్దేశించి మల్లికార్జున నాయునింగారికి శివలోకప్రాప్తిగాను వారి భృత్యుడు ముమ్మడింగారు చంద్రుపట్ల సోమనాథ దేవునికి భూదానము చేసినట్లిందు చెప్పబడెను. రుద్రమదేవి శివలోకమునకు విచ్చేసినట్లు చెప్పబడింది గనుక ఆమె బ్రతికియుండగనే యామె పుణ్యలోక ప్రాప్తికొరకు చేయబడిన దానమని చెప్పుటకు వీలు కాదు. చనిపోయినతర్వాత సాధారణముగ ద్వాదశాహస్సున చేయు దానములవంటిదే యిది. ఆ విషయమున సంశయ మే మాత్రము లేదు.కనుక ఆమె మార్గశిర శుద్ధ పాడ్యమినాటికి సరియగు క్రీస్తు. 1289, నవంబరు 15 వ తేదికి దాపులో చనిపోయెనని నిశ్చయము.

ఇందుకు వేరొక సాక్ష్యము గలదు. అది యిటీవలనే ప్రచురింపబడిన కాకతి వీరరుద్రుని రాజ్యకాలము నాటి ఉత్తరేశ్వర గ్రామదాన శాసనము.[1] దీనిని 'శకము 1211 నాటి కాకతీయ రుద్రాంబ ఉత్తరేశ్వర దాన శాసన'మని దాని ప్రచురణకర్తలు పేర్కొనిరి. ఉత్తరేశ్వర గ్రామము పశ్చిమగోదావరిజిల్లాయందెచటనో యుండెడిదని వారు తెలిపిరి. దాని సరియగు ఉనికి గుర్తించవలసియున్నది. ఆ శాసనమున కాకతి వీరరుద్ర మహారాజు ఓరుంగల్లు పట్టణమునుండి రాజ్యము చేయుచుండగా ఉత్తరేశ్వర గ్రామమును విష్ణువర్ధనుని ప్రపౌత్రుడగు (చాళుక్య) ఇందు శేఖరుడు రుద్రదేవుడను ద్విజునకు దాన మిచ్చినట్లును అతడు మరల దానిని తన విద్యాగురువగు విద్దనాచార్యునకు గురుదక్షిణగా నొసగినట్లును, విద్దనాచార్యుడు అందు కొంతభాగము 41 బ్రాహ్మణులకు దానమొసగి మిగిలినది తానుంచుకొనెనని చెప్పబడెను. దాన కాలము శకవర్షము 1211, విరోధి ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాటి చంద్ర గ్రహణ పర్వదినము.

ఇది క్రీస్తు 1290, ఫిబ్రవరి 25వ తేదికి సరియగుచున్నది. లోగడ శాసనాంతరములను బట్టి రుద్రమదేవి క్రీస్తు 1296 వరకు జీవించియుండెనను నిర్ణయము జరిగియున్నది గనుక ఈ శాసన ప్రచురణకర్తలు ఇందలి రుద్రదేవ మహారాజు రుద్రమదేవియే కాదగునని నిర్ణయించి 'కాకతి రుద్రాంబ యొక్క ఉత్తరేశ్వర దానశాసన'మని దీనిని పేర్కొనిరి. కాని ప్రస్తుత చందుపట్ల శాసనమునుబట్టి లోగడ జరిగిన నిర్ణయములను వదులుకొని రుద్రమదేవి క్రీస్తు 1289, నవంబరు 15 ప్రాంతమున చనిపోయెనని నిర్ణయించవలెను. శాసనాంతరములు ఆయా శాసనకర్తల స్ఖాలిత్యము లనవలెను. ఉత్తరేశ్వర దాన శాసనమందు చెప్పబడిన వీరరుద్రమహారాజు ప్రతాపరుద్రుడే కాని రుద్రమదేవి కానేరదు. మరియు ప్రతాపరుద్రునికే వీరరుద్రుడను వ్యవహారము ప్రసిద్ధమై యున్నది గాని రుద్రమదేవికి లేదు. ప్రతాపరుద్రీయమున విద్యానాథుడు చెప్పిన శ్లోక మీ సందర్భమున చూడదగియున్నది. ప్రతాపరుద్రుడు జన్మించినపుడు లోకమున భానూదయమైనట్లున్నది గనుక అతనికి ప్రతాపరుద్రుడని పేరిడిరట. విష్ణువువలె విశ్వైక వీరుడగుటచేత వీరరుద్రుడని కూడ పిలుచుచుండిరట.

నాటక ప్రకరణమున, సూత్రధారి :

తం సుజాతం సముద్వీక్ష్య
క్షోణ్యాం రవి మివోదితం,
ప్రతాపరుద్ర ఇత్యాఖ్యా
మకరో త్కాకతీశ్వరః. శ్లో. 12

విష్ణో ర్విశ్వైక వీరస్య
కాకతీయ కులేస్థితం,
అవతార మముం జ్ఞాత్వా
వీరరుద్రం ప్రచక్షతే. శ్లో. 13

అనగా విశ్వైక వీరుడగు విష్ణువుయొక్క అవతారముగ నితనిని భావించి వీరరుద్రుడని పేర్కొనిరట. ప్రతాపరుద్రీయములో వీరరుద్రుడను పేరే యధికముగ గానవచ్చుచుండును. శాసనములందు కూడ

---

1. ఎపిగ్రాఫియా ఇండికా. XXXVIII పుట 76—93.

'Uttares'vara Grant of Kakatiya Rudramba, Saka 1211.'

ప్రతాపరుద్రునికి వీరరుద్రుడను పేరు అచ్చుటచట గాన నగును. నృసింహకవియొక్క శాసన శ్లోకంలో,

'అవ్యా దుర్వీ ముదధి రశనా
మగ్రణీః కాకతీనాం
విద్యాశాలీ విదిత వినయో
వీరరుద్రాభి ధానః.'
....

కాని రుద్రమదేవిని వీరరుద్రుడని వ్యవహరించుట కానరాదు. ఉత్తరేశ్వర దానశాసనము ప్రతాపరుద్రుని నాటిదనే నిర్ణయమగుచున్నది గాన దీనికి సుమారు మూడునెలలముందు రుద్రమదేవి చనిపోయినట్లు చందుపట్ల శాసనము రూఢియగుచున్నది. రుద్రమదేవి తుది వర్షమును క్రీస్తు 1296 నుండి 1289 కి మార్చుకొనవలసి యున్నది.

రెండవ అంశము :

రుద్రమదేవికి శివలోకప్రాప్తి నుద్దేశించి చేయబడిన యీ దానము మల్లికార్జుననాయునింగారి శివలోకప్రాప్తికొరకు కూడ ఉద్దేశింపబడియున్నది. అనగా రుద్రమదేవితోబాటు మల్లికార్జున నాయునింగారు కూడ మృతినొందియుండెనని స్పష్టము. వీరిరువురు ఒకే సమయమున మృతి నొందుటకు కారణము కూడ నొకటియే యై యుండవలెను. రాజుగారితోబాటు సామంతుడు గాని సేనానాయకుడు గాని చనిపోవుట యుద్ధములందు తప్ప వేరొక సందర్భములో సంభవించదు. కనుక రుద్రమదేవి వీరమరణము నొందెననియే నిశ్చయము. ఏదో కథలందు ఆమె యుద్ధములు చేసెడిదని వింటున్నాముగాని నిజముగ కత్తిబట్టి రణభూమి కేగెనా యను సంశయమునకు తావులేదు. ఆవిడ యుద్ధములం దారితేరిన మహాపరాక్రమశాలిని. గణపతిదేవమహారాజు తన కింక పుత్రసంతానము కలుగదనే నిరాశ దృఢమైన పిదప తన జ్యేష్ఠపుత్రిక యగు రుద్రమాంబను యువరాజ పదవిలో పట్టోద్ధృతిగా నొనర్చి రుద్రదేవ మహారాజను పురుషనామ మొసగి కత్తిసాము, ధనుర్విద్య మొదలగు యుద్ధప్రక్రియలను, రాజతంత్రములను నేర్పించెను. అంతేగాక దాయాదులు, సామంతులు, విప్లవములు లేవదీసి యామెను పరాభవించెదరను భీతితో తాను బ్రతికి యుండగనే యామెచే రాజ్యవ్యవహారములనంటిని నిర్వర్తింపజేయుచు క్రీస్తు 1260 నుండి 1268 వరకు తాను పర్యవేక్షించుచుండెను. ఈ శిక్షణ దశలో నామె సామంతులను, దండాధిపతులను తన వశవర్తులుగ జేసికొనెను. యుద్ధములు జేయ నేర్చిన జాణ. ఓరుగంటిపై దండు వెడలిన యాదవ మహాదేవరాజును నిర్జించి తరుముటయేగాక యాదవ రాజ్యములో జేరిన బీదరుకోటను స్వాధీనము జేసుకొన్న యసమానయుద్ధకౌశల మామెది. కనుక స్త్రీ యను సందేహములేక ఒకానొక యుద్ధములోనే యామె మల్లికార్జున నాయకునితోబాటు వీర మృతినొందెనని నిస్సంశయముగ జెప్పవచ్చును.

మూడవ అంశము :

ఏ యుద్ధమునం దీమె వీరస్వర్గ మలంకరించెనో తెలియుట కష్టము. స్పష్టమగు ఆధారములు కానరావు. కాని అప్పటి శాసనములను పరికించగా అంబదేవుని త్రిపురాంతక శాసనమందు కొంత ఆధారము కనుపించు చున్నది. ఈ యంబదేవుడు కాయస్థ వంశమువాడు. ఈ వంశమువారు గణపతిదేవుని కాలములో నర్మదానది ప్రాంతమునుండి ఆంధ్రదేశమునకు వచ్చి ఆ మహారాజు కొలువులో అశ్వసాహిణులుగ జేరినట్లు తెలియుచున్నది.' అతివిషమ హయారూఢ', 'ప్రౌఢరేఖారేవంత' అనువీరి బిరుదములనుబట్టి వీరు అశ్వదళ నాయకులని తెలియుచున్నది. మొదట పానుగల్లులోను తర్వాత కడప మండలమునందలి పొత్తపినాడు, మార్జవాడి ప్రాంతములందును వీరు సామంతులుగ నున్నట్లు శాసనములు తెలుపుచున్నవి.[2] వీరిలో గండపెండారు గంగయసాహిణి యనువాడు గణపతిదేవుని దక్షిణదేశ దండయాత్రలో తోడ్పడి అనేక విజయముల నార్జించెను. బాహత్తర నియోగాధిపత్యమునకూడ నిత డా రాజుచే నియోగింపబడెను. కడప సమీపమందున్న వల్లూరు పట్టణము ఇతనికి రాజధాని. ఇతని యనంతరము ఇతని మేనల్లుడు జన్నిగదేవుడు రుద్రమదేవికి విధేయుడై తోడ్పడుచుండెను. ఇతని సోదరులు త్రిపురారి, అంబదేవులు. క్రీస్తు 1272 నాటికి అంబదేవుడు సామంతరాజయ్యెను. ఇతడు మిక్కిలి పరాక్రమశాలి, స్వాతంత్ర్యప్రియుడు. రుద్రమదేవి యధికారమును ధిక్కరించి స్వతంత్రముగ శాసనములు

2. SII, X 332, 334, 448.

వేయించుకొన జొచ్చెను. కాకతీయుల కిదివరకే శత్రువులైన పాండ్యులు, దేవగిరియాదవులు ఇతనికి సహాయముగ నిలబడిరి. శకము 1209 కి సరియగు క్రీస్తు 1287 నాటి యితని అత్తిరాలశాసనము[3]లో నతడనేక రాజులను జయించి విజయములు సాధించి యున్నట్లు చెప్పుకొనెను. తర్వాత క్రీస్తు 1290 కి నాటిదగు తన త్రిపురాంతక శాసనము అతి ముఖ్యమైనది. అందీతడు తన వంశక్రమమును, విజయములను విస్తారముగ పొగడుకొనెను. [4]అనుమకొండ వేయిస్తంబాల గుడివద్దనున్న కాకతి రుద్రుని స్వాతంత్ర్య ప్రకటన శాసనమువలె నిది అంబదేవుని స్వాతంత్ర్యమును ప్రకటించును. ఇతని విజయములలో శ్రీపతి గణపతిదేవుని ఓడించి, అతని 'రాయసహస్రమల్ల' యను బిరుదును తీసుకొనుట; డెబ్బదియైదు రాజుల శిరములనుద్రుంచి తన నేత్రములం దుద్భవించిన కోపాగ్నిని చల్లార్చుకొనెనట; ఏఱువ మల్లదేవుని తెగటార్చుట; వైదుంబరాజులగు అల్లుగంగ, కేశవదేవ. సోమిదేవులను వారిని తరుమగొట్టుట; ధర్మద్రోహియగు మల్లికార్జునపతిని దేవబ్రాహ్మణ భక్తి పరుడగుటచే చంపక వాని సప్తాంగములను పరిగ్రహించెనట; సమస్త ఆంధ్రమహీపతులను రణమందు జయించి కీర్తి నార్జించెనట; విక్రమసింహపురమున (నెల్లూరు పట్టణమున) మనుమగండ గోపాలుని రాజ్యమం దుంచెను; దేవగిరిరాజులచే పంపబడిన బహుమతులను స్వీకరించెనట; పాండ్యరాజ ప్రేషితములగు గజతురగములతో పోషింపబడిన స్నేహాతిశయము గలవాడట; ఈ విధంగా అనేక విజయములు ఘనముగా శ్లాఘించబడినవి. ఇందు పేర్కొనబడిన కొందరు రాజులు ప్రస్ఫుటముగ గుర్తింపబడియున్నారు, కాని కొందరిని గుర్తించుట కష్టముగ నున్నది. గుర్తింపబడనివారిలో మల్లికార్జున పతి యొకడు. అతనిని అంబదేవుడు బ్రాహ్మణుడను పాపభీతితో చంపలేదట. కాని వాని సప్తాంగములను పరిగ్రహించెనట. సప్తాంగములంటే రాజ్యచిహ్నములని కొందరు తలంతురు. కాని శరీరావయవములగు కాళ్లు, చేతులు, కళ్లు, ముక్కు అను సప్త అవయవములను ఖండించెనా యను సందేహము కలదు. తదుపరి ఆ మల్లికార్జునుడు జీవించుట దుర్లభమే కదా. కనుక చంపినట్లే కాగలదు. కాని ప్రత్యక్షంగా చంపలేదని అంబదేవుని తృప్తి. ఆ మల్లికార్జున పతి మన చందుపట్ల శాసనములోని మల్లికార్జున నాయునింగారు కాదగునా యను సందియము కలుగుచున్నది. అయితే యీ మల్లికార్జున నాయునింగారు శైవ బ్రాహ్మణుడా యను సందేహము తర్వాత కలుగుతుంది. అట్లే ముమ్మడి నాయకుడు గూడ గొప్ప హోదాలోనివాడే కావచ్చును. అంబదేవుడు చెప్పుకొన్న 'సర్వానంధ్ర మహీపతీన్ రణముఖేజేతా యశో లబ్ధవాన్' అని చెప్పుకొన్న పొగడ్త రుద్రమదేవిని చంపుటచేత లభించినదేనా యను సందియము కలుగుచున్నది. అట్లగుచో కంఠోక్తిగా రుద్రమదేవిని చంపితిననియే చెప్పుకొనవచ్చును గదా, చాలా ఘనంగా, కాని స్త్రీని చంపితినని చెప్పుకొనుట అంబదేవుని పౌరుషమునకు అడ్డమై యుండును. కాకతీయ శాసనాల్లో చెప్పబడకపోవుట సహజమే. వారి కిది యవమానకరమగు విషయము కదా. రుద్రుని చంపిన విషయమును యాదవరాజగు జైతుగి, వాని సంతతి వారి శాసనములవల్లనే తెలియుచున్నది. కాకతీయ శాసనములలో కానరాదు. అట్లే యీ విషయము కూడ.

పై చర్చవల్ల తేలినదంతయు రుద్రమదేవి అంబదేవుని స్వాతంత్ర్య విప్లవము నణచుటకు యుద్ధము చేయ సమకట్టియుండుననియు, ఆ యుద్ధములో తన సేనాధిపతియగు మల్లికార్జున నాయునింగారితో వీరస్వర్గ మలంకరించి యుండుననియు సందేహముతో కూడిన ఊహయే. ఇది చందుపట్ల శాసనమువల్ల తెలియు మూడవ యంశము.

రుద్రమదేవిని అంబదేవుడు కడతేర్చెను గనుకనే ప్రతాపరుద్రుడు వానిని వెంటనే త్రిపురాంతకమునుండి దక్షిణదిక్కుకు తరిమివైచెను. తర్వాత వాని వంశమును పూర్తిగ నిర్మూలించెను. కాయస్థవంశము తెలుగునాట పూర్తిగ నదృశ్యమయ్యెను. దీనికిదే కారణమై యుండునని డాక్టరు నేలటూరి వెంకటరమణయ్యగారు తమ యభిప్రాయమును వెలిబుచ్చిరి.

కాకతీయుల దురదృష్టమేమోగాని స్వతంత్ర రాజనిపించుకొన్న రుద్రుదేవుడు యాదవులతో యుద్ధమున చనిపోయెను. అతని సోదరుడగు మహాదేవుడు కూడ అట్లే యాదవులపై యుద్ధమునకేగి వీరస్వర్గమున కేగెను. రుద్రమదేవి సంగతి పైన జెప్పినదంతా, ప్రతాపరుద్రుడు యుద్ధములో చనిపోకున్నను తురకలచే బందీగా కొనిపోబడుచు తోవలో ఆత్మహత్య గావించుకొనెనని చరిత్ర తెలుపుతోంది. ఒక్క గణపతిదేవుడు తప్ప మిగిలినవారందరు వీరస్వర్గాధివాసులే.

---

3. SII, X 448. 4. SII, X 465.

తిక్కయజ్వ-భేదములేని భక్తి

శ్రీ ఓరుగంటి నీలకంఠ శాస్త్రి

(గత సంచిక తరువాయి)

వేదోక్తములగు నుపాసనములలో దేవతానుగ్రహమును గల్గించి సామాన్యములగు నైహికాముష్మిక ఫలములను సమకూర్చు నుపాసనములేగాక పురుషుని వాస్తవ స్వరూపమగు బ్రహ్మ భావమునకుఁగూడ యోగ్యతను గల్గించునంతటి మహాసమర్థములగు నుపాసనా విశేషములుగూడఁ గలవు. ఈ విషయము వేద హృదయాభి వ్యంజకములగు నుపనిషత్తుల యందును నుపనిషదర్థ నిర్ణాయకములగు వ్యాస సూత్రములయందును బహుభంగుల నిర్ణయింపఁబడి యున్నది. ఉత్తమోపాసకుఁడు పరిశుద్ధాన్తః కరణము గలవాఁడై క్రమముగాఁ దనయందు దర్శించు బ్రహ్మ భావమునే తైత్తిరీయ శ్రుతి—

'ఆర్ద్రం జ్వలతి జ్యోతి రహమస్మి
జ్యోతిర్జ్వలతి బ్రహ్మాహ మస్మి
యోఽహమస్మి బ్రహ్మాహమస్మి
అహమస్మి బ్రహ్మాహ మస్మి
అహమేవాహం మాం జుహోమి స్వాహా'
(నారాయణోప నిషత్, తైత్తిరీయము)

అని పేర్కొనెను.

ఇట్టి యుత్తమ స్థితినందుటకై వారు తొలుత నుపాసన ప్రక్రియయందు 'నా శివశ్శివ మర్చయేత్' అనునొక వైదికమగు నియమమును గావించిరి. అనఁగా శివుఁడు గానివాఁడు శివునర్చింపరాదని యర్థము. ఇందు శివశబ్దము దేవతా సామాన్యోపలక్షకము. ఏ దేవత యర్చనము తాను గావించునో యద్దేవతా భావమును దాను దొలుతఁ బొందవలయునని భావము. కావున నర్చకుఁడు అద్దేవతాత్వ సిద్ధికై తొలుతఁదన పంచభూతాత్మక శరీరమును శుద్ధము గావించుకొని యట్టి పరిశుద్ధమగు తన శరీరమున మంత్రన్యాసమును గావించుకొనును. అర్చన ప్రక్రియలో దీనినే 'భూతశుద్ధి—న్యాసము'లని యందురు. అప్పుడు దాను దేవతా భావము కలవాఁడై దేవతార్చనమునకు నర్హుఁడగును.

ఇట్లు న్యాసాదులచే దేవతాత్వముగల్గి పరిపక్వ దశనందిన యుపాసకుఁడు బాహ్యమగు నర్చనముకంటె హృదయమునందే దేవతారూపమును గల్పించుకొని యొక యాంతరమగు నర్చనమును గావింప సమర్థుఁడగును. ఇది బాహ్యార్చనముకంటె నుత్తమమగు నర్చనముగా ఋషులచే నెన్నఁబడినది. దీనినే 'అన్తర్యాగమ'ని శిష్టులు వ్యవహరింతురు. ఇందు భక్తుఁడు దేవతను దనతో నభిన్నముఁ గావించుకొని

'అహం దేవో నచాన్యోఽస్మి
బ్రహ్మైవాహం నశోకభాక్'

అనెడి భావనతో నుండును. ఇట్టి యన్తర్యాగ ముత్తమమైనదిగా భావించి దానుగూడ నట్టి యుపాసనమును గావించునట్లు తిక్కయజ్వ హరిహరనాథ సంబోధనములచే నిగూఢముగ సూచించినాఁడు.

'యోగీంద్ర సంతతాన్త ర్యాగ పరిపాక రూప'
(ఉద్యోగ. 1–1.)

'అకలుష హృదయాంతర్యాగ సంసిద్ధమూర్తీ'
(అను. 2—428.)

'మనోఽన్త ర్ముద్రాలతికా ఫలత్వలసితా'
(అను. 2—476)

'మానసేజ్యాధారా' (శల్య 2—421)

ఇట్టి యుపాసనమునే వ్యాసమునీంద్రుఁడు గూడఁ దన భారత గ్రంథమున నచ్చటచ్చట నుత్తమోపాసనముగా బోధించెను—

యే భక్త్యా వరదం దేవం
శివం రుద్ర ముమాపతిమ్ ।
అనన్య భావేన సదా
సర్వేశం సముపాసతే ।
ఇహలోకే సుఖం ప్రాప్య
తేయాంతి పరమాంగతిమ్.
(ద్రోణ 202—27, 28)

'ఆత్మానం త్వాం ఆత్మనోఽనన్యబోధం
విద్వానేవం గచ్ఛతి బ్రహ్మ శుక్రమ్'
(ద్రోణ. 201—78.)

('పరమశివుని నెవ్వరు స్వస్వరూపముగా భావన సేయుదురో అట్టివారు ఐహిక సుఖము నందుటయే గాక పరమం దుత్తమగతి నందుదురు.' 'ఓ శివా యాత్మస్వరూపుఁడవగు నిన్ను దనకంటె వేఱుగాడను జ్ఞానముతో నెవ్వఁ డుపాసించునో యట్టివాఁడు తేజోరూపమగు బ్రహ్మమును బొందును.) దీనినే తిక్కయజ్వ—

'నినుఁ దనుఁగా నతి నిర్మల
మనస్సమాధి ప్రకర్ష మగ్నత వలనం
గనుగొని తద్రూప భజన
మొనరించు మహాత్ముఁ డమృతమొందుఁ బశుపతీ'
(ద్రోణ. 5—413.)

అని పేర్కొనెను. ఇది పైని నిరూపించిన 'యభేద భక్తి' భేదములలో మధ్యమ భక్తి.

పైని నిరూపించిన విధమున దేవతాభావము నందిన భక్తుఁడు దేవతతోఁ దన్ను నభిన్ననిఁగా భావించుకొని తద్భావనముతోడనే దేవార్చనమును గావించును. 'గురుదేవతాత్మ నామైక్యం విభావ్య' యనెడి యుపాసనా సూత్రము ఇట్టి స్థితికై వెలయింపఁబడినదే. తాదృశభావనమే యుత్తమ భావన మనియు నట్టి భావనము లేనివాఁడుత్తమ భావనా ఫలమునందలేఁడనియు శ్రుతిగూడ నిట్లు పల్కుచున్నది.

'అథయోఽన్యాం దేవతా ముపాస్తే, అన్యోఽసావన్యోఽహమ స్మీతి న సవేద యథా పశు రేవం స దేవానాం' (బృహ. 1—4—10)

(నేను వేఱు దేవతవేఱు అని తనకంటె దేవతను భిన్నముగాఁ దలఁచువాఁడు వాస్తవము నెఱుఁగఁడు. అట్లు దలఁచువాఁడు మనకుఁ బశువెట్లో దేవతలకు వాఁడట్టివాఁడగును)

కావున నుపాసకుఁడు దేవతను దనకంటె భిన్నముగాఁ జూడక స్వస్వరూపముతోడనే భావించి తద్దృష్టితో నర్చించుటయే శాస్త్రహృదయము. ఇదియే క్రమముగా సుపరిపక్వమయి యుత్తమాభేద భక్తియగును. ఇట్టి యుత్తమాభేద భక్తికిఁదగు మనః పరిపాకములేని వాఁడు తొలుత శాస్త్రప్రామాణ్యమునఁ దనయందలి సహజమగు నీశ్వరభావమును బరోక్షముగా నైనను దెలిసికొని తద్భావనముతో నుపాసించిన కొలఁది తద్భావనా విశేషముతోఁ దానుగూడఁ గ్రమముగా నీశ్వర భావమున పరోక్షముగా నందఁగలఁడనియు, సహజమగు నట్టి భావమును ద్రోసిపుచ్చి స్వస్వరూపమును వేఱుగా భావించుట దోషమనియు శిష్టవచనములు స్మృతులుగూడ నిట్లు దెల్పుచున్నవి—

'భావితం తీవ్ర వేగేన
వస్తు యన్నిశ్చ యాత్మనా
పుమాంస్తద్ధి భవేచ్ఛీఘ్రం
జ్ఞేయం భ్రమరకీటవత్.'
(అపరోక్షానుభూతి)

'యోఽన్యథా సంతమాత్మాన
మన్యథా ప్రతిపద్యతే,
కిం తేన న కృతం పాపం
చౌరేణాత్మాపహారిణా'. (సనత్సుజాతీయము)

(భావుకుఁడు నిశ్చయబుద్ధితోఁ దీవ్రముగా దేనిని భావించునో దాని రూపమునే దాను భ్రమరకీట న్యాయమునఁ బొందును) అనఁగాఁ దానే యావస్తువగును.' 'ఆత్మయొక్క వాస్తవరూపమును వేఱుగాఁ దలంచువాఁడు ఆత్మాపహారియగుచుఁ జోరుఁడయి సకల పాప భాజనుఁడగును.'

ఇట్టి భేదములేని భక్తినే ధర్మజుఁడు తన కాంక్షితముగఁ గృష్ణభగవానునిఁ గోరినట్లుగ వేణీ సంహార నాటకము తుదిని భట్టనారాయణునిచేఁ జెప్పఁబడినది—

'భవతు భగవన్ భక్తిః
ద్వైతం వినా పురుషోత్తమే.'

(వేజీ. 6—46)

యుధిష్ఠిరునికిఁ గావలసినది పురుషోత్తముని తోడి యద్వైత భక్తియఁట! ఇట్లే శిష్టులు తమ పవిత్ర వైదిక వాంఛగాఁ బరమేశ్వరుని 'తన్మే మనః శివసంకల్పమస్తు' అని సామాన్యముగఁ బ్రార్థించి, విశేష విషయముగా—

'చక్షు ర్హృదయే, హృదయం మయి (ఆత్మ చైతన్యే), అహమమృతే, అమృతం బ్రహ్మణి.'

అను నీ విధమునఁ దన సర్వస్వరూపమును బరమేశ్వరునియందు లయముగావించి పారమేశ్వర భావమును గోరుదురు. ఇట్టి యాశయముతోడనే శంకర భగత్పాదులు—

'మోక్షసాధన సామగ్ర్యాం
భక్తిరేవ గరీయసీ
స్వ స్వరూపాను సంధానం
భక్తిరిత్యభి ధీయతే.' (వివేక చూడామణి 32)

వ్రాక్కుచ్చిరి.

ఇట్లు మహాపురుష సేవతో నారంభమయిన యీ భక్తి క్రమముగా బహుభూమికల నంది భగవద్ధర్మనిష్ఠాపరత్వము, స్వ స్వరూపమున భగవద్భావన యనెడి భూమికలతోఁ బరాకాష్ఠ నంది జ్ఞానమునకుఁ బ్రధాన సాధనమై మోక్షహేతు వయినది. అట్టి భావనా విశేష ప్రతిపత్తికొఱకే యీ పరమేశ్వరారాధనమున బహుసాధనము లుపదేశింపఁబడినవి. కావుననే వైదికులగు నుత్తమభక్తు లిట్టి 'భేదములేని భక్తినే' యుత్తమభక్తిగాఁ బేర్కొనిరి.

'జ్ఞానేన మోక్ష మాప్నోతి
భక్తిః జ్ఞానాయ కల్పితే।
కృష్ణ ప్రసాదాత్ భక్తిః స్యాత్
తస్మాత్సేవ్యో హరిస్సదా' (హరికథామృతము)

ఇట్లు భగవత్ప్రసాద—భక్తి—జ్ఞానములకు నుత్తరోత్తర కార్యకారణ భావమును దెల్పి యంతతో నాఁగక ద్వైవానుగ్రహమువలనఁ గల్గు భక్తి స్వరూపము నిట్లు పేర్కొనిరి—

'హరిరాత్మైవ, తద్జ్ఞానం
భక్తి రిత్యభిధీయతే'

అని. అట్టివాఁడే యథార్థ భక్తుఁడనియు నట్టి భక్తియే మోక్ష ప్రాపకమనియుఁ గూడ—

'జీవన్ముక్తో హరేర్భక్తః
కర్మణాన విలిప్యతే' (హరికథా మృతము)

అని చెప్పఁబడినది. శ్రీకృష్ణభగవానుఁడు గూడ గీతయందుఁ దన భక్తులను నాల్గు విధములుగా నెన్ని యందుఁ దనతో నభేద భావము నందిన భక్తునే యుత్తమభక్తునిగాఁ దెల్పెను—

'చతుర్విధా భజన్తే మాం
జనాః సుకృతినోఽర్జున।
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ
జ్ఞానీ చ భరతర్షభ।
తేషాం జ్ఞానీ నిత్య యుక్త
ఏకభక్తి ర్విశిష్యతే॥ (భ. గీ. 7–16,17.)

ఇందుఁ దొలి యార్త, జిజ్ఞాసు, అర్థార్థులు ప్రయోజనాపేక్షలగుటచే గౌణభక్తులనియుఁ జతుర్థుఁడు మాత్రము 'నిరీహభక్తుఁడై' తననే స్వస్వరూపముగా భావించుటచే నుత్తముఁడనియు భగవానుఁడు పేర్కొనెను. ఇట్టి యభేద భావనా విశేషము శుద్ధ చిత్త వృత్తునకే గల్గునుగాని యితరునికిఁ గల్గనేరదు. దీనినే శ్రీ భగవత్పాదులు—

'ఉదేతి శుద్ధ చిత్తానాం
వృత్తి జ్ఞానం తతఃపరం'

(అపరోక్షానుభూతి)

అని దెల్పిరి.

ఇఁక నుత్తమ భక్తియనఁగా సర్వకాల సర్వావస్థలయందును స్వ స్వరూపమునఁ బరమేశ్వర భావమును మననము చేసికొనుట. ఇది జ్ఞాని స్థితికి, అనఁగా జీవన్ముక్త స్థితికిఁ బూర్వావస్థ. దీనినే శ్రీ కృష్ణ భగవానుఁడు—

'తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏకభక్తిః విశిష్యతే'

అని 'నిత్యయుక్త—ఏకభక్తి' శబ్దములతోఁ బేర్కొనెను. ఈతఁడు తన తీవ్రాభ్యాసమువలనఁ గ్రమముగాఁ తన

యందేగాక సర్వభూతములందును భగవద్రూపమును గాంచుచు భగవంతునియందుఁగూడ సకల భూతములను గాంచునట్టి యుత్తమ జ్ఞానావస్థనందఁ గల్గును. ఇట్టి స్థితియే జనన మరణరూప సంసారమును దొలఁగింపఁజాలిన యానందరూపమగు ముక్తావస్థ; తిక్కయజ్వ వాంఛితమును.

ఇట్లు భేదదృష్టితో నారంభమయిన భక్తి స్వ స్వరూపమున దేవతాత్వమును సంపాదింపఁ గడఁగి క్రమముగా దేవతతో నభేదభావము భావించుచు నట్టి యభేద భక్తితో ముక్తుఁ డగుననుట వైదికమార్గ ప్రవర్తకులగు మహానుభావులు వ్యవస్థచేసిన భక్తి మార్గము. అట్లగుటచే నిద్దానిని 'వైదికభక్తి' యని యందురు. ఇట్టి యభేద భావనములేని కేవల భేదభక్తి, తంత్ర సిద్ధ మగుటచేఁ దాంత్రికమేగాని వైదికము కాఁజాలదు.

ప్రకృతమున వేదమార్గ నిష్ఠాపరుఁడగు తిక్కయజ్వ భేదములేని భక్తి స్వరూపమును దెలిసికొనుటకై యిట్లు సామాన్య భక్తిస్వరూపము, భక్తిభేదములు, అవ్వాని స్వరూపములు విపులముగాఁ జర్చింపవలసి వచ్చినది. కాఁగా వైదికమార్గవర్తనుఁడై భేదములేని భక్తితోఁ జిత్తశుద్ధిగలవాఁడై పరమేశ్వరానుగ్రహము నంది 'ఇంక జన్మాన్తర దుఃఖముల్ దొలఁగునట్లుగఁ జేసి సుఖాత్ముఁ జేయవే' యని 'బ్రహ్మానందస్థితి' రూపమగు మోక్షమునుగోరిన తిక్కయజ్వయొక్క 'భేదములేని భక్తి' యెట్టిదియో మనమిపు డూహించుటకుఁ గొంత యవకాశము గలదు. అనర్హుఁడు ఉత్తమ స్థితిని గోరుటగాని, యొకవేళ స్వ స్వరూపా నభిజ్ఞతచే నట్టి గోరికను గోరినను బరమేశ్వరుఁ డద్దాని నను గ్రహించుటగాని యెన్నటికిని బొసఁగదు. తిక్కయజ్వ యట్టి కోరికను గోరుటలోనే యాతని మోక్షార్హతకు వలసిన 'యుత్తమాభేదభక్తి' సువ్యక్తమగుచున్నది. ఆతఁడు పరమేశ్వరుని నడిగిన వచనములోని 'ఇంక' అను పదమే యాతని యోగ్యతాభివ్యంజకము. 'నీతో నభేదభావముగల భేదములేని భక్తిరూప యోగ్యత గలవాఁడను గావున నింక బ్రహ్మానందస్థితి నను గ్రహింపవచ్చునని యందలి భావము. కావుననే పరమేశ్వరుఁడుగూడ—'జనన మరణాదులైన పంసార దురితములకు నగపడకుండఁగాఁ దొలఁగు తెరువు కను వెలుంగు నీ కిచ్చితి'నని ఆతనికి మోక్ష మార్గమును దెలియు జ్యోతి నను గ్రహించెను. కావున నాతని 'భేదములేని భక్తి'ని జ్ఞాని పూర్వావస్థానుగతమగు నుత్తమా భేదభక్తిగానే చెప్పట యుక్తమని తోఁచెడిని. బ్రహ్మానంద స్థితికిఁ దానర్హుఁడు గాదని చెప్పిన మాట (విరా. 1—22) యాతని వినయమును దెల్పునదే గాని వేఱొకటి గాదు. 'యావానర్థ ఉదపానే' (భ. గీ. 2—46) యను న్యాయముచే నాతని యుత్తమా భేదభక్తియందు సామాన్య మధ్యమా భేదభక్తులు రెండును సంతర్భవించి యుండును. అట్టి స్థితిగలవారు భేదభావము నెంతమాత్రము సహింపఁజాలరు. మహాభారత రచనా సమయమున కాతని కంతటి యుత్తమస్థితి గలిగినది. దీని కొక చిన్న యుదాహరణమును జూపుదును.

అర్జునుఁడు సైంధవ వధోపాయమును గృష్ణునితోఁ జర్చించి పాశుపతాస్త్రోన్మీలనమునకుఁ బరమ శివార్చనమును గావింప నెంచెను. ముందుగా గురు రూపుఁడగు శ్రీకృష్ణుని గంధమాల్యాదులతో నర్చించెను. 'తాను దొలుత శ్రీకృష్ణుని కర్పించిన గంధ మాల్యాదులు తాను స్వప్నస్థితియందుఁ గాంచిన శంకరుని సన్నిధానమున నుండుటఁగాంచి యాతఁడు మనసా కృష్ణుని శర్వుని గూడఁ బూజించెను' అని. ఇంతమాత్రము మూలభారతమునఁ గలదు.

'తత్ర ప్రీతమనాః పార్థః
గంధమాల్యైశ్చ మాధవమ్
అలం కృత్యోపహారం తం
నైశం తస్మై న్యవేదయత్.'
(ద్రోణ. 79–4,5)

తంచోపహారం సుకృతం
నైశం నైత్యక మాత్మనా
ద దర్శ త్ర్యంబకాభ్యాశే
వాసుదేవ నివేదితమ్.

తతోఽభి పూజ్య మనసా కృష్ణం
శర్వంచ పాండవః (ద్రోణ. 81–2,3)

ఇట్టి స్థితిలో 'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' 'నృణామేకో గమ్యస్త్వమసి పయసా

మర్ణవ ఇవ' అనెడి భావముతోఁ గృష్ణుని కర్పించిన మాల్యాదులు శివసన్నిధానమున నుండుటను సమర్థించుట కవకాశమున్నను, అంతమాత్ర భావనముతోఁ దృప్తినందని తిక్కయజ్వ మూలగ్రంథము శివకేశవాభేదమును సుస్పష్టముగఁ బ్రదిపాదింపలేదని కాఁబోలు తాను, కృష్ణునలంకరించిన మాల్యము శివుని సన్నిధానమున నున్నట్లు యథామూలముగ వర్ణింపక శంకరుని దివ్యదేహమునందే యున్నట్లు వర్ణించినాఁడు. మఱియు నంతమాత్రముతోఁ దృప్తిఁజెందక మూలములో వాచ్యముగాలేని హరిహరైక్యమును 'అమ్మురహర పురహరుల యేకత్వంబును మనంబునఁ గొనియాడి' (ద్రోణ. 2–368) యని తాను దన తృప్తి తీర వాకొనినాఁడు. ఇట్టిదేవతైకతా దృష్టి యభేదభక్తి భేదములలోఁ దొలి భూమికయే గాని యుత్తమాభేదభక్తికాదని పూర్వము నిరూపింపఁబడినది. అయినను దేవతాఽభేద దృష్టియందాతనికిఁ గల యభినివేశమును జూపుటకు దీని నుదాహరించితిని. కనుకఁ దిక్కన విషయమున హరిహరనాథుఁడు ప్రయోగించిన 'భేదములేని భక్తి' వచనముకింత మాత్రమే యర్థము చెప్పిన నయ్యది కించితర్కమే యగును గావున యాతనిఁ 'భేదములేని భక్తి' యుత్తమాభేద భక్తియేగాని వేఱొండుగాదు. వేఱొక చిన్నవిషయమును బరిశీలింతము.

ముక్తాస్థితికిఁ బ్రధాన సాధనమగు 'మతి నిర్మల వృత్తి' అనఁగా జిత్త నైర్మల్యము; అది తిక్కయజ్వకు 'మత్పాద నిరంతర స్మరణ తత్పర భావము'చేఁ గల్గినదని పరమేశుఁడు పలికెను. దీనిని బట్టి తిక్కయజ్వ యనవరత పరమేశ్వర పాదస్మరణ తత్పరుఁడని తెలియును. ఇందుఁ బరమేశ్వర పాదస్మరణమనఁగా నేదియో విచారింపవలయును.

లోకములోఁ బాదచరణాది శబ్దములు గమన క్రియా సాధనమగు ప్రాణ్యంగ విశేషమునఁ బ్రయోగింపఁబడుచున్నవి. 'ఆచార్యపాదులు, భగవత్పాదులు' మున్నగు చోటులందుఁ బూజ్యవాచకముగఁ గూడ నీ శబ్దములు వ్యవహరింపఁబడుచున్నవి. కాని భక్త వ్యవహారమున మాత్రము పరమేశ్వరునికి నొక మూర్తిని గల్పించి యద్దాని పాదములను బూజించుట, ఆశ్రయించుట, నమస్కరించుట మున్నగు వ్యవహారములు అగపడుచునే యున్నవి. ఇవి యార్య సంప్రదాయము ననుసరించి యవశ్య కర్తవ్యరూపములగు ప్రశ్రయతా సూచక ధర్మములు. పాదప్రణామాది క్రియలు ప్రశ్రయతా సూచకములుగా నుపపన్నములగుఁ గాక; స్మరణము గూడ నట్టిదగునా? స్మరణము కేవల ప్రశ్రయత్వమునకే గాక పలుభావములకుఁ గలుగవచ్చును గదా! మఱియుఁ బ్రధానాంగమగు వదనమును గాని పరిపూర్ణాకృతిని గాని స్మరించుట లెస్సగా నుండును గాని పాదమును స్మరించుటయేమి యను విచికిత్స గల్గినను లోకమున మాత్ర మిట్టి వ్యవహారము పూజ్యుల విషయమునఁ గలదు. తన్మూలముగా నీ వచనము ప్రవర్తించెనవి చెప్పుట కవకాశము గలదు. అయినను బాదస్మరణ శబ్దమునకుఁ బ్రకృతోపయుక్తమగు వేఱొక యర్థమును గ్రహించినచో నెట్టి దోషము లేదు గదా! కావున నట్టి దృష్టితో నరయుదము.

ప్రకృతమునఁ బారమేశ్వర పాదస్మరణముచే నాత్మానందము గలిగినట్లు చెప్పఁబడినది. సామాన్యముగా భక్తులకు నానందము గల్గించునది పరమేశ్వర దివ్య మంగళ విగ్రహము, కాని కేవల పాదమాత్రముగాదు. అందునను ఆత్మానందమును గలిగించినది పాదస్మరణమని చెప్పుటచే నిందలి పాదశబ్దమునకుఁ బ్రాణ్యవయవ రూప గమన సాధనము గాక వేఱొక యర్థమును గ్రహించుట యుక్తమని తోఁచుచున్నది.

ఇంద్రియ గోచరమగు నీ భౌతికాకృతి పరమేశ్వరుని వాస్తవరూప మెంతమాత్రము కాదని పూర్వము చెప్పఁబడినది. కావున సర్వవ్యాపియగు పరమేశ్వరుని రూపమును వర్ణింప దొరకొనిన శ్రుతి అని పలికెను.

'పాదోఽస్య విశ్వా భూతాని,
త్రిపాదస్యా మృతం దివి.' (పురుషసూక్తము)

ఇందుఁ బాదశబ్ద పురస్కారముగఁ బారమేశ్వరరూపము వర్ణింపబడినది. సర్వభూతములు పరమేశ్వరుని యొక పాదము. మిగిలిన మూఁడు పాదములును అమృతరూపమున ద్యులోకమునందున్నవి. ఇది పై మంత్రముయొక్క యర్థము. ఈ పారమేశ్వరపాదత్రయ స్వరూపమును వర్ణించుట కుపక్రమించిన 'త్రిపాద్విభూత్యుపనిషత్తు' తొలుతఁ బర

మేశ్వర పాదములను వాని స్వరూపమును నిట్లు వర్ణించినది—

'పాద చతుష్టయాత్మకం బ్రహ్మ అవిద్యా పాదః, సువిద్యా పాదః, ఆనంద పాదః, తురీయ పాదశ్చేతి, అధస్తనమేకం పాద మవిద్యా శబలం భవతి ఉపరి తన పాదత్రయం శుద్ధబోధానంద లక్షణం అమృతం భవతి' (త్రిపాద్విభూత్యుపనిషత్)

దీనినిబట్టి శ్రుతి యనంతమగు పారమేశ్వర రూపమును లోకవ్యవహారానుగుణముగ జిజ్ఞాసువులకు బోధింప నాల్గు భాగములుగ విభజించి యొక్కొక్క భాగమును బాదములుగ వ్యవహరించినట్లు సుస్పష్టమే. అట్టి పారమేశ్వరరూప విభూతిస్మృతి తద్విచారముల వలన భక్తుని ఉత్తమజ్ఞానము మహానందము కలుగు ననుటకు శ్రీకృష్ణ భగవానుఁడు తనవిభూతియోగము నందుఁ బేర్కొనిన—

'ఏతాం విభూతిం యోగంచ
మమయోవేత్తి తత్త్వతః।
సోఽవికంపేన యోగేన
యుజ్యతే నాత్ర సంశయః' (భ. గీ. 10–7)

(నా యీ విభూతిని దెలిసికొన్నవాఁ డుత్తమ జ్ఞాని యగును)

యను గీతమే ప్రమాణము. కావునఁ దిక్కయజ్వ కృత 'పారమేశ్వర పాద నిరంతర స్మరణ' శబ్దమునకుఁ బర మేశ్వర పాదచతుష్టయరూప విభూతిని స్మరియించుట యను నర్థమును గ్రహించినచో యుక్తముగా నుండునని తోఁచుచున్నది.

ఇట్లే పరమేశ్వర వచనములలోని తిక్కయజ్వ కొనియాడు 'కావ్యరస' స్వరూపము గూడఁ బ్రకృత ప్రకరణమునఁ గొలఁదిగా విచారించుట యప్రస్తుతము కాదు. లోకమునఁ గాళిదాసాదులకుఁ గవులనియు నవ్వారల గ్రంథములకుఁ గావ్యములనియు నట్టి కావ్య విచారణమువలనఁ గల్గిన సంతోషమునకుఁ గావ్యానంద మనియు సుప్రసిద్ధ వ్యవహారము గలదు. ఇట్టి యానందము సామాన్య సాహిత్య జ్ఞానముగల సర్వ జనులకును సాధారణమే యగును. అట్టియెడ విశిష మగు తిక్కయజ్వ యోగ్యతను గొనియాడఁ దలఁచిన పరమేశ్వరుఁడు 'కావ్యరసముం గొనియాడుట' యను దాని నొక యసాధారణ యోగ్యతగాఁ దెల్పుట యెంత వఱకు యుక్తముగా నుండును ? అట్టి యర్థము సామాన్యుల విషయమునఁ దెల్పుట యుచితము గాని తిక్కయజ్వవంటి యుత్తమ జ్ఞానసంపన్నుని విషయమునఁ దెల్పుట యుచితమగునా? కావునఁ 'గావ్యరస' శబ్ద మునకుఁ బ్రకృతోపయోగియగు నర్థమును దెలుప యత్నింతము.

ఋషి వ్యవహారమునఁ గవి శబ్దమునకు జ్ఞాని యను నర్థమగపడుచున్నది. 'కవిర్మనీషీ పరిభూః స్వయంభూః' 'కవయోవదన్తి' 'కవిం కవీనా ముపమ శ్రవస్తమం' (ఋగ్వేద. 2–23–1) అను శ్రుతుల యందును, 'కవిం పురాణమను శాసితారం' (భ. గీ. 8–9) మున్నగు స్మృతులయందును గవిశబ్దము జ్ఞానిశబ్ద పర్యాయముగాఁ బ్రయోగింపఁబడినది. అట్టి కవియొక్క కర్మ కావ్యమగును. అప్పుడు కావ్యమనఁగా జ్ఞాని వ్యవహారము. అయ్యది యుపనిషద్రూపము. అందలి రసము బ్రహ్మానందరూపము. అట్టిదానికే 'రస' వ్యవహారము ముఖ్యము. అది 'రసోవైసః' అను దానియందు సుప్రసిద్ధముగదా! కావునఁ గావ్యరస శబ్దమునకుఁ నౌపనిషద రసమును నర్థముగా గ్రహి యించినచోఁ బ్రకృతార్థము సమ్యగుపపన్న మగును.

ఏతావతా వక్తవ్యమగు విషయము—పరమేశ్వర వచనమగు 'వైదికమార్గ నిష్ఠమ'ను పద్యమునందలి పదజాలమంతయు వైదికకర్మనిష్ఠుఁడు ఉత్తమజ్ఞాన సంపన్నుఁడునగు తిక్కయజ్వకు సంబంధించినదగుట చేతను, అవన్నియుఁ బరస్పర సంబద్ధములగుటచేతను, అవ్వానికి లౌకికమగు దృష్టితో నేదోయొక యర్థ మును నిర్వచించుట కంటెఁ దిక్కయజ్వ యధి కారానుగుణముగ (యోగ్యతనుబట్టి) నర్థమును దెల్పుట న్యాయ్యము. లోకవ్యవహారమున నేదేని యొక శబ్దమునకు నర్థమును నిర్ణయించునపుడు అర్థనిర్ణాయక లింగములను బట్టియుఁ బయోక్తృ ప్రయోగ విషయాదుల యోగ్యతనుబట్టియు నర్థ మును నిర్ణయింపవలయునని పదవాక్య ప్రమాణజ్ఞుల శాసనము. కావున నివ్వాని నన్నింటిని గమనించి తిక్కయజ్వభేదములేని భక్తిస్వరూపమును ద్వైవిధము ననే నిర్ణయించుట యుక్తమని దోఁచినది. దానిని బట్టియే యీ పద్యమునందలి యితర పదములకును నర్థము నుక్తవిధమున గ్రహించినచోఁ దిక్కయజ్వ వాస్తవ స్వరూపమును గ్రహియించినవారల మగుదు మని భావింతును. [సమాప్తము]

వసుధపై ప్రతిబింబంతో

శ్రీ మాదిరాజు రంగారావు

నిదురకూ మెలకువకూ మధ్య
వంతెన వలె మనస్సు.
వంతెనపై పయనించే
వాస్తవిక ప్రతిబింబాలు
అనుభవమూ అవసరమూ
పొదివికొని బ్రతుకులో
ఎద ఎదలో నాదంతో
చరించే వివిధ భూమికలు.

స్వేచ్ఛా స్వాతంత్ర్యంతో వెలుగులు
బంధాలు త్రెంచుకొన్న నీడలు
గతంనుండి విడి వడి
మెలకువతో వెలుగుతూ
సామాజిక సోపానాలపై
తరలేవి భవితవ్యంలోకి.

ఇవి రావు
దాచుకొని నోట్లో బాంబులు.
ఇవి రావు
అంబూకృతం చేస్తూ నిప్పులు.

ఊపిరిలో ఉత్సాహం
రక్తంలో ఆవేగం
శరీరంలో జీవధార
పొంగే వెలుగులతో
ఇవి అవును—
జడత్వం విదల్చి
నవత్వం కూర్చే శక్తులు.

ఒక భౌతిక పరివర్తనకే
పరిమితం కాదు మార్పు
మనః పరిణతి పొందినపుడే
సిద్ధిస్తుంది సంపూర్ణ వికాసం

* * *

బ్రతుకులోని బరువునూ
చావులోని నిశ్శబ్దాన్నీ
భూమినీ ఆకాశాన్నీ,
గతంలోని గాంభీర్యాన్నీ
భవిష్యత్తులోని విస్తృతినీ
సముద్రాన్నీ దిక్చక్రాన్నీ,
ఎత్తులోని ఆశ్చర్యాన్నీ
లోతులోవి స్థైర్యాన్నీ
అహంనూ వినయాన్నీ,
వర్తమాన అస్తిత్వాన్నీ
క్షణం క్షణం సంచలనాన్నీ,
గత బిందువుతో
ఒకే చోట కలిపే రేఖ
నవనవోన్మేష రూపం.
కాదు వినాశన యంత్రం
లేదు ఉన్మత్తిష్ణ ప్రలాపం.

మళ్ళీ చెబుతున్నా—
శ్మశానంలో నిజంకాదు
పచ్చని జీవితం.
సమాధినుండి ఎగసిరాదు
ఛాయా వృక్షం,
హింసతో
ఊపిరి తీసుకోదు
వ్యక్తి స్వాతంత్ర్యం.

వసుధపై ప్రతిబింబంతో

రక్తంతో
సౌభాగ్యం పల్లవించదు
జనతా కేదారం.

కత్తి అవసరమే
మేరలు మీరితే
ఉత్తరిస్తుంది అదే
ఎత్తిన నీ తలనే.

పురాణ శిథిల రూపంలో
శ్మశాన ధూమ భావనతో
నిదురించే రాత్రి
నీ ఇంటి తలుపులు తట్టి
ఎంత గొంతు చించుకుంటేం ?
నీవు లేవవుగా
తలుపులు తెరవలేవుగా
అందుకే నీకు తెలీదు
ఎంతకూ నా రూపం.

తెలిసింది నాకు
ఘృణాక్షర న్యాయమతీ !
తలుపులు బద్దలుకొట్టి
నిను లేపిందే ఇదిగో
ఈ చేయి పట్టుకొని లేచిరా

హత్తుకొని ఎదకు ఎద,
కాంతి జలస్ఫార నేత్రాలతో
శాంతి సహనముఖ తోరణంతో.

హృదయంలో ఉదయం రానీ
పెదవిపై రాగం విరియనీ,
దివారాత్రాలకు వ్యాఖ్యానమై,
మాటలో ఊహలు పాడనీ
చూపులో మాటలు వెలగనీ,
శబ్ద శక్తులకు ప్రతీకగా.

ఎదురుగా ఎవరనుకున్నావు
నిను జ్ఞప్తికితెచ్చే మనోభూమికలు !
రానీ కోపం
శ్రేయో మృదుభావనతో
పొందనీ ఆవేదన
అనురాగ సమార్ద్రమై,
నడువు దిక్కుల్లోకి
కలువు స్వేచ్ఛగా
ఇళ్ళలోని వ్యక్తుల్నీ
ఇళ్ళముందు తీవెల్నీ,
మనలో వసుధైక కుటుంబం
వసుధపై మన ప్రతిబింబం.



మనుషులు - మరలు

శ్రీ పాలడుగు వేంకటేశ్వరరావు

తల్చుకుంటే చిత్రమన్పిస్తుంది ఇప్పుడు !

చిన్నప్పుడు నాకు భలే కలలు వచ్చేవి.

రంయిమని ఆకాశంలోకి ఎగిరినట్లు, తెల్లని మబ్బుల్ని దాటుకుంటు వేగంగా పోతువున్నట్లు, కింద నున్న భూమి మీది ఇళ్లు, చెట్లు చిన చిన్న చీమల్లా అవుపించినట్లు — అలా అలా తేలిపోతూ -- పోతూ వున్నట్లుండి ఒక్కసారిగా క్రింద పడిపోతు వున్నట్లు అన్పించేది. భయంతో గట్టిగా కళ్లు మూసుకునే వాడ్ని. అంతలోనే మెలకువ వచ్చేది. మంచం మీద గజ గజ వణుకుతూ ఒళ్లంతా చమట్లు పట్టి నేను మిగిలిపొయ్యేవాణ్ని. రెండు గ్లాసులు మంచినీళ్లు తాగి మరల పడుకొనేవాడ్ని.

అదంతా జాపకం వచ్చి నవ్వు వచ్చింది నాకు. అప్పుడే సూర్యు డస్తమిస్తున్నాడు. నా ప్రక్కనే నిలబడి కొండల్ని, కింది లోయల్ని, పచ్చటి చెట్లనీ, అటు ప్రక్కగా తరంగాలతో ఎగిరిపడ్తూవున్న సముద్రాన్ని చూస్తువున్న నా భార్య నన్ను గమనించి 'ఏమిటి నవ్వుతున్నారు ?' అని అడిగింది గాభరాగా.

'ఏం లేదు వూరికినె' అన్నాను.

ఆ సమాధానం ఆవిడ్ని సంతృప్తి పరచనట్లు ఆమె చూపులు తెలిపాయి. నా వంక అనుమానంగా చూస్తూ 'సర్లెండి రండి. ఫలహారం చేద్దాం! అని ప్రక్కగావున్న చదునయిన ప్రదేశం వంక నడిచింది.

ఇప్పుడు నా వయసు అరవై సంవత్సరాలు. నా భార్యకి యాభైయ్యయిదు నేను యూనివర్సిటీలో ఫిజిక్సు ప్రొఫెసర్‌గా పనిచేసి రిటయిరయ్యాను. మాకు ఒక అమ్మాయి. ఆమె ఎం. ఏ పూర్తిచేసి యూనివర్సిటీలో లెక్చరరుగా పనిచేస్తున్నది. ఆమెకి ఇంకా వివహం కాలేదు. కాని మాకు తెలుసు. మా **అమ్మాయి** వనజ **ఇంగ్లీషు** ప్రొఫెసరు రామారావు కొడుకు కృష్ణరావుని ప్రేమించింది. అతనూ మా అమ్మాయిని ఇష్టపడ్డాడు. వారు కోరిన కట్నం కానుకలు ఇవ్వటానికి మేము సిద్ధపడ్డాము. కాని మా ప్రయత్నాలకి ప్రొఫెసరు రామారావు అడ్డుపడ్డాడు. ఏ కారణంవల్లనో అతను మా సంబంధానికి ఇష్టపడటం లేదు. అది మాకు ఈ వయసులో భరించలేని విచారానికి హేతువయింది. నిరాశతో వనజ చిక్కి సగమయింది. కృష్ణరావు భగ్న హృదయుడై పై చదువుల మిషమీద మద్రాసులో వుంటున్నాడు. కాని మాకు తెలుసు. వారిద్దరిమధ్యా ఈ నాటికీ ఉత్తరాలు నడుస్తూ వున్నాయి. వారి ప్రేమ ఫలిస్తుందా అన్నది మాకు సమాధానం దొరకని ప్రశ్నే అయింది.

ఆ యువకుల ప్రేమని సఫలం చెయ్యటానికి ఇంకా నేను ప్రయత్నిస్తూ వున్నాను. కాని ఏ కారణం వలన ప్రొఫెసర్ రామారావు మా సంబంధం **గురించి** ముభావం చూపిస్తూ వున్నాడో—అదే **కొరుకుడు** పడటం లేదు, నాకు.

చెప్పద్దూ! ఈ మధ్యనే ఒక చిత్రం జరిగింది.

ఏడాది క్రితమే ప్రొఫెసర్ షిప్పునుంచి రిటయిరయినా నేను పుస్తకాన్ని వదలలేదు. నా 'రిసర్చి'ని సడలనీయలేదు. న్యూటన్ మహాశయుని గురుత్వాకర్షణ సిద్ధాంతంమీద రాత్రింబవళ్లు నిర్విరామంగా కృషి చేసాను నేను.

ఏదయినా ఒక పద్ధతివలన ఆ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని భగ్నం చేయటమే జరిగితే—అప్పుడు మనిషి పక్షిలాగ ఎగరటానికి—సునాయాసంగా ప్రయాణించటానికి వీలుపడుతుంది. అదే నా ప్రయత్నం. కొన్ని సంవత్సరాల కృషి తర్వాత నేను నా ప్రయత్నంలో సఫలీకృతుణ్నయాను! ఇందులో పెద్ద విశేషం లేదు. ఒక చిన్నమర. అగ్గిపెట్టె అంతది. **అందులో**

వలయాకారంగా చిన్న మాగ్నెట్‌లని అమర్చాను. అవి విరుద్ధ మార్గాలగుండా పరస్పరం వికర్షించుకొనే టట్లు చేసాను. దానికి ఒక ప్రక్కన చిన్నమరమేకు అమర్చాను. ఆ మేకుని తిప్పి లోపలికి బయటికి నడు పటం ద్వారా ఆ, వికర్షణ శక్తిని పూర్తిగా కంట్రోలు చేసే ఏర్పాటు చేసాను. అద్భుతమయిన శక్తి సృష్టింప బడింది!

నిజం!

నా కల నిజమయింది!

అత్యద్భుతమయిన సంగతి ఇది నిజంగా.

ఈ విషయం నా భార్యకి చెప్పాను, అప్పుడే కాని—అంతా విని కృంగిపోయి ఆమె ఏడ్చింది.

'పిచ్చిదానా! ఎందుకు ఏడుపు? ఎంత గొప్ప ఇన్వెన్షన్! ఎఫ్. ఆర్. ఎస్. ఖాయం. ఇక మన పేరు దశదిశలా మార్మ్రోగుతుంది. కావలసినంత డబ్బు' అన్నాను, నా కంగారును కప్పిపెట్టుకుంటు.

ఆమె మరింత ఏడ్చింది. ఏడ్చి—

'అదేనండి. నా విచారం. ఇప్పటివరకు మీరు నా భర్త. ఇక ఈ సంగతి గనుక ప్రపంచానికి వెళ్ల డైతే మిమ్మల్ని ఆకాశానికి ఎత్తివేస్తారు. శాస్త్రజ్ఞుల సమావేశాలకి పిలుస్తారు. ఉపన్యాసాలు ఇప్పిస్తారు. సన్మానాలు చేస్తారు. ఇక మీరు నాకు దక్కరు. దక్కనీయదు ప్రపంచం.' అని కళ్లు వత్తుకుంది.

నేను కరిగి నీరయాను. దాదాపు నలభై యేళ్లుగా అనుకూలమైన దాంపత్యం నాతో నెఱపిం దామె. 'చెప్పు. నువ్వు ఏంచెయ్యమంటే అది చేస్తాను. నాకు నీకంటె ఎవరూ ఏమీ ఎక్కువ కాదు.' అని ఓదార్చాను ఆమెని.

ఆమె నాచేత చేతిలో చెయ్యి వేయించుకుంది.

నానుంచి మాట తీసుకుంది.

'ఈ సంగతి ఎవరికీ తెలీనీయకండి. మీాకు పుణ్యం వుంటుంది. ఏది ఏమయినా నేను లెక్క చెయ్యను. నాకు మీరు కావాలి. మీ శాస్త్రం వద్దు. మీ సంపాదన వద్దు. పేరు ప్రఖ్యాతులు వద్దు. నాకు మీరు మాత్రమే కావాలి' అంది.

నేను ఆశ్చర్యపోయాను.

'మరి ఇంత కృషిచేసి మహత్తరమయిన విషయం కనిపెట్టి దీన్ని వ్యర్థంగా నశించిపోనీయాల్సిందేనా? ఉపయోగం ఏమిటి?' అన్నాను.

'కావాలంటే మీావరకు మీారు ఏమిచేసి గొడవపడినా నాకు బాధ లేదు. కాని ఈ విషయం మరో నర మానవుడికి తెలియటానికి వీలులేదు. అంతే' అంది ఖండితంగా. అని నన్ను కట్టిపడేసింది.

నేను కనిపెట్టిన ఈ విషయాన్ని ఒక మరగా అమర్చి అగ్గిపెట్టివంటి చట్రంలో ఇమిడ్చాను. దాన్ని బయటికి కనపడనిస్తే ఎవరయినా ఏమిటని అడిగే ప్రమాదం వుంది. అందుకని మా ఇంట్లో ఒక పాత సంచివుంటే అందులో ఆ మరని అమర్చి ఆ సంచిని బుజానికి తగిలించుకున్నాను. స్క్రూమేకుని సరియైన స్థానంలో వుంచి ప్రయోగాలు చేసాను. మేకుని లోనికి బయటికి తిప్పించి పరీక్షలు చేసాను. నా కాళ్లు తేలి పోతున్నాయి.

బరువే అన్పించటంలేదు.

ఎంత నడిచినా ఆయాసం లేదు.

మైళ్లకి మైళ్లు పరుగెత్తినా ఏమీ అన్పించటంలేదు. అలసటే లేదు.

స్క్రూని మరొక చుట్టు త్రిప్పాను.

గాలిలోకి తేలిపోతున్నాను.

పక్షిలా ఎగుర గలుగుతున్నాను. గురుత్వాకర్షణని జయించాను!

రాత్రుళ్లు ఎవరూ చూడకుండా—నా 'మర'తో అద్భుతమయిన ప్రయోగాలు చేసాను. ఎంతో ఆనందంగా అన్పించింది! నిజంగా ఎంత అద్భుతమయిన సంగతిది! నా వ్యవహారం చూసి నా భార్య సణగటం మొదలుపెట్టింది.

ఇక లాభం లేదని ఆమెకోసం మరొక మరని తయారుచేసాను. చాలా సింపుల్. అయినా అద్భుతమయిన శక్తి కలిగినది ఈ మర. చివరికి ఆ పిచ్చి ఆమెకీ అంటింది!

ఇంకొక పాత సంచిని తనూ తన బుజానికి బిగించుకుంది. అందులో ఆ మరని అమర్చింది.

ఆమె బుజానవున్న మరయొక్క స్క్రూని నేను తిప్పాలి.

నా బుజానవున్న స్క్రూని ఆమె సరిచేయాలి.

ఎవరి మర వారు సరిచూసుకోవటానికి చేతులు అందలేదు. అది దాని వైలక్షణ్యం! జీవితంలోలా ఈ సాహస కార్యంలో కూడా ఒకరికొకరం తోడు.

కొత్త పిచ్చవాళ్ళవలె మాకు ప్రొద్దు తెలియ లేదు. ప్రొద్దుటే అన్నం తిని కాస్త టిఫిను మూట కట్టుకుని ఇద్దరం కలిసి ముడగుర్లోవ, యారాడకొండ డాల్ఫిన్సునోసు అన్నీ తిరిగి చీకటిపడ్డాక ఇల్లు చేరే వారము.

మమ్మల్నిచూసి మా కాలనీలోవాళ్ళు కళ్ళు ఇంతచేసుకుని అదోకరకంగా చూసేవారు. ఈ విషయం మా వనజకి కూడ తెలీనీలేదు మేము! వాళ్ళ ఆశ్చర్యం — అది ఎందుకో మాకు అర్థంకాదు.

అయినా వాళ్లనిచూసి మాకు నవ్వు వచ్చేది.

మేము ఎంతటి శక్తిమంతులమో వాళ్ళకి తెలియదు గదా!

ముఖ్యంగా ప్రొఫెసర్ రామారావు నన్నుచూసి మొహం చిట్లించేవాడు. రోజంతా తెగతిరిగి నా తల అస్తవ్యస్తంగా వుండేది. మొహం జిడ్డుగారుతు వుండేది. బట్టల్నుగురించి అంత శ్రద్ధ తీసుకొనే వాడ్నిగాను నేను. ఈ మధ్య అంతగా క్లబ్బుకి వెళ్ళటం తగ్గించాను. ఏమో! దానిగురించి ఎవరయినా అడిగితే! అప్రయత్నంగా నా రహస్యం నేను బయటపెడితే...! మా యావిడ వూరుకోదు. అందుకే వీలయినంత వరకు నా ప్రపంచంనుంచి బయటి ప్రపంచాన్ని వేరు చేసాను.

ఎంతసేపూ నాకు ఇదే ధ్యాసయింది.

తలుపులన్నీవేసి—రెండు మరల్నీ డిస్‌మాంటిల్ చేయటం ఆయిలింగు చేయటం, మరల సక్రమంగా కూర్చి కండిషన్‌లో వుంచటం, స్క్రూలు సరిగా పని చేస్తున్నాయో లేదో చూసుకోవటం. రాత్రుళ్ళు వాట్నే ధరించి రకరకాల ప్రయోగాలు చెయ్యటం పగళ్ళు నిర్జన ప్రదేశాల్లో కాలక్షేపం!

ఈ సంవత్సరకాలంగా ఇదే లోకమయింది నాకు. నాకంటె పిచ్చిదిగా తయారయింది ఆవిడ.

ఒక సోషల్ గాథరింగు, ఒక ఫంక్షను, ఒక మీటింగు, ఒక ఫ్రండ్స్‌తో బ్రిడ్జిఆట, ఒక డిన్నర్‌కి వెళ్ళటం— ఏంలేదు పాత అలవాట్లన్నీ పోయేయి. ఆలోచించుకుంటే నాకే ఆశ్చర్యమన్పిస్తుంది. నేనెంత మారిపోయాను! నేను ఏమయిపోతాను?! ఏమో!

ఎంతో శ్రమించి, ప్రకృతికి విరుద్ధంగా ఒక శక్తిని సృష్టించి— దాన్నిగురించి ప్రపంచానికి తెలియ కుండా ఎంతకాలం దాచి వుంచగలను?

'ఏమిటి? ఆలోచన? రండి. ఫలహారానికి' అంటూ మరల పిలిచింది నా భార్య.

ఆలోచనల్నుంచి బయటపడి ఆమెదగ్గరకి నడి చాను. ఆమె బుజంనుంచి తన సంచీ తీసింది.

అందులోంచి బ్రెడ్‌జామ్, అరటిపళ్ళుతీసి నాప్ కిన్ పరిచి ఎదుటపెట్టింది. తన బుజంమీది సంచినితీసి ప్రక్కనపెట్టింది. అందులో ఆ మర వుండింది. కబుర్లు చెప్పుకుంటూ ఫలహారం కానిచ్చాము ఇద్దరమూ. నా భార్య ఎందుకో విచారంగా వుంది.

'ఎందుకు విచారం?' అన్నాను.

'ఏం లేదు. మీరు కనిపెట్టిన ఈ మర సహాయంవల్ల సునాయాసంగా కొండలు ఎక్కగల్గు తున్నాము. ఆకాశంలో ఎగుర గల్గుతున్నాము. చిత్ర విచిత్రమయిన మానవ సాధ్యంగాని పన్లు చెయ్యగల్గు తున్నాము. గొప్ప విశేషమే. కాని వనజని చూసారా? తను బెంగపెట్టుకుని రోజు రోజు క్షీణించి పోతు వుంది. మీరు ప్రొఫెసర్ రామారావుకి నచ్చచెప్పి పెళ్లికి వప్పించలేరా? ఇంత చేసినవారు ఆ చిన్న పని చెయ్యలేరా? అని' అంది సాలోచగా.

'అదే ఆలోచిస్తున్నాను. కాని ఆ పెద్దమనిషి ఇటీవల నన్ను చూడగానే మొహం చిట్లిస్తున్నాడు... నా వైపు క్రూరంగా చూస్తున్నాడు'

'ఏం? మీ మొహాన ఆయనకి గబ్బిలాలు కన్పడుతున్నాయా?'

'అదే అర్థం కావటం లేదు. మే మిద్దరం మంచి మిత్రులమే. కాని ఇటీవల అతను నామీద అకారణంగా వైరం పూనాడు...'

'ఏమయినాసరే. అమ్మాయి పెళ్లి ఆగటానికి వీలులేదు. సామదాన భేదోపాయాల ఆ పని కానివ్వాలి' అంది ఖండితంగా.

'అవును' అన్నాను.

ఇంతలో మా ఆవిడ కెవ్వున కేకవేసింది.

'ఏమయింది? ఏమిటి? అంటు తత్తర పడ్డాను.

'అదుగో అటుచూడండి' అంటు ఆకాశం వయిపు చూపించింది ఆమె. చూశాను.

ఆకాశంలో ఎత్తుగా పైకి తేలిపోతూ—అప్పటి వరకు ఆమె ధరించిన మరతోవున్న ఆ సంచీ చిన్నగా అవుపిస్తూంది.

'అదేమిటి? సంచిని తీసి కింద పెట్టేటప్పుడు స్క్రూని తిప్పలేదా?' అన్నాను.

'ఉహూ. మరిచిపోయాను.' అంది కంగారు పడుతూ.

ఆ సంచిలోని స్క్రూ ఆమె బరువుకి అను గుణంగా తిప్పివుంది. సంచిని తననుంచి వేరు చేసే టప్పుడు ఆమె ఆ స్క్రూని సరిచేసి వుండాల్సింది. ఆమె మరిచిపోయి ఆ పనిచేసి వుండలేదు. అందువలన మరపనిచేసి సంచిని ఎగరవేసుకుపోయింది! బరువు తగ్గటంవలన.

'ఇప్పుడు ఎట్లా?' అంది ఆవిడ!

'ఇక ఆ సంచిని అందుకొనే వుపాయం లేదా?' అంది మరల.

'ఉహూ. లాభంలేదు. అందుకు ప్రయత్నించి ఫలితం లేదు. సంచీ చాల ఎత్తుకు ఎగిరిపోయింది' అన్నాను.

ఆవిడ బిక్కమొహం వేసింది.

మేము శిఖరాగ్రాన వున్నాము. మర సహాయం లేకుండా ఆవిడ స్వయంగా కిందికి దిగటం కష్ట భూయిష్టమయిన పని.

'ఏం చేస్తాం చెప్పండి?' అంటు ఆవిడ బిక్క మొహం వేసింది.

అప్పుడె చీకటిపడుతువుంది.

పట్నంలో దీపాలు వెలిగాయి.

నేను ఒక వుపాయం ఆలోచించాను.

ఆవిడని సామాన్లు సర్దమన్నాను.

నా బుజానికివున్న సంచిలోని మరని మా ఇద్దరి బరువుకి సరిపడా రెండుసార్లు తిప్పమన్నాను. ఆవిడ ఆపని చేసింది. చేసి నన్ను గట్టిగా పట్టుకుంది. ఆవిడ నడుంచుట్టూ నాచేయి బిగించాను.

మేము మెల్లగా గాలిలోతేలి కిందికి దిగ సాగేము.

చల్లనిగాలి మెల్లగా వీస్తూవుంది.

అప్పటికే చీకటి దట్టంగా అలుముకుంది. మమ్మల్ని ఎవరూ గమనించే అవకాశంలేదు.

మేము మా ఇంటిదగ్గరికి వచ్చేసరికి ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. నన్ను గుమ్మందగ్గరనే వదిలి— స్క్రూని నా బరువుకి సరిపడేట్టు త్రిప్ప కుండానే— వనజని చూడాలన్న ఆదుర్దాతో మా యావిడ గబగబ లోనికి వెళ్లిపోయింది నన్ను విడి పించుకుని.

అంతలోనే— విచిత్రంగా నేను పైకి తేలి పోతున్నాను!

నా కాళ్ళు భూమినించి క్రమంగా విడివడ్డాయి.

వెనుక బుజానవున్న మరస్క్రూని అందుకో టానికి విఫలప్రయత్నం చేసాను. అది అందలేదు. ఈలోగానే—

అడుగు.

రెండడుగులు.

నాలుగడుగులు.

ఇట్లా పదిఅడుగులవరకు నేను గాలిలో తేలి పోయాను.

గాలివాలున సాగిపోతున్నాను.

నిస్సహాయస్థితి!

అదృష్టవశాత్తు అంతా చీకటిగా వుంది. గాలిలో తేలుతువున్న గాలివాలున కొట్టుకుపోతువున్న నన్ను ఎవరూ గనునించలేదు.

నాకు ఏమవుతుంది? భూమిని అందుకోగలనా?

గాలి తూర్పుకి సాగుతూంది.

ఆ వాలున అలా అలా పోయి సముద్రంలోకి నడిస్తే నా గతి ఏంగాను?

నిస్సహాయంగా నా స్థితిని భగవంతునికి వదిలి పెట్టి అలాగే తేలిపోయాను. అదృష్టవశాత్తు నేను పది అడుగులకంటె ఎక్కువ పైకి పోలేదు. బహుశా గాలి సాంద్రత నన్ను కాపాడి వుండాలి.

కాని...ఏమవుతుంది చివరికి? ఏమో!

బీచిలో లైట్లు వెలుగుతున్నాయి,

సముద్రంలో రేవు బయట కొన్ని ఓడలు దీపాలతో నిలిచివున్నాయి.

అలా అలా సముద్రంలోకి పోతువున్నాను.

ఇక నా పని అయిపోయింది. నన్ను భగవంతుడు కూడ రక్షించలేడు కాని—అంతలో—

నా అదృష్టం వండి గాలివాలు మారింది.

మరల భూమిమీదికి కొట్టుకువచ్చాను.

నా కింద—

సముద్రపు ఒడ్డున భూమిమీద క్లబ్బు బిల్డింగుని నేను గుర్తించాను.

అక్కడ బారులు తీరిన కారులు నిల్చివున్నయి.

ఆ సమయంలో నేను అరిస్తే—ఎవరయినా గమనించవచ్చు గాని నన్ను ఏ భూతమో అనుకుని గొడవచేసే ప్రమాదం వుంది. పిచ్చిప్రజ రాళ్లు విసిరి నన్ను చంపివెయ్యనూ అవకాశం వుంది.

మెల్లమెల్లగా గాలి నన్ను క్లబ్బు రోడ్డువెంట తోసుకు పోసాగింది.

అంతలో—

కిందనించి రెండు కంఠస్వరాలు నాకు విన్పించినయి.

ఆ ఇద్దరు వ్యక్తులు నాకు పరిచితులే. ఆ స్వరాలు నే నెరిగినవే. వాళ్లు ఏదో విషయం గురించి మాట్లాడుకుంటు వెళ్తున్నారు.

అందులో ఒకరు ప్రొఫెసర్ రామారావు.

రెండవవారు పి. డి. పున్నారావు.

పున్నారావు చెప్తున్నాడు రామారావు వూకొడ్తున్నాడు. వినగా—ఆ విషయం నాకు సంబంధించినదే అన్పించింది.

ఒక పదిరోజులక్రితం పున్నారావుకి నాకు వాగ్యుద్ధం జరిగింది. పున్నారావు బలిష్ఠుడు. బాగా వ్యాయామం చేసిన శరీరం. ఆ మధ్య డెహ్రాడూన్ వెళ్లి మౌంటెనీరింగ్‌లో శిక్షణ పొంది వచ్చాడు.

క్లబ్బులో నలుగుర్నీ చేర్చి తన పర్వతారోహణ్ణి గురించి గప్పాలు కొట్టు వున్నాడు. చిలిపిగా నేను అతన్ని ఎదుర్కొని 'అదెంత ఘనకార్యం' అన్నాను. పున్నారావు అఫెండయి ఛాలెంజి చేసాడు. నేను సరేనన్నాను.

మర్నాడుదయమే డాల్ఫిన్స్‌నోస్ ఎక్కటానికి పందెం వేసుకున్నాము మేము. అప్పుడు ప్రొఫెసర్ రామారావు ఎగ్జామినర్‌గా హైద్రాబాద్ వెళ్లి వున్నాడు.

ఆ ఉదయమే నేను నా సంచిని బుజాన తగిలించుకుని అందులో—తగినట్టుగ స్క్వా తిప్పి—మరని—మా ఆవిడ పెట్టగా హుషారుగా వెళ్లాను.

పందెం మొదలయింది.

నేను హుషారుగా చెంగుచెంగున ముందు పరిగెట్టాను బండల్ని దాటుతు పైకి, పైపైకి. 'ఒయ్! పడతావు. జాగ్రత్త' అంటు పున్నారావు హెచ్చరిస్తూనే వున్నాడు. అయినా నాకేం భయం? పున్నారావు చమట్లు కక్కుకుంటు సగం దూరం వచ్చేసరికి నేను లైట్ హవుస్ చేరేను. అరగంట తర్వాత చమట్లు కక్కుతూ అక్కడికి. చేరిన పున్నారావు చమట తుడ్చుకుంటు 'అంత తొందర పనికి రాదని, ఏమయినా అయితే దారుణమయిన ప్రమాదం జరగవచ్చునని నన్ను తిట్టాడు. నేను నవ్వి వూరుకున్నాను.

'కనీసం దిగేటప్పుడైనా జాగ్రత్తగా వుండు' అని హెచ్చరించాడు పున్నారావు. కాని దిగేటప్పుడు మరింత హుషారుగా చెంగుచెంగున దిగుతు గెంతుతు

పది నిముషాలలో కిందికి వచ్చేసాను. గంట తర్వాత అక్కడికి వచ్చిన పున్నారావు కళ్లింత చేసుకుని నా వంక చిత్రంగా చూసాడు—ఇప్పుడు—ఆ సంఘటన గురించే ప్రొఫెసర్ రామారావుకి వివరిస్తున్నాడు పున్నారావు.

'చాల చిత్రంగా వుంది. మనిషినిచూస్తే బక్కపీనుగులాగుంటాడు. అటువంటివాడు సర్కసు గుర్రంలా పరిగెత్తాడు. కొంచంకూడ అలిసిపోయి నటు కన్పించలేదు. నా మటుకు నాకు అతివిచిత్రంగా వుంది. అతనిలో ఏ వయినా అతీతశక్తి వుందా అన్పించింది!' అన్నాడు పున్నారావు.

'అవును. అతను ఈ మధ్యన మరీ పిచ్చి వాడి వలె తయారయాడు. బుజానసంచి వుంటుంది. అందులో ఏముంటుందో భగవంతుడికే తెలియాలి. సొసైటీని వదిలిపెట్టాడు. పిచ్చిపిచ్చిగా భార్యతో కొండలు, అడవులు తిరగటం ప్రారంభించాడు. ఆ నడకే చాల చిత్రంగా మారిపోయింది. క్లబ్బు లేదు. స్నేహితులు లేరు. ఏమీ లేదు. అసలు అతనికి పిచ్చి పట్టినట్టు నా అనుమానం. అందుకే—మావాడు కృష్ణారావు వాళ్లమ్మాయి వనజని చేసుకుంటానంటే ససేమిరా కూడదన్నాను. ఆ పిచ్చివాడా నా వియ్యంకుడు?! దేనికయినా సమానత్వం వుండాలంటారు.'—రామారావు మాటలు చెళ్ళున నా చెంపమీద తగిలాయి.

నేను పిచ్చివాడ్ని అని అనుకుంటున్నారా వీళ్ళు? ఎంత పిచ్చిఆలోచన!

అదే—మేము అల్లారుముద్దుగా పెంచుకున్న వనజ పెళ్లికి ఆటంకమయిందా?

ఎంత చిత్రం! అసలు సంగతి వాళ్లకేం తెల్సు?

అంతలో వాళ్ళు దాటిపోయారు.

నేను తేలి తేలి ఎటో కొట్టుకు పోయాను.

గాలి వుధృతం హెచ్చింది.

కర్మగాలి నేను ఏ ఎలక్ట్రిక్ స్తంభానికో, లేక చెట్టుకో, లేక ఎత్తయిన బిల్డింగుకో ఢీకొనటమే జరిగితే—ఇక కథ వుండదు.

పట్నం నిర్మానుష్యంగా వుంది.

బాగా ప్రొద్దుపోయింది.

మరి ఏమిటి నా గతి?!

ఏదో ఒకటి త్వరగా అయితే బావుండును.

కాని—

అంతలో నా కింద చీకట్లో ఏదో ఆకారం కదిలింది.

'ఇదుగో! మీరేనా?,' గద్గదపూరితమైన గొంతు. ఆ గొంతు నేను గుర్తించాను. అది నా భార్యది! 'ఆఁ. నేనే.' అన్నాను.

'అయ్యో! నా మతిపోయి, మిమ్మల్ని అలాగే వదిలి వెళ్లిపోయాను. నన్ను క్షమించండి. ఇందాకట్నుంచి మీకోసం తెగవెతుకుతున్నాను...'

'సర్లె. ఇప్పుడు నన్ను కిందికిదించే వుపాయం చూడు' అన్నాను.

ఆవిడ పావుగంటసేపు నానాతిప్పలు పడి ఒక గడకర్ర సంపాదించి పైకి చాపింది. సర్కసుఫీటు చేసినంత శ్రమపడి, వంగి నేను దాన్ని అందుకున్నాను. వెంటనే ఆవిడ నన్ను కిందికి లాగి నా బుజంమీది మరయొక్క స్క్రూని సరిగా తిప్పింది!

అమ్మయ్య! నాకు ఇంకా ఈ భూమిమీద నూకలు వున్నాయి! అదే పది వేలు! ఒకర్నొకరం కావిలించుకుని ఆనందబాష్పాలు రాల్చాము.

చెయ్యి చెయ్యి పట్టుకుని వుషారుగా ఇంటికి వెళ్లాము. తోవలో ఆమెకి- ప్రొఫెసర్ రామారావు నన్ను గురించి ఏమనుకుంటున్నదీ, వనజ పెళ్లికి ఆటంకమయి ఇంతకాలంగా మమ్మల్ని విచారంలో ముంచివేసిన సంగతి ఏమయినదీ—ఆమెకి వివరించి చెప్పాను. ఆమె ఆశ్చర్యపడింది! త్వరలో ఏదో సంగతి తేల్చెయ్యాలని నిర్ణయించుకొన్నాము.

మా యావిడ సలహా మీద మర్నాడుదయమే నేను స్నానంచేసి నీట్‌గా డ్రస్సయి ప్రొఫెసర్ రామారావు ఇంటికి వెళ్లాను.

అతనికి నేను కనిపెట్టిన 'మర' గురించి వివరించాను. ఇంతకాలంగా అతను నన్ను పిచ్చిమనిషిగా పరిగణించటానికి గల కారణం వివరించాను.

అంతా విని 'నేను నమ్మలేను' అన్నాడు అతను.

'సర్లె. ఋజావు చేస్తాను' అని ఆ రాత్రే రామారావుని మా ఇంటికి ఆహ్వానించాను. భోజనాలయి బాగా ప్రొద్దుపోయేక నా సంచిలో పదిలంగా దాచి వుంచిన 'మర'ని బయటికి తీసి అతనికి వివరించాను. రామారావు స్థూలకాయుడు. అతని వీపుకి ఆ సంచి బిగించి, అందులో స్క్రూని సరిగా తిప్పి 'మర'ని తగిలించింది నా భార్య.

అప్పుడు నా సూచనమీద రామారావు 'లాంగ్ జంప్' చేసాడు— పదడుగులు దూకాడు. హై జంప్ చేసాడు— పదడుగులు సునాయాసంగా గెంతాడు. పెద్దపెద్ద బరువులు అలవోకగా లేపాడు. బలాఢ్యుని వలె ఘనకార్యాలు చేసాడు.

అంతా అయాక 'చిత్రంగా వుందయ్యా. అయామ్ సారీ! ఇంతకాలం నేను నీ గురించి మరొక విధంగా వూహించి అపోహపడ్డాను.' అని విచారించాడు. ప్రొఫెసర్ రామారావు.

'అయితే మా సంబంధానికి ఒప్పుకున్నట్లేనా?' అంటూ నిగ్గదీసింది మా యావిడ వెంటనే, అని పిల్లలిద్దరూ ఏ రకంగా బాధపడుతున్నారో చెప్పింది.

'అమ్మాయి! ఇంకా సందేహమా? డామ్ షూర్! మై ఫ్రండ్! నువ్వు నిజంగా జీనియస్సువోయి! రేపే కాన్ఫరెన్సు ఏర్పాటుచేసి ఈ విషయం ప్రపంచ వైజ్ఞానికుల దృష్టికి తీసుకెళ్ళి...' రామారావు మాటలు పూర్తిగాకుండానే మా యావిడ అడ్డుపడింది.

'ఆగండి మహాశయా! అంతవరకు వద్దు. ఇప్పటికే ఇంతవరకూ రానిచ్చి ఇంత రామాయణం అయింది. ఇకవద్దు. ఏదో ఆ పెళ్ళిచేసి మమ్మల్ని కృష్ణారామా అంటూ బ్రతకనీయండి. చాలు. మీకు మీ వైజ్ఞానిక ప్రపంచానికి లక్ష ధన్యవాదాలు' అంటూ ఆయన వీపునించి ఆ సంచితీసి, మరని బయటికిలాగి నేలకేసి కొట్టింది గట్టిగా.

అది పగిలి సవాలక్ష ముక్కలయింది.

రామారావు తెల్లపోయి చూస్తూ వుండిపోయాడు.

నేను ఆలోచనలో పడ్డాను.

ప్రకృతికి వ్యతిరేకంగా నడవటానికి ప్రయత్నించటం మనిషికి కష్టసాధ్యమే కావచ్చును; కాని ఆ స్థితిలో మనిషి మనుగడ కొనసాగించటం యెంత ప్రమాద భరితమూ! నా ఒడలు గగుర్పొడిచింది!

తల్చుకుంటే మరల నేను అటువంటి 'మర'లను వెయ్యింటివి సృష్టించగలను — కాని ఇప్పుడిక ఆ పని నావలన అవుతుందా అని!

(అంకితం: స్టాక్‌టన్ జీనియస్సుకి)



పెరుగుతున్న ధరలు - ఒక పరిశీలన

శ్రీ నెల్లూరి సత్యనారాయణ

ధరలనేవి ఆర్థికవ్యవస్థపై అపారమైన ప్రభావము కలిగిఉంటాయి. ధరల స్థిరీకరణ, వాటి హెచ్చు తగ్గులు ఆర్థికవ్యవస్థపై తీవ్రమైన సంచలనాన్ని సృష్టిస్తాయి. మనదేశంలో ప్రస్తుతపు ధరల స్థితిని గమనించి ప్రజలు భయాందోళనలు వెలిబుచ్చుతున్నారు. సామాన్య మానవుని జీవితం నానాటికి దుర్భరంగా తయారవుతున్నది. కనీసం నిత్యజీవితావసర వస్తువులైనా కొనేందుకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. తత్ఫలితంగా అనేక ఆందోళనలు, అలజడులు, సమ్మెలు చివరకు ఆకలిచావులుకూడా సంభవిస్తున్నాయి. ఇవన్నీ పెరుగుతున్న ధరల ప్రభావమే అని చెప్పటంలో ఆశ్చర్యం లేదనుకుంటాను. నిత్య జీవితావసర వస్తువుల ధరలు రోజురోజుకీ ఆకాశాన్నంటుతున్నాయి. స్త్రీలు, పురుషులు, నాయకులు మొదలైనవారంతా ఘెరావ్‌లు, నిరసనప్రదర్శనలు, సమ్మెలు, ఆందోళనలు, బంద్‌లు జరపటమేగాక చివరకు అల్లరులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. నిజంగా ఈ పరిస్థితి యిలాగే మరికొంతకాలం కొనసాగితే కనివిని ఎఱుగని ప్రజావిప్లవం చెలరేగుతుందేమో! అయితే మనం యిక్కడ గమనించదగ్గ ముఖ్య విషయం ధరల పెరుగుదల అనేది మనదేశాని కొక్కదానికే పరిమితం కాదని ప్రపంచదేశాలలో చాలవరకు ఈ యిబ్బంది నెదుర్కొంటూనే ఉన్నాయి అనేది.

ఇంతకుముందెన్నడూ లేని విధంగా 1972 ఏప్రియల్ మొదలుకొని 73 ఏప్రియల్‌వరకు పశ్చిమ జర్మనీలో 7% నుండి 8%, ఫ్రాన్సు 6.4%, ఆస్ట్రియా 7.7%, బెల్జియం 6.9%, ఇటలీ 9% జపాన్ 10.1%, కెనడా 6%, ఇంగ్లండు 9.3% మరియు ఆస్ట్రేలియాలో 1973 మొదలు మూడు నెలల్లోగా 2.4% అదే విధంగా అమెరికాలో 2.3% ధరలు పెరగటం గమనించదగిన విషయం. ఈ లెక్కలను పరిశీలిస్తే ప్రపంచదేశాల్ని ఈ ధరల పిశాచి ఎంతగా పట్టి పీడిస్తుందో విశదమవుతుంది. కాని ఈ దేశాలకు మన దేశంలో పెరుగుదలకు చాలా భేదమున్నది.

రెండు ప్రపంచ యుద్ధాలు-ధరలు

మన దేశంలో 1914 లో ప్రథమ ప్రపంచ యుద్ధం మొదలయిన నాటినుండి ధరలు విపరీతంగా పెరుగుతూ 1920 నాటికి తీవ్రస్థాయికి చేరుకున్నాయి కాని మరుసటి సంవత్సరమునుండే తగ్గుముఖం పట్టాయి. తిరిగి 1939 లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కావటంతో విపరీతంగా పెరుగుతూ 1941 నాటికి తారస్థాయినందుకున్నాయి. దీనికి తోడుగా 'మూలిగే నక్కపై తాటికాయన్నట్లు' బెంగాలులో కఱవు ఏర్పడడంతో పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎన్ని పద్ధతుల నవలంబించినప్పటికిని ప్రయోజనం లేకపోగా దేశంలో బ్లాక్ మార్కెట్ పెరగటానికి దోహదం చేశాయి.

స్వతంత్ర భారతం : ధరలు

మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుండి ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా, ఎన్ని నూతన పద్ధతుల నవలంబించినా ప్రభుత్వం ఈ రంగంలో ఏ మాత్రం సఫలీకృతం కాలేకపోయింది. పెరుగుతున్న ధరలతో పెరగలేక అనుక్షణం చావు బ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడుతూ అర్థనగ్నపు బ్రతుకులతో విసిగి వేసారిన పేదప్రజానీకం, మధ్య తరగతి ప్రజాజీవనం నానాటికి దెబ్బ తింటున్నది.

1952–53—1968–69 మధ్యకాలంలో ధరలు 110% పెరిగాయి. అంటే 1952 లో 100 రూపాయలున్న వస్తువు 1969 నాటికి 210 రూపాయలకు పెరిగిందన్నమాట. ఇదే విధంగా 1961–62 నుండి 1973 మే నాటికి 131% పెరిగిందంటే యించుమించుగా జనాభా తర్వాత పెరుగుదలలో ధరలదే ద్వితీయ స్థానమేమొ! కేవలం 1973 ఏప్రియల్, మే అంటే రెండు నెలల్లోనే 8.6% పెరిగాయంటే ప్రజలు ఆందోళనపడక మానరు. ప్రభుత్వం ఈ విషయంలో ఎంత మాత్రం జాప్యం చేసినా పరిస్థితి యింకా తీవ్ర మగుటయేగాక విపరీత పరిణామాలకు దారి తీస్తుం దని చెప్పడానికి మే—ఆగస్టు నెలల మధ్య పెరిగిన ధరలు, ప్రజలలో యిప్పుడు చెలరేగుతున్న అలజడులే నిదర్శనం. ప్రస్తుతం ధరల పరిస్థితి అదుపులోనికి రాకపోగా 1949 లో 100 రూపాయలున్న వస్తువు విలువ 300 రూపాయలు మించిపోయింది. నిజం చెప్పాలంటే నిత్యావసర వస్తువుల ధరల విషయంలో రూపాయి విలువ 19 పైసలకు పడిపోయింది.

ధరల పెరుగుదలకు గల కారణాలు

మనదేశంలో అనుక్షణం పెరుగుతున్న జనాభా అవసరాలకు సరిపడే విధంగా ఉత్పత్తులు పెరగక పోవటం, ప్రభుత్వం మితంలేకుండా కరెన్సీనోట్లు విడుదల చేయటం, వర్తకులు సరకులను అక్రమంగా నిల్వచేయటం, బడ్జెటులో నిత్యజీవితావసర వస్తువులపై పన్నులను ఎప్పటికప్పుడు ఎక్కువచేయటం, లోటు బడ్జెటు విధానం, ప్రభుత్వపు కంట్రోళ్లు, రేషనింగ్, రూపాయి విలువ తగ్గించటం, దిగుమతులపై ఆంక్షలు, పొరుగుదేశాలైన పాకిస్థాన్ చైనాలతో యుద్ధాలు, శరణార్థుల సమస్యలు, ప్రణాళికా రచనల్లో లోపాలు, సమర్థవంతమైన పాలనా యంత్రాంగం లేకపోవటం మొదలైన అంశాలన్నీ ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి.

ధరల నరికట్టే విధానాలు

ప్రభుత్వం ధరల నరికట్టేందుకు అనేక పద్ధతుల నవలంబిస్తున్నప్పటికీ ఫలితం శూన్యం. కాబట్టి ఆ అనుసరిస్తున్న విధానాలు వీటికితోడు మరికొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టిన ధరల నరికట్టవచ్చును. ఈ విషయంలో ప్రభుత్వం అనుసరించవలసిన విధానాల గురించి కొంచెం ముచ్చటిస్తాను.

(1) అత్యవసర సరుకుల చట్టం

ఈ చట్టం క్రింద ప్రభుత్వానికి అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకుని రేషన్ షాపులలో అమ్మేందుకు అధికార మీయబడినప్పటికిని, యిది సరిగా అమలు జరగటంలేదనే చెప్పాలి. బ్లాక్‌మార్కెటు చేస్తున్నవారిపై, అక్రమ నిల్వలున్నవారిపై యింకా కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో వర్తకులకు సహకరించే అధికార, అనధికార శక్తులను, సంఘ విద్రోహ శక్తులను కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వ లైసెన్సుపొంది ప్రభుత్వ రేటుకు కాకుండా బ్లాక్‌మార్కెటులో అమ్మేవారిని శాశ్వతంగా వర్తకానికి దూరం చెయ్యాలి. అత్యవసర వస్తువుల చట్టాన్ని సమయానుకూలంగా మార్పులు చేసి గట్టిగా అమలు జరిపినయెడల ధరల పెరుగుదలను కొంతవరకు నిరోధించవచ్చును.

(2) ప్రభుత్వ పన్నులు

ఏ దేశంలోనయినా ప్రభుత్వపన్నులు ధరలపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధాలు కలిగి ఉంటాయనేది నిర్వివాదాంశం. 1971 ఎన్నికల వాగ్దానాలు, 'గరీబీ హటావో' నినాదాలు కేవలం నీటి మూటలై అత్యవసర వస్తువులమీద, నిత్యజీవితావసర వస్తువులమీద విపరీతంగా పన్నులు పెంచుతున్నారు. కాని వీటిమీద పన్నులు తగ్గించి సంపన్నులుపయోగించే విలువైన వస్తువులమీద హెచ్చుపన్నులు విధించి, పన్నుల ఎగవేసేవారిపై కఠినచర్యలు తీసుకొనటం సమంజసంగా ఉంటుంది.

(3) దిగుమతులు

మనం అన్నిరంగాలలో స్వయం సమృద్ధిని సాధించేంతవరకు విదేశాలనుండి దిగుమతులను ప్రోత్సహిస్తూ కంట్రోలు ధరలకు వాటిని విక్రయించటం

వలన ధరల నదుపులో పెట్టవచ్చును. కాని ఈ రంగంలోకూడా ప్రభుత్వం విఫలమైనప్పటికిని, మొత్తం పరిస్థితిని సమీక్షించి సముచిత నిర్ణయాలు తీసుకొని దిగుమతులను ప్రోత్సహించడం శ్రేయస్కరం.

(4) వడ్డీ రేటును తగ్గించుట

వడ్డీ రేటులను తగ్గించటంవలన చిన్నతరహా పరిశ్రమలకు పెట్టుబడులు లభించి, ధరలమీదే కాక పెట్టుబడుల మీదకూడా లాభం పొందవచ్చును. అయితే ఈ విషయంలో బ్యాంకులు కీలకమైన పాత్రవహించాలి. తక్కువ వడ్డీ రేటుతో సామాన్య మానవునికి సయితం సులభంగా అప్పులు యిచ్చే ఏర్పాటు ఉండాలి. అప్పు దుర్వినియోగమవుతుందన్న భయమున్నపుడు బ్యాంకువారు ఆ వ్యక్తి స్థాపించబోయే పరిశ్రమకు తగిన పరికరాలు, సాంకేతిక సహాయం మున్నగునవి అందచేయాలి. అలాగే రైతులకు రసాయనిక ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారిణి మందుల రూపంలో సహాయం చేసిన ఉత్పత్తి నభివృద్ధి చేసిన వారేకాక ధరల నదుపులో పెట్టుటకు తోడ్పడిన వారగుదురు.

వీటికి తోడుగా ప్రభుత్వం అనవసర ఖర్చులను తగ్గించి వేయడం, పన్నులను ఎగవేసే వారిని తీవ్రంగా శిక్షించటం, ప్రస్తుతంఉన్న ఉత్పత్తి లక్ష్యాలను పెంచటం, సాంఘిక న్యాయానికి కట్టుబడి సంపదను పంపకం చేయటం, ఆహార ధాన్యాల ధరలను రైతు మొదలుకొని వర్తకులవరకు అదుపులో ఉంచటం, అవసరమైన చోట్ల చట్టబద్ధమైన రేషనింగ్ ప్రవేశ పెట్టటంవలన ధరల పెరుగుదలను కొంతవరకు నిరోధించవచ్చును. ఇటీవల ప్రభుత్వమే ఆహార ధాన్యాలను సప్లయిచేసే ఉద్దేశ్యంతో వ్యాపారాన్ని జాతీయం చేస్తున్న సంకల్పం మంచిదే కాని దానిని అమలు పెట్టటంలో అత్యంత శ్రద్ధ కనపరచి, గట్టిశాసనాలద్వారా సాంఘిక న్యాయం చేకూర్చితే చాలావరకు ధరల నదుపులో పెట్టిన వారవుతారు.

ధరల్ల పెరుగుదల విషయమై పార్లమెంటులో విపరీతంగా చర్చలు జరగటం, ప్రభుత్వం ఎప్పటికప్పుడు తాను చేయగలిగినదంతా చేస్తున్నానని చెప్పటం పరిపాటయిపోయింది. రూపాయి విలువ ముప్ఫయిఆరు పైసలకు పడిపోయినదని ఒప్పుకుంటున్న మంత్రిగారు ప్రజలు నిత్యజీవితావసరాలను ఎలా తీర్చుకుంటారనే విషయాన్ని పరిశీలించాలి. సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకుని పటిష్టంగా అమలు జరపకపోతే చితికిపోయిన మన ఆర్థికవ్యవస్థ యింకా దెబ్బతిని విపరీత పరిణామాలకు దారి తీస్తుందనటంలో సందేహం లేదు. ఇకనయినా ప్రభుత్వం తగినవారితో సంప్రతించి ఈ సమస్యను వేగిరంగా నిరోధించే ప్రయత్నం చేయాలి.



ఎందుకు?

శ్రీ బెళ్ళారి శ్రీనివాసమూర్తి

అది తెచ్చీ—యిది తెచ్చీ
చిదుగు లేవా కొనివచ్చీ
ప్రత్తి పింజె లమరించీ
మెత్తని పడకలు గూర్చీ

పిచ్చుక తన గూడు గట్టె—
విచ్చిన హృదయం పరచీ
పిచ్చుక తన గూడు గట్టె—

కన్నులైన తెరువకున్న
చిన్నిచిన్ని పిల్లలకూ
చిన్నిచిన్ని నోళ్ళు తెరచు
చిన్నిచిన్ని పిల్లలకూ
కన్నతల్లి మేత దెచ్చి
కడుపారగ తినిపించె—

పిల్లలెదిగి పెద్దవాయె
కళ్ళు తెరచి కదల జొచ్చె
ఇల్లు వీడి యెగుర జొచ్చె,
తల్లి పులుగు మమకారం
మెల్లమెల్ల తఱుగ జొచ్చె
పిల్లలనే తరుమగొట్టె !

అడవి నడుమ మేయుచున్న
ఆ వొక్కటి దూడ నీనె
చెంగు చెంగు మంచు నెగిరె
చిఱుపచ్చిక బీళ్లలోనె
అంబా అని యఱచె ఆవు
అంబా యని యఱచె దూడ—

తన ముద్దుల కసుగందును
కని శిరమును మూర్కొన్నది,

ఎం దు కు ?

తన వత్సము మే నాకుచు
తనతో నుప్పొంగె గోవు—

కారడవుల కలిసి తిరిగె
కన్నతల్లి—చిన్ని నిసుగు
కలిసిమేసె ఆవు—దూడ,
పొలముచెంత గనిమలలో—
గోవత్స మనోనురాగము
భావములో ననుబంధము
తావిదో రెగుబులుకొనియె
జీవితమే అలముకొనియె

వత్సమునకు వయసు వచ్చె
వాడికొమ్ము పదునుదేరె
వదలరాని వాత్సల్యం
వైదొలగగ గోదేవత
పొదుగును చేపెగనీయదు
పొడువసాగె దూడను గని !

కడుపు బరువుమోసి తల్లి
కొడుకును గని పెంచసాగె,
ధ్యానము తన కొడుకుపైన
ప్రాణము తన కొడుకుపైన
ముద్దుగొనియె—మురిసిపోయె

పెద్ద పెరిగె పిన్నవాడు
తల్లిని పెంచెడి తనయుడాయె
తల్లికి తన పుత్రునిపై
తనియదు ప్రేమాంకూరము
ముదుసలి యగు తన కొమరుని
మూర్కొని చుంబించు, తల్లి—

క్షణమైనా తన కొడుకును
కనలేనిది మనజాలదు—

మానవులకు మమకారం
మంటగలియు వఱకెందుకు ?

కథ కావాలి

శ్రీ కేవస్వీ

'బా-వా!...'

అంటూ రివ్వున లోపలికొచ్చింది రమ.

మేడ మెట్లు తొందరగా ఎక్కివచ్చిన ఆయా సాన్ని, తన కిష్టమైన మనిషిని చాలాకాలం తర్వాత చూస్తున్నానన్న భావనవల్ల కలిగిన ఆనందంతో కూడిన నవ్వులో నొక్కిపట్టి—గాలిలా వచ్చి రాజు మేజామీద వాలిపోయింది రమ. నవ్వుతూ నవ్వుతూ రాజువంక చూసి, మేజామీంచి కుర్చీలోకి చేపపిల్లలా జారిపోయింది. 'బావా—నేనొచ్చేసేను—' అంది ఇంకా రొప్పుతూనే.

అంతవరకూ కిటికీగుండా వెలుపలికి చూస్తూ ఉండి అప్పుడే తల ఇటు తిప్పిన రాజు రమను చూసి ఆశ్చర్యపోలేదు.

ఆశ్చర్యమేకాదు, అతని ముఖంలో ఆనందం కూడా లేదు.

అతని జుత్తు అతని ముఖంమీద అస్తవ్యస్తంగా పడి ఉంది. అతని కళ్లు ఆమెవేపు తిరిగినా అతని చూపుల్లో కేవలం శూన్యత మాత్రమే ఉంది. ఏదో గడ్డుసమస్యకి పరిష్కారం వెదుకుతున్నట్టు అతని కనుబొమలు ముడిబడి ఉన్నాయి.

అతని ఆ భంగిమ చూసి ఆశ్చర్యపోయింది రమ. 'ఏమిటి బావా—అలా ఉన్నావ్?—' అని అడిగింది.

ఆమె మాటకి అతను సమాధానం ఏమీ ఇవ్వలేదు. తనలో తాను ఏదో గుణించుకున్నట్టు గణించుకున్నట్టు— ఆమె వేపు అలాగే నిశ్చలంగా చూసేడు.

'ఏమిటి బావా అలా చూస్తావ్? ఏమైందిప్పుడు? అంది రమ, మరింత ఆశ్చర్యాన్ని కలవరపాటుతో కలిపి వ్యక్తం చేస్తూ.

'కథ కావాలి రమా— నా కిప్పుడు అర్జంటుగా ఒక కథ కావాలి...' అన్నాడు రాజు.

నిర్ఘాంతపోయింది రమ.

రాజువంక చూస్తున్న ఆమె కళ్ళు మరింతగా విచ్చుకున్నాయి.

అతను అన్నదేమిటి?

అతణ్ణి చూడాలన్న కోరికతో రెండు రైళ్ళు మారిన ప్రయాణపు టలసటనూ కూడా మరిచిపోయి, వచ్చింది వచ్చినట్లే మేడమెట్లెక్కి అతని గదిలోకి వస్తే—

'నువ్వా రమా! ఎప్పుడొచ్చే వెప్పుడొచ్చేవ్? అంటూ కళ్ళలో గెంతులేసే ఆనందంతో తనని పలకరించలేదు. 'ప్రయాణం కులాసాగా జరిగిందా?—' అంటూ పరామర్శించలేదు. పోనీ, తనంతటతానే పలకరించినప్పుడైనా తన రాకని గుర్తించినట్టు కనిపించలేదు. 'బావా— నేనొచ్చేసేను!—' అంటూ పట్టరాని సంతోషంతో తను చెప్పినందుకు అతని సమాధానం

'కథ కావాలి!...'.. !!

'కథా? కథేమిటి బావా?—' అంది రమ రాజువంక చిత్రంగా చూస్తూ.

'కథే రమా— కథే కావాలి ... ఇవాళ తారీఖు పద్దెనిమిది — ఇంక నాలుగురోజులే టైముంది... ఇరవైరెండోతారీఖు కథలపోటీకి ఆఖరుతేదీ ... ఆ లోపల ఎలాగైనా సరే— ఒక కథ రాయాలి— ఒక మంచి కథ కావాలి రమా—కథ కావాలి...'

రాజు రాసే కథలంటే రమకు చాలా ఇష్టం. తన బావ కథలు రాస్తాడంటే రమకు చాలా గొప్పగా ఉంటుంది. 'మా బావ కథలు రాస్తాడు—'అని ఊళ్ళో

తన స్నేహితురాండ్రందరితోటే గర్వంగా చెప్పుకుంటుంది. ఏ పత్రికలో బావ కథ అచ్చయినా ఎప్పటికప్పుడు దాన్ని చదివేసి దాన్ని గురించి తనకు తెలిసిన నలుగు రికీ చెప్పుకుంటేగాని ఆమెకు తృప్తి ఉండదు. కాని,

ఎంతగా కథలు రాసినా తన బావ మను ష్యుల్ని మరిచిపోతాడనీ, పట్టించుకోవడం మానేస్తా డనీ అనుకోలేదు రమ.

'కథేమిటి బావా!—ఇప్పుడేమిటి కథ?—'అంది.

'ఇప్పుడే కావాలి రమా...ఎలాగైనా సరే—నువ్వు నాకో మంచి కథ చెప్పాలి...థీమ్‌వరకూ చెప్పు చాలు...మిగతా అంతా నేను పూర్తి చేసు కుంటాను...ప్లీజ్—చెప్పు రమా!!...'

'భలే!—కథలు నాకేం చేతనౌతాయి. బావా!'

'అన్ని కథలు చదువుతావు—ఒక్కకథ చెప్ప లేవూ? ఏదైనా చిన్నకథ చెప్పు చాలు...ట్రాజెడీ అయినా సరే—కామెడీ అయినాసరే—పోనీ—ముగించడ మెలాగో నేను చూసుకుంటాను—ఏదైనా చిన్న 'హింట్' ఇవ్వు చాలు......'

'కథలు—చదవడమైతే చదువుతానుగాని, కల్పిం చడం నాకు చాతకాదు బావా!......'

'పోనీ! ఏదైనా జరిగిన కథైనా చెప్పు...'

'జరిగింది కథ ఎలా ఔతుందీ?'—

చిన్నబుచ్చుకునే పసిపిల్లాడిలా చూసేడు రాజు. 'ఇంత తెలివిగా మాట్లాడతావ్—నువ్వొ కథకురాలివి కావలసింది... పోనీ— కథకు పనికొచ్చే సంఘటన ఏదైనా చెప్పు—మార్పులూ చేర్పులూ చేసి నేను కథ రాసుకుంటాను—'

'భలే!—నేనేమిటి—నీకు చెప్పడమేమిటి?—'

'ఫరవాలేదు—చెప్పు రమా !—'

'ఊహూఁ—అబ్బే—నేను చెప్పలేను బావా...'

'కానీలే రమా—అయితే చెప్పవ్‌కదూ?'

'అదేమిటి బావా—నాకు చాతనైతే చెప్పనూ? నా వల్లకాదు బావా—ఎక్స్‌క్యూజ్ మి- '.

'ఇందులో ఎక్స్‌క్యూజ్ చెయ్యడాని కేముందిలే రమా—కాని...నా మాటంటే నీకు ఇంత విలువే నన్న మాట ఉంది......'

రమ రాజువంక తదేకంగా చూసింది-'అపార్థం చేసుకుంటున్నావా బావా...'

'లేదు—ఇప్పుడే సరిగ్గా అర్థం చేసుకుంటు న్నాను రమా—'

'కోప మొచ్చిందా బావా—'

'ఎందుకూ?—అబ్బే !—'

'కథ చెప్పనందుకు-నీ మాట కాదన్నందుకు—'

రాజు ఏమీ అనలేదు.

రమ కూడా ఒక నిమిషంపాటు ఏమీ మాట్లాడలేదు. ఆ తరువాత అంది :

'బావా నేనొక టడుగుతాను—ఏమీ అను కోవు కదూ?......'

'ఏమిటి?—'

'ఏమీ అనుకోనంటేనే—'

'కొత్తగా మాట్లాడుతున్నావు...ఏమీ అను కోను...అడుగు...'

'బావా—నువ్వు రాసే కథలన్నీ పత్రికల్లో ఎప్పటికప్పుడు చదివేస్తుంటాను...నీ కథలంటే నా కెంత ఇష్టమో తెలుసా?—చెప్పలేనంత ఇష్టం... ఇన్ని కథలు రాయాలంటే నీకు తీరిక ఎలా దొరుకు తుందో...అన్ని ఐడియాలు నీకెలా వస్తాయో—తలుచు కుంటే నువ్వో విచిత్రమైన మనిషి వనిపిస్తావు— కాని, బావా—నువ్వెప్పుడూ—పొద్దస్తమానమూ—కథల గురించే ఆలోచిస్తుంటావా......'

'............ . ...'

'ఏం బావా అలా చూస్తావ్?—'

'ఈ అనుమానం నీకెందుకు కలిగింది రమా?—'

'బావా—'

'మరేం లేదు రమా......నువ్వే అన్నట్టు నేనో విచిత్రమైన మనిషినని నాకూ అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది. కథలు రాయడాన్ని ఒక పిచ్చిగా లెక్కించే వాళ్లు చాలామంది ఉండొచ్చు... కాని. నా మటుకు నాకు అదే ఒక ఆనందం అని పిస్తుంది. ఎవరి పిచ్చి వారికి ఆనందమని ఊరికే అనలేదుకదా...నే నెప్పుడూ కథల గురించే ఆలో చిస్తుంటాను...అలా ఆలోచించడానిక్కాకపోతే నేను బ్రతకడం అనవసరమేమో అనిపిస్తుంది. అందులో బాధ ఉంది. కాని, ఆ బాధలోనే ఆనందంకూడా ఉంది. రచనలో కలిగే ఆనందంకోసం అందులోని బాధనుకూడా నేను స్వీకరిస్తాను. ఇప్పుడొక థీమ్ కోసం నేనెంతగా బాధపడుతున్నానో తెలుసా? నీకు తెలీదు రమా—నేను చెప్పలేను. ఈ బాధ మాటలకు అందేది కాదు—మాటలో చెబితే అర్థమయేదీ కాదు... ఆ బాధను అర్థం చేసుకోవాలనే వాడు ఆ బాధను అనుభవించే తీరాలి...రమా!...నా మనసెలాంటిదో నీకు తెలుసుగదా! ఇది వరకెప్పుడు కథ రాయాలనుకుని రాయకుండా ఉండిపోవడం జరగలేదు. కాని—కాని—ఈ పోటీకి కథ పంపాలంటేమాత్రం ఒక్క థీమ్‌కూడా తట్టడం లేదు. ప్లీజ్...రమా...ఎలాగైనా సరే...ఒక్కకథ—ఒకటంటే ఒకే ఒక్కకథకి థీమ్ చెప్పచాలు...ప్లీజ్...'

అతని మాటలు వింటూవ్న రమ ముఖం సానుభూతితో నిండిపోయింది. 'సారీ బావా... నీ మనసెలాంటిదో నాకు తెలుసు...కాని, నా శక్తి ఎంతటిదో కూడా నీకు తెలుసు గదా......కథలల్లడం నాకు ఏ మాత్రమూ చేతకాదు...కథలు రాయకపోతే నువ్వు బ్రతకలేవేమో అన్నావు...ఆ మాట తలచుకుంటే నాకు చాలా భయమేస్తుంది బావా—కథలకోసమని జీవితంలోని ఇతర ఆనందాలను వదులుకోవడానికైనా సిద్ధపడడం...అంతమంచి పని కాదేమో అనుకుంటాను...అయినా నీకు చెప్పడానికి నేనెంతటి దాన్ని బావా?...నువ్వే మళ్లీ ఆలోచించు...అదుగో అత్తయ్య పిలుస్తోంది... వస్తున్నా నత్తయ్యా—మళ్ళీ వస్తాను బావా!...'

గదిలోంచి వెళ్ళిపోయింది రమ.

* * *

'బావోయ్—బావా!...'

'ఓ—నువ్వా రమా...'

'ఇంకెవరనుకున్నావు? నీ ఊహా ప్రేయసి అనుకున్నావా?—'

రాజు నవ్వేడు—'నాకో ఊహాప్రేయసి ఉంటుందని ఎలా అనుకున్నావ్?—'

'ఎలా అనుకోవడమేమిటి? ఉండే తీరుతుంది. మీ కవులకీ కథకులకీ ఊహాప్రేయసు లుండబట్టే కదా కావ్యాలూ కథలూ నడుస్తుంటాయి—'

'అదేంలేదు రమా—ఊహకీ వాస్తవానికీ మధ్య నలిగిపోవడం ... ఆ సంఘర్షణలోంచి వేదనలోంచి మాటలరూపంలో హృదయావేశం వ్యక్తం కావడం... అదే రచన...'

'దిగిరాను దిగిరాను దివినుండి భువికి — అంటూ ఎవరో కవి— కృష్ణశాస్త్రిగారు కాబోలు— పాడేరు— అదేకదూ కళాకారుని వేదన...'

'అంతేకాదు—ఆ కళాకారుణ్ణి స్వప్నలోకంనుంచి ఈడ్చి పడెయ్యాలని చూస్తుంది లోకం— ఈ పాడు లోకం—'

'తామంతా లోకాతీతులం అనుకోవడం ఈ కళాకారుల భ్రమ అనుకుంటాను బావా ... లోకంతో సంబంధమే లేకపోతే ఈ కవులూ రచయితలూ అందరూ కూడా అడ్రసులేకుండా పోతారు...'

'రమా! రచయిత మనస్సు సున్నితం — మామూలు మనిషి భూకంపానికీ యుద్ధానికీ చలిస్తే రచయిత చుక్క మెరుపుకీ ఆకుపాటుకీ కూడా కలవర పడతాడు...'

'కాని, ఎంత రచయితైనా జీవితంలో మామూలు మనిషిపొందే అనుభవాల్ని కాదనకూడదు బావా...'

'నిత్యజీవితం !...ఏముంది ఈ నిత్యజీవితంలో? అంతా రొటీన్ రమా...స్విచ్ ఆన్‌చేస్తే తిరగడం

మొదలెట్టే యంత్రాలు ఈ మనుషులు...బ్రతుకుతున్నామనే స్పృహ లేకుండానే బ్రతకడం...బొమ్మలాట లాడుకుంటున్నట్లు పెళ్లిళ్లు చేసుకోవడం— పిల్లల్ని కనడం— జీవితం తమ కేమిచ్చిందో, తాము జీవితాని కేమిచ్చామో తెలుసుకోకుండానే చచ్చిపోవడం—అంతా రొటీన్ రమా...ఈ యంత్రాలకి గుండె కాయలైతే ఉంటాయిగాని, మనస్సు లుంటాయి...'

రమ నవ్వింది : 'మనస్సు—చాలా చిత్రమైన మాట కదూ బావా?—'

'ఏం అలా అన్నావ్?—'

మళ్లీ నవ్వింది రమ : 'ఏదో అనాలనిపించింది— అనేసేను బావా...నీలా బాగా ఆలోచించి మాట్లాడడం నాకు చాతకాదు...మనిషి గురించీ మనస్సు గురించీ నీకు తెలిసినంతగా నాకు తెల్సే అవకాశం కూడా లేదు. కాని, బావా...నీదెంతో సున్నితమైన మనస్సు...కల్పనా లోకాల్లో విహరించడం నీకు అలవాటు...కాని, వాస్తవ ప్రపంచం అందించే అమూల్యమైన అనుభూతుల్ని నువ్వెంతగానో కోల్పోతున్నావేమోనని నా అనుమానం...అంతే బావా...అంతకు మించి—నీకు—నేను—మరింకేమీ చెప్పలేను ..'

'రమా...'

'రేపు నేను ఊరికి వెళ్లిపోతున్నాను బావా— మళ్లీ నిన్నెప్పుడు—ఎలా—చూస్తానో తెలీదు—నీతో ఎంతో సరదాగా గడపాలని ఇక్కడి కొచ్చేను నేను... కాని, ఈ పదిహేనురోజుల్లోనూ ఏ రెండుమూడుసార్లో మాత్రమే నువ్వు నన్ను పలకరించేవు...పాపం— నువ్వేం చేస్తావు?......కథలు రాసే ఆడావుడిలో ఉన్నావ్...దట్సాల్‌రైట్ బావా...విష్ యు బెస్ట్ లక్...విష్ మి బెస్ట్ లక్......'

వెళ్లిపోయింది రమ.

* * *

'బావా!

నా అంతట నేనే ఉత్తరం రాస్తున్నందుకు ఆశ్చర్యపోతున్నావు కదూ ! ఈ ఉత్తరం చివరంటా చదివితే ఇంకా ఆశ్చర్యపోతావని నాకు తెలుసు. అయినా తప్పనిసరి అయి రాస్తున్నాను ... నిజానికి రెండునెళ్ళ క్రితం మీ ఊరినుంచి వచ్చేసినప్పటినుంచి ఇలాంటి ఉత్తరం నీకు రాయవలసి వస్తుందని నేనూ భయపడుతూనే ఉన్నాను.

ఎలా రాయాలో తెలియడంలేదు బావా — అయినా ప్రయత్నిస్తాను...

బావా! నువ్వంటే నాకెంతో ఇష్టం. నీ సున్నితమైన మనస్సుతో మంచితనంతో నిర్మలత్వంతో నువ్వు నన్ను చిన్నతనంనుంచి ఎంతగానో ఆకట్టుకున్నావు. నువ్వు అంత చక్కగా కథలు రాస్తావని తెలిసినప్పటినుంచి నీమీద నా అభిమానం మరింత పెరిగింది. రచయితగా లోకానికి ఒక రాజు తెలుసు. కాని, లోకానికంతటికీ లేని దగ్గర సంబంధం నాకు రచయిత రాజుతో ఉందని తలుచుకున్నప్పుడల్లా నా మనస్సు ఎంత ఆనందంతో ఉప్పొంగిపోయేదో తెలుసా బావా? చక్కనివాడు, మంచివాడు, మెత్తటి మనసువాడు, భావుకుడు, రసజ్ఞుడు— మా బావ— 'మా వారు' ఔతారనే తలపు కలగడంతో నాలో ఏయే మధురనాదాలు విరిసేవో తెలుసా బావా?

కాని,

రెండుమాసాల్రకితం కొద్దిరోజులు సరదాగా గడపాలని మీ ఊరొచ్చినప్పుడు నిన్ను చూసేక — నాతో నీ ప్రవర్తనను గమనించేక — నీమీద నా అభిప్రాయాలను మార్చుకోవలసి వచ్చింది.

బావా! ఆవేశపడకుండా చదువు—రచయితలనబడేవాళ్లు ఈ ప్రపంచంలో బ్రతుకుతూ అప్పుడప్పుడూ ఊహా జగత్తులో విహరిస్తూ కథలు రాస్తూ ఉంటారనుకున్నాన్నేను. కాని, నువ్వుమాత్రం అస్తమానం కథా ప్రపంచాల్లోనే ఉంటూ ఎప్పుడో నెలకో అయిదునిమిషాలుమాత్రం వాస్తవ ప్రపంచంలోకి ఒక్కసారి తొంగిచూసి మళ్లీ ముఖం తిప్పేసుకుంటావు. నువ్వు భావుకుడివి. నీ భావుకతలో పడి వాస్తవాన్ని కాదంటావు. నువ్వు ఊహాజీవివి.

ఊహల్లో పడి నిత్యజీవితపు టానందమయ సంఘట నల్నీ సన్నివేశాల్నీ వదులుకుంటానంటావు.

కల్పన నా కిష్టమే. కాని, అది మోతాదు మించడం నేను సహించలేను.

కథలు నా కిష్టమే. కాని, అవి జీవితాన్నే కబళించడం నేను భరించలేను.

బావా! నీ ఔన్నత్యాన్ని నేను అర్థం చేసుకో గలను. కాని, దానితో నా జీవితాన్ని ముడివెయ్యడానికి సాహసించలేను. నీ హృదయ కవాటాలు నన్ను ఆహ్వా నించినా నీ ఊహాప్రపంచపు బంగారు తలుపులు మాత్రం లోనికి అడుగు మోపనివ్వకుండా నన్ను ఆటంకపరుస్తాయి. ఇప్పుడు కళ్ళు మూసుకుని నేను అడుగు ముందుకువేస్తే ఆ మూసిన తలుపులకి కొట్టు కొని నానుదురు తప్పకుండా చిట్లిపోతుంది. నీమీద నాకున్న అభిమానం కూడా నాలో ఇక మిగలదు.

అందుకే బావా—ఎంతో ఆలోచన మీద నేనొక నిర్ణయాని కొచ్చేను.

గుళ్ళో దేవుడిలాంటి వాడివి నువ్వు

నిన్ను నేను ఆరాధించగలను. కాని, ప్రేమించ లేను.

నిన్ను నేను పెళ్ళాడలేను.

నువ్వు ఒప్పుకున్నా అందుకు నేను ఒప్పుకోను. ఆ మాటే అమ్మతోనూ నాన్నతోనూ చెప్పేను. ఎంత గానో ప్రయత్నించేరుగాని, వాళ్ళు నా నిర్ణయాన్ని మార్చలేక పోయేరు. వేరే సంబంధం చూడమన్నాను. చూసేరు. కుదిరింది.

ఆయన అమెరికాలో రిసెర్చ్ చేస్తున్నారు. పేరు శ్రీధర్. వచ్చే నెలే మన దేశం వస్తున్నారు. ఆయన రాగానే పెళ్లి జరిగిపోతుంది.

బావా! నేను నిన్ను కష్టపెట్టేను. కాని, నిజం ఎప్పుడూ చేదుగానే ఉంటుందని నీకు తెలుసు గదా! నన్ను మరిచిపొమ్మని అడిగే సాహసం నాకు లేదు. ఎందుకంటే—నేనూ నిన్ను మరిచిపోలేను. ఎప్ప టికీ మనం మంచి స్నేహితులుగా ఉంటాం.

నీకు సాధ్యంకాదు. సాధ్యమైతే మాత్రం నన్ను క్షమించు బావా!...

ఇట్లు,
నీ దానిని కాలేకపోతున్న,
రమ.

నిర్ఘాంతపోయేడు రాజు.

ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు ... ఆ ఉత్తరాన్ని పదేపదే చదువుకున్నాడు.

ఉత్తరంలో ప్రతి అక్షరంలోనూ రమ ముఖమే కనిపించింది.

కళ్ళు తిరిగిపోయేయి రాజుకి.

కాళ్లక్రింద భూమి చీలిపోతోందనిపించింది.

ప్రపంచం తల్లక్రిందులై పోతున్నట్టనిపించింది.

చెవుల్లో తుపాను హోరు... తెగిపోయే నరాలు... గుండెల్లోమంట...తలపై సమ్మెటపోట్లు...

'అబ్బా!—' అంటూ తల పట్టుకున్నాడు రాజు—

*　　*　　*

'అబ్బే—లాభం లేదండి... అసలింతకీ మనసులో చింతేమిటో చెబుతాడా అబ్బాయి ... ఐదురోజులు ఆహారం సరిగా లేదంటున్నారు ... జబ్బు అందుకే వచ్చిందని వేరే చెప్పాలా? కాప్స్యూల్స్ ఇచ్చేను — పోనీ—అవైనా వేసుకున్నాడా? ఇవ్వాళ్టికి పదిరోజులు... కన్డిషన్ ఇప్పటికే సీరియస్‌గా ఉంది. ఇంకా అలస్యం చేస్తే లాభంలేదు. ఎలా నచ్చచెబుతారో నచ్చజెప్పి ఈ మందులైనా తాగించండి ... కనీసం నిద్రైనా బాగా పడుతుంది. ఆ కలవరింతలూ అవీ అయినా తగ్గ తాయి...ఆపైన మీ ఇష్టం—'

డాక్టరు వెళ్లిపోయేడు.

రాజు తల్లీ తండ్రీ ఒకరిముఖాలొకరు చూసు కున్నారు.

*　　*　　*

'చచ్చిపోతాను—నే చచ్చిపోతాను— 'అనుకున్నాడు రాజు కళ్లు మూసుకుని.

చీకట్లో గజిబిజిలో అతనికంతా అయోమయంగా ఉంది.

కంటిపాపకూ కనురెప్పకూ మధ్య అనంతమైన చీకటిలో—రమ !

'రమా—రమా—రమా—'

రాజు గుండెల చప్పుడులో ఆ రెండు అక్షరాలూ కొట్టుకుంటున్నాయి.

'రమా !—రమా— '

రమా—ఈ పిలుపుకి సమాధానం ఇవ్వవూ?

'బావా !—'

చల్లటి గొంతు. చల్లటి పిలుపు.

'బావా !—'

—అని మళ్లీ నన్ను అంత తియ్యగానూ పిలుస్తుందా రమ?—అనుకుంటున్నాడు రాజు.

'బావా !—నిద్రపోతున్నావా?...'

ఉలిక్కిపడ్డాడు రాజు. కళ్లు తెరిచేడు.

ఎదురుగా రమ ముఖం.

కళ్లు నులుముకుని చూసేడు రాజు.

రమ—

రమే !

రమే—వచ్చిందా ?

ఎలా వచ్చింది ?

ఎప్పుడొచ్చింది ? ?

ఎందుకొచ్చింది ? ? ?

'రమా !—'

అన్నాడు రాజు.

అతని గొంతు అతనికే బొంగురుగా వినిపించింది.

'రమా—రమా—నువ్వు—వచ్చేవా ? !—'

'—నీకు సీరియస్‌గా ఉందని మామయ్య పెత్రిగాం ఇచ్చేరు బావా—'

రమ వంక చూస్తూన్న రాజు ముఖం తెల్లగా పాలిపోయింది.

'అయితే రమా—ఎందుకొచ్చేవ్ — ఎందుకొచ్చేవ్ నువ్విప్పుడు—ఎందుకొచ్చేవ్ రమా ?—'

'—నామీద కోపమా బావా నీకు ?—'

'హు:— కోపం — నీమీద కోపం ! — నీమీద కోపం చేసుకోవడానికి నే నెవర్నిలే రమా—'

'బావవి.'

'బావని—అంతే—ఆఫ్టరాల్ బావని—'

'అలా మాట్లాడకు బావా!— నిజం చెప్పు నామీద నీకు కోపంలేదూ?—'

'కోపం!— ఎందుకూ?—'

'—నేను చేసిన పనికి—'

'నువ్వేం చేసేవ్ ? నీ సుఖం నువ్వు చూసుకున్నావ్ — నా గురించి నీ అభిప్రాయమేమిటో చెప్పేవ్ — నిజంగా సరీగ్గానే చెప్పేవ్ రమా... నేను నీకు తగను ... నేనొట్టి ఫూల్‌ని... నన్ను చేసుకుంటే నువ్వు ఏమాత్రమూ సుఖపడలేవు...'

రాజు మాటల్నివిని, రమ అతడివేపు నిశ్చలంగా చూసింది.

రాజు ముఖం మరింత గంభీరంగా మారిపోయింది — 'నేను చాలా దురదృష్టవంతుణ్ణిలే రమా-' అంటూన్నాడు.

రాజు భుజంమీద చెయ్యివేసింది రమ— 'లేవగలవా ఇప్పుడు నువ్వు-'

గమ్మున లేచేడు రాజు, ఆతణ్ణి చెయ్యి పుచ్చుకుని నడిపించి తోటలో మల్లెపందిరికింద అరుగుమీద కూచోబెట్టింది రమ— 'పిచ్చిబావా— ఇప్పుడు చెప్పు -ఎందుకిలా అయిపోయేవ్? ఊ?— నా ఉత్తరం అందిందా?—'

అతి ప్రయత్నంమీద అంటున్నట్టు అన్నాడు రాజు— 'రమా! జరిగిందేదో జరిగిపోయింది ... ఆ సంగతి మళ్లీ కదిలించకు—'

గల్లుమని నవ్వింది రమ.

నివ్వెరపోయేడు రాజు.

చాలా సేపట్నుంచి అణచిపెట్టుకున్న నవ్వు కాబోలు— గుక్క తిప్పుకోకుండా ఇంకా నవ్వుతూనే ఉంది రమ.

'రమా— రమా— ఎందుకు నవ్వుతావ్?—' అన్నాడు రాజు తికమకగా.

'బావా! ఇంక నే నాపుకోలేను. చెప్పేస్తాను— ఆ ఉత్తరం నిజమనుకుంటున్నావా నువ్వు— లేదు— సరదాకి రాసేను— నాకేమిటి— నీతోకాక ఇంకొకరితో పెళ్ళేమిటి?— సరదాకి రాసేను బావా—'

రాజు ముఖంలో ఆశ్చర్యం. సంభ్రమం, నమ్మలేనితనం—'సరదాకా?— స—ర—దా—కా!?— రమా— నువ్వేమంటున్నావ్?!—'

'అవును బావా! ... ఒట్టు—నమ్ము— ఆ ఉత్తరంలోఉన్న ఒక్కముక్కకూడా నిజం కాదు—'

రాజు ముఖంలో ఆశ్చర్యం ఆనందంగా మారిపోయింది— 'ఏమిటి— ఏమిటీ ... అయితే మరి ఆ ఉత్తరం అలా ఎందుకు రాసేవ్ రమా?...'

'నన్నే కథ చెప్పమన్నావ్ కదూ బావా! ... కథలు నాకు రావన్నాను—అయినా బలవంతం చేసేవ్— నేను కథ చెప్పలేదని చిన్నబుచ్చుకున్నావ్ — అందుకని...'

'అందుకని!— 'రాజు కళ్ళలో భావాలు గిర్రున తిరిగేయి— 'ఎంతపని చేసేవ్ రమా! ఎంత ఖంగారు పెట్టేసేవ్! నువ్వే గనక ఇప్పుడు రాకపోయిఉంటే నేనేమైపోయి ఉండేవాణ్నో— అవునూ— మరి— ఆ శ్రీధర్...'

'కథలోని ఒక పాత్రమాత్రమే ... అందులోని సంఘటనలూ వ్యక్తులూ అంతా కేవలం కల్పితం ... నీ మనసు నొప్పించేనేమో— నన్ను క్షమించు బావా—'

—అంటూ తల దించుకుంది రమ.



నా కిరీటంలో సూర్యుడు

శ్రీ సోమసుందర్

నక్షత్రాలకీ సముద్రాలకీ మధ్య
నేను పరచుకొన్న వెన్నెల దారిలో
దిగంతాలు వెదజల్లే బూడిద.

క్షితిజ రేఖల మలుపుల చేరువలో
పొగమంచు నీడబొమ్మల గుబురుల్లో
దౌడుతీసే గాడిద !
వెన్నెల విభూతిలో తోచే నైరూపాకృతుల్లో
జడిపించే తోలే మంచుకొనల చలికొరడా !

నా ఆంతర్యారణ్యంలో
చిద్రూప రహస్యావరణంలో
గతాల విగతానుభూతులు!

ఆరికగడ్డి వెంటి చుట్టుకుని
గెంతే ఎలుగుబంటి వేషాలు
గిరగిర తిరిగే సిరిబొమ్మల రోషాలు
మరిడెమ్మ జాతరలో
వెర్రిపీరుల అపహాస్యాలు
జంగమ గణాచారుల వికారాలు

తొందర తొందరగా బొమ్మలు తిప్పేసే వెన్నెల...
మాఘ మాసపు తెలివెలి బూడిద జల్లే వెన్నెల !

నా తండ్రీ తాతా నాలో జీవిస్తున్నట్లు
నా మనుమలూ వాళ్ల మనుమలూ నాలో నిద్రిస్తున్నట్లు
గతాల అగణిత ప్రకరణాల మెత్తలపై
వ్రటంగా కూర్చొని, మెత్తని ఒడి పరచి
ఆ గతాన్ని ఆప్యాయంగా చేరబిలుస్తూన్న
వర్తమానం !

గతాను గతికంగా జ్ఞాపకాలు
అల్లిబిల్లిగా పాకే వానపాములు
ఝర్రున జారే వర్తమానం
ధూర్తులకు వర్తులావర్త పుష్కరం
పుష్కలావర్త వర్తులం...

ఈ మాఘ మాసపు ఊదా వెన్నెల
క్షణక్షణం కొత్త రేకు తొడుగుతూన్న
మారుతూన్న అమాయకపు కన్నె పువ్వు
పొడుచుకువచ్చే చిగురులకోసం
వెర్రిభయాల ముదురాకుల్ని రాలుస్తుంది...

ఇప్పుడిప్పుడే సంధిస్తున్న పైరగాలి రివటలకు
కదిలే కలల పయ్యెర కెరటాలకు—
గలగల మురిసే తొలి జవ్వనపు టందెలు
శుభ వాయిద్యాల స్వాగత నాదాలు
వినిపిస్తాయి, భావికి మంగళారతులు!

దిగంతాల ముసలి మొగలి డొంకలలో
పొగమంచుల బూజు తెరలలో
నేపథ్యానికి తప్పుకొనే నీడబొమ్మలు
నియంతల చరమ సంధ్యలా
ఓటమిని ఒప్పుకొనే చలిగరిగమ్మలు...

ఈ చిరు చలివెన్నెల తెలియినుక మైదానంలో
సుప్తినీ రక్తినీ కలిపి పెనవేసిన దారుల్లో
ఏకాంత విహారం చేసే కవితా హృదయాలకు
ఎన్నెన్ని సుందర దృశ్యాలు సాక్షాత్కరిస్తాయి!
ఎన్నెన్ని జ్ఞాపకాల సోపానా లెగ్రబాకిస్తాయి!

ఇన్ని బరువు గోళాల అంతరిక్షాన్ని
నా కోసం సునాయాసంగా వంచి
పసిడి కలల గొడుగు నాపై కప్పుతుంది
నక్షత్రాలకీ సముద్రాలకీ మధ్య
నా కవిత్వాన్ని రత్నకంబళిగా పరుస్తుంది
నెమ్మది నెమ్మదిగా నా హృదయాన్ని
భూమధ్యరేఖవైపుగా జరుపుతుంది
నా కిరీటంలో కోహినూరుగా
సూర్యఘృణిని పొదుగుతుంది...వర్తమానం!

బౌద్ధ శిథిలాలు 'లంజదిబ్బ' లెట్లైనవి?

శ్రీ జి. ఆర్. వర్మ

కాలగర్భాన కలసిపోయి దిబ్బ (బోడు, హుండా) లైపోయిన బౌద్ధ క్షేత్రాలను సన్యాసి దిబ్బలు, బోగముదాని (సాని, లంజ) దిబ్బలంటున్నారు. ఉత్తర సర్కారు జిల్లాల్లో హిందూకులము లన్నిటా సన్యాసి పేరిటి వ్యక్తులున్నారు. శ్రీకాకుళం జిల్లాలో గుప (గుహాలయ—బౌద్ధం) స్వామి పేరిటి వ్యక్తులున్నారు. గుప్తయుగంనాటికే కొన్యోధ, కొంగోడు (గంజాం, ఒరిస్సా) రాజుపేరు గుహదేవ, పిమ్మట కొన్ని శతాబ్దములవరకు రాజధాని గుహదేవపాటకము.

హిందువుల్లో ఆధ్యాత్మికచింతనాపరులైన వారి తావులను, విరాగులైనవారి తావులను సన్యాసి దిబ్బలనుట లేదు. మన పురాణ గాథల్లో ఋషులు సన్యాసులు గారు. కొన్ని శతాబ్దాల పిమ్మట బౌద్ధుల జూచి సన్యసించ నారంభించారేమో! సన్యాసి పేరు ఈ లెఖను బౌద్ధుల సంబంధం అనవచ్చును. ఒకనాడు బౌద్ధం సర్వజనాదరణీయం, బౌద్ధ సన్యాసుల 'పాపులారిటీ'ని సన్యాసి వ్యక్తినామాలు సూచిస్తున్నాయి. సన్యాసి దిబ్బలంటే బౌద్ధ శిథిలాలు. బుద్ధుని తర్వాతి కాలంనుండీ బౌద్ధక్షేత్రాల్లో ఉన్నది బౌద సన్యాసినిలు, సన్యాసులు. బౌద్ధ శిథిలాలు (చైత్య, విహార)ను సన్యాసి దిబ్బలనుట సహజము, ఏమాత్రమూ ఏహ్యభావమూ, న్యూనతా లేని పేరు.

రెండవపేరు స్త్రీ సంబంధం, న్యూనత నాపాదించేదిగా ఉంది. బౌద్ధాన్నపహాస్యం చేయడానికే ప్రబుద్ధులైన పనిగట్టుకు ప్రచారం చేసాడా? బ్రాహ్మణ్యం దేవభాషజేసిన సంస్కృత శబ్దార్థం తెలియక ఆ పేరు పెట్టాడా? కారణం తెలియక తికమక పడేవారికి, కాబోలు ననుకొనేవారికీ మరింత 'నమ్మబుల్'గా మన పండిత పరిశోధకులు ప్రచారం చేసారా? మూడోవారి ప్రమేయం గలదనిపించేట్లున్న వ్యాసం ఒకటి చూచాను— ఆ భాగం—

'శాలిహుండాము...ఆరుగొల్లు...ఇత్యాదిగా ప్రతి స్థలమందు పురాతనమైన కోటలు శిథిలములై నిలచియే యున్నవి. అవి లేనిచోట చైత్య, విహారములు లేనేలేవు. దీనినిబట్టి ఆయాదుర్గములందుండి పాలించు ప్రభువుల భోగినులకై యితర ప్రదేశములనుండి వచ్చిన బౌద్ధభిక్షువుల బౌద్ధసిద్ధిసాధనకై ఈ మేడాకములు, విహారములు నిర్మితమైనవనుట నిశ్చయము. ఈ నిర్మాణములు లంజదిబ్బలు, బోగము దాని దిబ్బలు అను పేరులు నిలచియుండుటయే దీనికి ప్రబల నిదర్శనము. భోగినీ నిర్మాపితములు గనుక వీనికీ పేరు వచ్చినదన్న విషయము చిరకాలమునుండి వచ్చుచున్న జనశ్రుతిలో నిలచియే యున్నది...'

వ్రాసినవారు పరిశోధకులో కాదో సూచింపకున్నా పై వాక్యాలుబటి రచయిత పండితుడన వచ్చును. మేధావులు, పరిశోధకులు సత్యాన్వేషణ జేసి జనసామాన్యంలోగూడ పాతుకుపోయిన మూఢభావాలు తొలగించాలేగాని వక్రభాష్యాలుతో తప్పుడు నమ్మకాల బలపర్చుట మంచిదికాదు. తెలంగాణాలో రెండు దశాబ్దాలనాటి దృశ్యం—హిందూ శిథిల ప్రతిమలపై మహ్మదీయ బాలబాలికలు ఉమ్మివేసి, తన్ని, రాళ్ల వేయడం—ఎందుకా పనిచేస్తున్నదీ వారికి తెలియదు. పూర్వం తంతు తథాంగాల గుంటబెట్టి, బ్రాహ్మణ్యాన్నొక ఊపు ఊపింది బౌద్ధము. రెండు మతాలమధ్య విద్వేషం శతాబ్దాలు సాగింది. బౌద్ధాన్నంతగా ద్వేషించినా బ్రాహ్మణ్యం బౌద్ధుల ఆచారాదులనేకం కొన్ని మార్పులతో అనుకరించిన చరిత్ర ఉంది. నాటి బౌద్ధ ద్వేష శేషం ఇంకా బ్రాహ్మణుల్లో ఉందా?

సాలిహుండాను జనసామాన్యం గూడా సాని ఇత్యాది దిబ్బలనరు. న్యూనతాభావంలేని సాలిదిబ్బ, సాతవాహనుల సంబంధం అనుకొంటున్నారు. సాలి హుండా పూర్వ నామం ఆద్యక్షరాలు రెండూ సాలి. ఈ క్షేత్రం గూర్చి లోగడ 'Journal of Andhra Historical Research Society, Andhra Pradesh, Sunday Standard, ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రభ, ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక'ల్లో వ్యాసాలు ప్రకటించాను.

సాలిహుండాలో గారవద్దనున్న చిన్నకొండపై త్రవ్విన పురాతత్వశాఖవారు కనుగొన్నది కోటగాదు, స్తూప విహారాలు. పిమ్మటి కాలపు బౌద్ధ ప్రతిమ లను సాలిహుండా ఊర్లో కనుగొన్నారు.

ఆరుగొలను గూర్చి 30 ఏళ్ల పూర్వం 'ఆంధ్ర పత్రిక సచిత్ర వార పత్రిక'లోనూ ఆ మధ్య 'ఆంధ్ర పత్రిక' సారస్వతానుబంధమున వ్యాసాలు ప్రకటించాను. మరికొన్ని విషయాలిపుడు వ్రాస్తున్నాను. ఆరుగొలను గ్రామ జనాభాలో గొల్లవారు, కాపువారున్నారు. అక్కడ కాపురమున్నవారు బాగుపడలేదు, స్థిరాస్థి లక్కడే ఉన్నా కాపురాలు వేరొక గ్రామానికి మార్చాక బాగు పడినారంటారు. గ్రామస్తుల కథనం—అక్కడ ఉన్నవి కోటదిబ్బలు, రాక్షసులు కట్టిన కోట, నిధు లున్నవి, నిధులకు కాపలా నాగుపాములు, దుర్గ రక్షకి 'కోటమ్మ' ముప్పయ్యేళ్లపూర్వం జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సాంబమూర్తిగారు ప్రత్తిపాడు బస్స్టాప్‌వద్ద కారాపి దూరదృశ్యాన్నిచూపి అవి బౌద్ధ శిథిలాలు మీరుచూచి, ఆలోచించి వ్రాయమన్నారు. బౌద్ధశిథిలాలంటే గ్రామస్తులు నమ్మటలేదు.

ఆరుగొలను చేరువనున్న దిబ్బలు వగైరా మొత్తం సుమారు 600 ఎకరాల విస్తీర్ణం గలది. దక్షిణభాగం సుమారు 160 ఎకరాల భూమి చుట్టూ కోటప్రహరీవలె నలువైపుల దార్లున్నట్లు ప్రాకారంవలె దిబ్బలున్నాయి. ఇదే గ్రామస్థులనుకునే కోట. ఈదిబ్బలచుట్టూ ఒకప్పుడు అగడ్తవంటి దుండే దనిపించే పల్లపుభూమి ఉన్నది. మొత్తం భూమి (కోట వగైరా కలుపుకొని) చుట్టూ ఒకప్పుడుండే దేమో తెలియదు. అటు దక్షిణం ఆరుగొలనునుండి ఇటు పడమరకుంచనపల్లి వరకూ పెద్ద చెరువున్నది. ఈ 'కోట'లోపల 7—8 నిలువులవరకు పాటిమట్టి తవ్వి అమ్మి లాభం జేసుకున్నారు రైతులు. ఈ త్రవ్వ కాల్లో వారికి దేనికి చెందినవో తెలియని శిథిలములు, ఎఱ్ఱరకుండ పెంకులు, పెద్దపూసలు, పెద్ద పెద్ద ఇటికలూ, ముక్కలు లభించాయి. ఈ పోలిన పెద్దసైజు యిటికలు 'కోట' ఆవల ఉత్తర భాగానగూడా ఉన్నాయి. ఒక చోట ఇటికగోడ చిన్న శిథిలమున్నది. ఈ ఉత్తర భాగాన విడిగా రెండు దిబ్బలున్నవి. ఒకదాన్ని 'పెద్దలంజ దిబ్బ' మరో దాన్ని 'చిన్నలంజ దిబ్బ' అంటున్నారు. వీటిలోగూడ పెద్దసైజు ఇటికలున్నాయి. ఇవన్నీ పురాతత్వశాఖ వారి 'రక్షితప్రదేశం' అనే బోర్డులున్నా 'అరక్షితం' గానే ఉన్నాయి. ఈ దక్షిణభాగపు 'కోట'నుండి పాలించిన రాజు (?) కు ఇద్దరు ఉంపుడు గత్తెలట. వారి నివాసాలట. పెద్ద, చిన్నలంజ దిబ్బలు. ఇందొ కామె కడియం అమ్మి త్రవ్వించినందున (పెద్దచెర్వు) కడియాల చెరువని పేరట. 'కోట' ప్రహరీ దిబ్బల మీాద అపుడపుడు ఆయుధాల ముక్కలు కనిపిస్తుంటా యట. ఆ 600 ల ఎకరాల భూమిలో అపుడపుడు నంది చిహ్నమున్న స్వర్ణ రజత నాణెములు దొరకెనట. ఒకరికి కల్వంపోలిన మూరుడురాయి దొరకెనట. త్రవ్వ కాల్లో లభించిన విగ్రహాల్లో పాదములవద్ద నక్కఉన్న దేవీ ప్రతిమనే 'కోటమ్మ' అంటున్నారు. పెద్దసైజు ఇటికలబట్టి రాక్షసులు కట్టిన కోటగా భావించారు.

బౌద్ధక్షేత్రాలకు మార్పులు, చేర్పులు ఇక్ష్వా కులతో అంతరించి సాలంకాయనులనాడు సన్యాస జన సమ్మర్దంగా ఉండి, ఒకరిద్దరు విష్ణుకుండినులు నిరాదరణ పాల్జేయకుండిన పిమ్మట వేంగీచాళుక్యుల నాటినుండి శిథిలంకా నారంభించాయి. బౌద్ధ నిర్మా ణాలు 14 శతాబ్దాలనాడే ఆగిపోయినా దుర్గనిర్మాణాలు 3 శతాబ్దాల పూర్వం వరకూ జరిగాయి. బౌద్ధ క్షేత్రాల్లో ఇటికరాయి ఉపయోగం అశోకచక్రవర్తికి

పూర్వమే ఉంది. ఆంధ్ర, సాతవాహనుల కాలాన బౌద్ధ క్షేత్ర నిర్మాణాదుల స్వర్ణయుగము, చరిత్ర హిందూ మతముతో పోల్చిన బౌద్ధంరాజుల ఆదరణతో' 'బ్రదికిన' దనిపించదు.

జనుల ధనసహాయంతో క్షేత్రాలు బౌద్ధులే నిర్మించుకున్నారు. సహజంగా దాపుల్లో పర్వతాలు, రాళ్లు లభించనిచోట, కాస్త ఎత్తుగా, సమతలంగా ఉన్నచోట్ల కట్టబడి కుపయోగించినది పెద్ద సైజు ఇటికలు — సాతవాహనులనాడు ఇటిక లెక్కువగా వాడారు. ఆరుగొలనువంటి సమతల భూముల్లో స్తూపాలు, సంఘారామాలచుట్టూ రాళ్లు, రప్పలు, ఇటికలు, అడుసుమట్టితో ప్రాకారం కట్టేవారు. దీని చుట్టూ వెదురు, కంపకంచె కట్టేవారు. దీనిచుట్టూ దార్లు వదలి కందకంవంటి గోతులు త్రవ్వేవారు. ఈ నిర్మాణ శిథిలాలు చూడ్డానికి కోట అనే భ్రాంతి కల్గించేవి. బౌద్ధనిర్మాణాలు సాధారణంగా భిక్ష సుభిక్షంగా దొరికేతావులు, రాజధానులు, వర్తక కేంద్రములకు అతి చేరువగాక, దూరమునగాక అందుబాటులో జనసమ్మర్థం లేకుండా, ధ్యానభంగంగాని తావుల చేసారు. ఆదిలో స్తూపాలు (ఏడూకములు) మట్టివే. ఆ క్రీ. పూ. కాలమున దుర్గాధిపతుల భోగినీ స్త్రీలు బౌద్ధులనే ఆధారం ఉందా?

ఆరుగొలను దగ్గరి దిబ్బలభూమి పురాతనమైన బౌద్ధ మహానగరమని పరిశోధకాభిప్రాయము. పదమూడు శతాబ్దములనాడే శిథిలమైనది. ఆరుగొలనులో కోట ఉండుట నిజమే— సహజరక్షణా సౌకర్యాలున్న తావు, బౌద్ధ శిథిలాలపై కొన్ని శతాబ్దముల తర్వాతిరాజులు కొన్నిచోట్ల దుర్గనిర్మాణాలు చేసారు. వేంగీ మహాదేవరాజు కాలాన ఆరుగొలనులో కోట ఉండేది. అంటే శిథిలమైన బౌద్ధక్షేత్రం పై సుమారు ఏడుశతాబ్దాలపూర్వం దుర్గనిర్మాణం — కాగా అంతకుముందే ఆరుగొలను పరిసరాలు రణరంగమైయ్యుండె ననిపించును. ఆరుగొలను తాడేపల్లిగూడెం— నిడదవోలుకు మధ్యనున్నది. వేంగీశ్వరుడైన భీమసలుక్కి కొడుకు నిడదవోలు, పడమరగా పెరువంగూరు యుద్ధాల్లో రాష్ట్రకూటుల నోడించి రాష్ట్రకూట గుండయ దండనాధుని వధించి వీరస్వర్గమొందినట్లు చరిత్ర ఉంది. అప్పుడప్పుడు ఎముక ముక్కలు కనిపించుచున్నను, గ్రామస్తుల కదో రణ రంగమనీ, శతాబ్దాలపూర్వం బౌద్ధ కేంద్రమని తెలియదు.

బౌద్ధ క్షేత్రములందంతటా కోటలు లేవు. కోటలనుండి పాలించిన రాజుల ఉంపుడు కత్తెలు బౌద్ధులనే విషయం నా దృషికి రాలేదు. బౌద్ధ మతపతనానికి కారణాలు అనేకము. చివరిదశలో వారు బ్రాహ్మణ్యపు తంతు తథాంగాల కలవడి, విజ్ఞాన సముపార్జన వదలి 'పాపులారిటీ' జనసామాన్యాభిరుచుల కనువర్తనగా—తాంత్రికంగా—నైతికపతనము చెందారు. ఈ లైంగిక నైతిక పతనం అనేక మతాల సన్యాస జీవిత చరిత్రలో ఉంది.

గత కాలపు చరిత్రలో, కౌటల్యుని 'అర్థ శాస్త్రము' నాటినుండి ఆఖరి చాళుక్యులవరకూ వేశ్యలు సప్తసంతానాల నిర్పినవైనం, సానులు హిందూ దేవాలయాలకు చేసిన దానాలకి ఆధారం ఉంది ఈ వేంగీ చాళుక్యులలో కొందరు రాజులు జైన కథాకారిణులను పోషించారు—ఈ జైన భోగినీ స్త్రీల గూర్చిన శాసనాలున్నాయి. వీరి సందర్భంలో సాని వగైరా దిబ్బల్లేవు. ఒక్కబౌద్ధ శిథిలాలకే ఈ పేరు వచ్చింది. భోగినీజనం నిర్మించారు కాబట్టి, తమ భోగినీ జనానికీ, బౌద్ధభిక్షువులకై దుర్గాధిపతులు కట్టించారు కాబట్టి ఆ పేరు వచ్చిందనే పండిత పరిశోధ కాభిప్రాయంలో నిజం ఉందా? భ్రమాజనితమా? తెలియనితనమా? పనిగట్టుకు చేసిన దుష్ప్రచారమా? సరిగా అర్థమయ్యేట్లు వ్రాయగలంత భాషా జ్ఞానం నాకు లేదు. కాని నా ఆలోచనలను పండిత, పరిశోధకుల ముందుంచి తమ అభిప్రాయాలు దురభిప్రాయ లేమో పునర్విమర్శ చేసుకో గోరుచున్నాను.

పటు అంత్యాక్షర నామగ్రామాలు బ్రాహ్మణ్యాన అగ్రహారం; ఆధ్యాత్మిక, వేద, తదితర విద్వజ్జనా వాసములు, త్రికళింగాధీశుడైన అనంతవర్మ

చోడగంగ దేవరాజు క్రీ. శ. 12 వ శతాబ్దపు కొర్ని శాసనంలో గార (గ్రామం) వద్దనున్న తావునే 'మణ్డపఱు' అనెను. ఈ 'మణ్డపఱు' సాలిహుండా (శ్రీకాకుళం) ఈ 'మణ్డపఱు'లో భోగినీజనం వగైరా సూచన లేదు. ప్రసిద్ధ బౌద్ధక్షేత్రం—స్తూప, విహారాదులు దిబ్బలైయ్యున్నతావు, బౌద్ధ సన్యాసుల తావు. గీర్వాణ మెరిగిన పండితులు ఈ 'ముణ్డ' అర్థం తెలుసుకోడం అనవసరమనిపించో, మరే కారణాన్నో జనసామాన్యం అనుకునే మాటలు బలపర్చేట్లుగా ముణ్డను సాని, లంజ, భోగముది, ఉంపుడు కత్తె వగైరా ప్రచారము. మన ఋషులు సర్వసంగ పరిత్యాగులుగా కాన్పించరు. బహు పురాతన కాలమునుండీ సన్యసించిన వారిలో బౌద్ధుల జనాభా ఎక్కువ. మన ఋషులకు గడ్డం, మీసాలు, సంసారం ఉన్నయి. జైన, బౌద్ధ సన్యాసీ సన్యాసినులకే తలగుండు చేయించే ఆచారము. బుద్ధుని తర్వాతి కాలపు బౌద్ధ సన్యాసులందరూ బోడిగుండువారే — దేవునికి తలనీలా లీయడంలో కొందరు 'సెక్స్' సంబంధం జూచారు. నేనట్లనుకోను. మనిషికి నిండుతనం, ఆకర్షణ శిరోజాలు. తలగుండు చేయించడంలో ఆకర్షణ, అహం భావం 'తిరుక్షౌరం'—దాసోహం అనే భావము. శత్రువుల్నీ, దుశ్శీలలైన వివాహిత స్త్రీలను పరాభించడానికి తలగుండుచేసిన వైనం ఉంది.

పున్నామ నరకం, పాపకూపంనుండి పైకి లాగించుకోడానికి పెట్టుకున్నారు పిలక అనుకోనవసరంలేదు. బౌద్ధుల ఆచారాలు ఆదరించుటలో బ్రాహ్మణులు గుండు చేయించడంలో జైన, బౌద్ధులకు విభిన్నులమనే సూచనగా పిలక ఉంచేవారనుకుంటాను. హిందూత్వానికి చిహ్నంగా క్రాపుతోపాటు చిన్న పిలక నేడూ ఉంది.

బోడిగుండువారినీ, గుండు చేయడం సందర్భంగా సంస్కృత శబ్దాలు' ముణ్డ, ముణ్డి. ముణ్డిత, ముణ్డియ' వగైరా—తలగుండు చేసుకున్న (సన్యాసుల) వారినే 'ముణ్డి' అన్నారు. సామాన్య వ్యవహారంలో 'ముణ్డి' అంటే బౌద్ధ సన్యాసి. రానురాను బౌద్ధ సన్యాసులు జనుల దృష్టిలో హీనులయ్యారు, ముఖ్యంగా బ్రాహ్మణ్యాన 'ముద్రారాక్షసము' నాటికి బోడిగుండువా రెదురైన అశుభం అనే మూఢనమ్మకం ప్రబలింది.

వైదికం, ఆదిబ్రాహ్మణ్యం స్త్రీ కిచ్చిన విలువ పిమ్మటికాలపు బ్రాహ్మణ్యం బాగా 'డీ వాల్యూ' చేసింది. బ్రాహ్మణ ' మగ మహారాజె'వరో 'ఇంకో ఆకు ఎక్కువ చదివాడు'. స్త్రీ జన సహజాలంకార వాంఛ, ఆకర్షణ, ఆహార విహారాల్లో కట్టుబాట్లు, ధర్మసూత్రాలు నిర్దేశించని ఆచారం విగత భర్తృకకు అన్నిటితోపాటు 'క్షవరం' జేసినవి శిరోజాలు. ఈ ముండన అయిన (ముణ్డిత) స్త్రీ ముండ, బాగా అర్థమయ్యేట్లు వెధవముండను జేసారు. సాంఘికంగా బ్రాహ్మణులతో సమానమైపోతామనే భ్రాంతిలో ఇతర కులాలవారు గూడా కొందరు విగత భర్తృలకు తల గొరిగించ నారంభించారు. పూర్వ సువాసిని బాహ్య లక్షణం బోడిగుండు అయింది. పూర్వం జైన, బౌద్ధ సన్యాసుల శకునం అశుభం—ఆ గుండుతనం ఈ విగత భర్తృక గుండు కాపాడించుటలో వితంతువు శకునం అశుభము. సకేశినీ పూర్వ సువాసినిగూర్చీ ఇదే నమ్మకం బలసింది. బట్టతలవారియందూ అదే భావం ప్రదర్శించారు.

పూర్వం స్త్రీ ఎప్పుడూ సుమంగళియేనట. విగత భర్తృక అయితే బావకో, మరదికో భార్య అయ్యేది—నేటికీ ఆదిమ జనాంగం అనబడే వారిలో ఈ ఆచారం ఉంది. మధ్యకాలపు మనవారెందుకో, నాటి వారి సాంఘికాధిక్యతకోసమే—కుటుంబ నియంత్రణకు మాత్రం కాదు. స్త్రీకి పునర్వివాహార్హత 'క్షవరం జేసారు. సాంఘికంగా గొప్ప అనుకుంటూ బ్రాహ్మణులజూచి ఇతర కులాలవారు కొందరు వారి ననుకరించారు. ఈ సాంఘిక 'శృంఖలా'ల్లో చీకటి తప్పులు ఎక్కువవడం సహజము. అందుకే కాబోలు వేమన పేరిటి పద్యాల్లో 'తలలు బోడియైన తలపులు...ద్వంద్వార్థ హాస్యం విపరీతంగా ఆదరింపబడిన గ్రామఫోన్ రికార్డు పాటల్లో డాక్టర్ వెంకటచలం

ఒక విసురు విసిరాడు' ముండలైన రండలైన మా జాతిలో ఉండరు...'

సాహిత్యపరంగా మరో సందర్భం చెప్తాను. మన ప్రాంతాలకు క్రీ. పూ. 4–5 శతాబ్దాల్లో వచ్చిన ఇక్ష్వాకులు జైనులట. యశోధరుడు వేంగిని జయించి ప్రతీపాలపురం (భట్టిప్రోలు) రాజధానిగా పాలించెనట. అతని కొడుకుల్లో పెద్ద వారిద్దరూ సన్యసించారట. కనిష్టుడు రాజుగానుండి సర్వదష్టుడై మరణించెనట, నిస్సంతు. మంత్రులు తదితరులు సన్యసించిన వానిని కపటోపాయమున రాజధానికి తీసుకువచ్చి కృతకృత్యులైనది. నియోగము అనేక జాతుల్లో దేశాల్లో పురాతనాచారం—తమ్ముని భార్యకు పుత్రభిక్ష పెట్టాడు. ఆ పుట్టిన ద్వితీయ యశోధరుడు బోడిగుండు వానికి పుట్టినందున 'ముణ్డియ సుతు'డై—ఆ కుటుంబం 'ముణ్డియ వంశ' మనబడెనట. ఇక్ష్వాకుల ఈ 'ముణ్డి' శబ్దాన్ని పరిశోధకులు కొందరు ఆదిమజనాంగమైన 'ముణ్డా' జాతికి ముడి పెట్టారు. రాజకీయంగా శాతవాహనుల తర్వాతి వారైనా వారికంటె పురాతన జనాంగం ఇక్ష్వాకులు. ఈ పోలిక పేరిటి జనులు బహుపురాతన కాలమున ఇతర దేశాల్లోగూడా ఉన్నారు.

ఈ 'ముణ్డ' కర్థం వెదకడంమాని, లేక తెలియక బౌద్ధానికి భోగినీ స్త్రీలకు ముడిపెట్టారీ పండితవర్యులు. జనసామాన్యంతోపాటు పండితులు గూడా ముండన సంబంధం ముండ—భోగిని—సాని, లంజ వగైరాగా భావించారనిపిస్తుంది.

రెండు—సానిశబ్దం శాసనాల్లో విభిన్నార్థకంగా ప్రయోగించినట్లు కనిపిస్తుంది కాని అగౌరవ వాచకం గాదు. శాసనాల్లో రాజాంతఃపుర స్త్రీలు, గౌరవ కుటుంబాల స్త్రీలు, యజమానురాలు సానివాచ్యులుగా ఉన్నారు. ఇటీవలనే ప్రచురించిన 'మైలారదేవ' రివైజ్‌డ్ ఎడిషన్ నిమిత్తం తురగా కృష్ణమూర్తిగారు కొన్ని శాసనపాఠా లంపారు. సుప్రసిద్ధ వేంగీ వర్తక సంఘీయులైన పెనుగొండ కోమటివారి స్త్రీల పేర్లతోగూడ (క్రీ. శ. 14—15 శతాబ్దాలు) సానిశబ్ద మున్నది. సానిశబ్ద మున్నదని నేటి భావంలో జారిణి, భోగిని వగైరా అంటే దేహశుద్ధి చేస్తారు. కొన్ని శాసనాల్లో దేవదాసీలు — దేవుని నృత్యగానాల అర్ధించేవారు సానులని పేర్కొనబడినారు. శ్రీ కూర్మంలో 'సానివీథి' బౌద్ధ సంబంధ మేమో తెలుసుకోబోయాను. అది గత కాలపు దేవదాసీల వీథి, ఆ స్త్రీలు యావజ్జీవం ఎవరో ఒకర్ని నమ్ముకొన్న వారే గాని పణ్యాంగనలు కారని ఎస్. టి. పి. వి. కూర్మాచార్యులుగారు జవాబు వ్రాసారు.

గతంలో చారిత్రకంగా చిరకాలం సాని న్యూనతా భావం గాదు. మనం మహారాజు అనే సాధారణార్థం ఆదిలో ప్రభుపరం గాదు, మత పరం. నేటికీ మఠాధిపతులను, యజమానులను 'మహరాజ్' అనే ఆచారం ఉంది. చక్రవర్తి శబ్దం ఆదిలో బుద్ధభగవానుని పరంగా ఉంది. స్వామి అనగా దేవుడు. భర్తనూ (పతి (దేవుడు) స్వామి అన్నారు. భూపతులూ స్వాములు (మాఢరీపుత్ర స్వామి వీరపురుషదత్త) క్రైస్తవుల 'లార్డ్'గూడా ఆదిలో ఆధ్యాత్మికపరము. ఆధ్యాత్మిక పరమైన స్వామి నేటికీ పీఠాధిపతులు, సన్యాసుల పరంగా స్వాములవారు-దేవుడు అనే వ్యవహారార్థం స్వామి—ఈ శబ్దాన్ని దేవుని ప్రతినిధులైన మఠాధికారులు, దేవాంశ సంభూతులనబడిన రాజులు వాడుకున్నారు. అది గౌరవ వాచకము. స్వామి శబ్దానికి స్త్రీ లింగం స్వామిని—స్వామిని భ్రష్ట శబ్దం సాని. దేవాలయ శాసనాల దేవదాసీ(సాను)ల కంత గౌరముండియుండును. బౌద్ధం సర్వజనాదరణాకాలాన భక్తి గౌరవాదరణల్లో సంబోధన బౌద్ధ సన్యాసిని స్వామిని.

లైంగిక నైతిక పతనం ఒక మతం, వృత్తి జీవనానికే ప్రత్యేకం గాదు. ప్రకృతి సహజం. అన్ని మతాలు, జాతులు, దేశాలు, సన్యాస జీవితాలకుంది. ఐతే ఈ దుష్ప్రచారం మన ప్రాంతాల ఒక్క బౌద్ధానికే వర్తింప చేయడంలో బ్రాహ్మణ్యం బాధ్యత హెచ్చనిపిస్తుంది. నాటి బ్రాహ్మణ్యాన్ని గూర్చి ఇలా వ్రాసినందుకు నేటి బ్రాహ్మణులు, మిత్రులు అన్యథా భావించకుందురుగాక.

మనుచరిత్ర - కుతపకాలము

శ్రీ ఏరూరు సీతారామశర్మ

పై శీర్షిక గల వ్యాస మొక్కటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారు ప్రచురించిన 'సాహిత్య వ్యాసములు'—(తెలుఁగు కవిత్వపు తీరుతెన్నులు) ప్రథమ సంపుటమునందు గలదు. ఈ వ్యాసమును రచించిన వారు బ్రహ్మశ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు. ఈ వ్యాసాంతమున 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక' విభవ—మార్గశీర్ష పుష్యములు—1929. సంపుటము 17. సంచిక 5 అని ముద్రింపబడియున్నది. అనగా 1929 సంవత్సరమునందు ప్రకటితమైన యీ వ్యాసమును మఱల సంకలన కర్త ముద్రించి యున్నాడన్న మాట.

సంకలన కర్త గ్రంథాదినిగల పీఠికలో నీ వ్యాసమునకు సంబంధించి యిట్లు వ్రాసియున్నారు. 'పెద్దన కావ్యరచనా శిల్పములోఁ జంద్రునిలోని మచ్చవలెఁ గుతపకాల ప్రశంస కొంత వెగటును గల్పించినను, అది యా కవి చంద్రుని కాంతి కెట్టి కళంకము సంపాదింపదని కంఠోక్తిగా నయమున భయమున నచ్చజెప్పు శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి వాద కౌశల్యమునకు మచ్చుతునక వారి వ్యాసము.'

శ్రీ బ్రహ్మయ్య శాస్త్రిగారి వాద కౌశల మీ రీతిగా నున్నది. 'కథా సందర్భముంబట్టి చూడ సిద్ధుఁడు మందిచ్చిననాఁడే ప్రవరుఁడు హిమగిరి కేగినట్లు గాన్పించుచున్నది. కుతప కాలానంతరమున హిమగిరికి బయలువెడలిన ప్రవరుఁడు హిమగిరియందుండగా నాఁడే మధ్యాహ్న మగుట యసంభవమగుచున్నది. కాన పెద్దన కుతపకాలానంతరమున మధ్యాహ్నమును వర్ణించి మూలకథను సందర్భ విరహితముగా నొనరించెను. అని వ్రాసియుండగా, పెద్దనయం దభిమానము గలవారమనుకొను వారీ దోషము నెట్లైన సాధువుగా మార్చి పెద్దనను సమర్థింపవలెనని విశేష ప్రయత్నము గావించి కుతపకాలమున సిద్ధుఁడు వచ్చిన దినమునఁ గాక మఱునాఁడుదయమునఁ బాదలేపమును బూయుటయుఁ బ్రవరుఁడు గిరి కేగుటయుఁ గలిగిన దనియుఁ బెద్దన గావించిన మధ్యాహ్న వర్ణనము మఱునాఁటిదై యుండవలెననియు వ్రాసిరనియు పెద్దన్న పక్షమవలంబించిన పూర్వ విమర్శకులుకూడ నీ వాదమును అంగీకరింపలేదనియు, వ్యాసమునందు శ్రీ శాస్త్రిగారు చక్కఁగఁ జర్చించి 'మనుచరిత్రమునందలి కుతపకాల విషయిక దోషమొక్క ప్రమాదములేశము. ప్రమాదము లెంతటి వారికైన నుండవచ్చును. అంతమాత్రమునఁ గవులకుఁగాని గ్రంథములకుఁగాని లోపమింతయు రానేరదు.' అని వ్రాసి యుపసంహార వాక్యముగా 'ఏ విధమునఁ జూచినను గవియందుఁ దప్పులేదనుట కవకాశము గాన్పించుట లేదు. ప్రమాదములను గప్పఁబోయి యస్వాభావికములైన లేనిపోని కల్పనముల నన్నింటినిజేసి యూహాలపై నాకాశ హర్మ్యముల నిర్మించుటకంటెఁ బ్రమాదములను న్యాయదృష్టితో నంగీకరించుటయే మేలని' వ్రాసియున్నారు.

శ్రీ బ్రహ్మయ్యశాస్త్రిగారు చెప్పినట్లు మధ్యాహ్న వర్ణనము సిద్ధుఁడు వచ్చిన కుతపకాలము నాఁటిదే యని యనుకొందము. ఈ విషయమును పండితులు విమర్శకులు అంగీకరించి యున్నారు. పైగా వాదము సహేతుకమైనది. కాని పెద్దన్న కాపాదించిన మధ్యాహ్న వర్ణన దోషము, దోషము కాదని, ఆపాదించిన దోషమునకు విపర్యయముఁ గూర్చ

వచ్చునని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. ఈ వ్యాసోద్దేశ్యముగూడ నదియే! చూడుడు.

ప్రవరుఁడు హిమగిరి కేగినాఁడు. అతఁడక్కడ చూచిన ప్రదేశములు, స్థలములు మొదలగువానిని గూర్చి పెద్దన్న వ్రాసియున్నాఁడు. వా విషయములను స్మృతికిఁ దెచ్చుకొందము.

ప్రవరుఁడు 'నరనారాయణ చరణాంబురుహద్వయ భద్రచిహ్న ముద్రిత బదరీతరుషండ మండలాంతర సరణిన్' జని ఎదురుగా నలకానదినిఁ జూచినాఁడు. తరువాత సూర్యకాంతి, తిమిరము లచ్చట తిల తండుల న్యాయమున వెలింగినవని వర్ణించినాఁడు. ప్రధానముగాఁ బ్రవరుఁడు చూచినవన్నియు నీ క్రింది పద్యమునం దభివర్ణితములు.

సీ. నిడుద పెన్నెఱిగుంపు జడగట్టు సగరు ము
    మ్మనుముందు తపము గైకొనిచోటు
జరఠకచ్ఛప కులేశ్వరు వెన్నుగానరా
    జగతికి మిన్నేరు దిగిన చోటు
పుచ్చడీక తనంబు పోఁబెట్టి గిరికన్య
    పతిగొల్వ నాయాస పడినచోటు
వల రాచరాచ వాడలికాకు కనువెచ్చ
    గరగిన యల కనికరపుచోటు

గీ. తపసి యిల్లాండ్ర చెలువంబుఁ దలఁచి తలఁచి
మున్ను ముచ్చిచ్చును విరాళి గొన్నచోటు
కనుప పులు వేల్పుఁ బడవాలుఁ గన్నచోటు
హర్షమునఁ జూచి ప్రవరాఖ్యుఁ డాత్మలోన.'

భగీరథుఁడు గంగను భువికిఁ దీసికొనిరాఁ దపము చేసిన చోటు, మిన్నే భువికిఁ దిగినచోటుఁ పార్వతి పతిఁగొల్వ (పతి యనురాగమును బడయుటకు గాను) అగచాట్లు పడినచోటు, మన్మథుఁడు శివుని మూఁడవకంటి మంటలో దగ్ధమైనచోటు, దేవసేనాని, కుమారస్వామి, జన్మించినచోటు మొదలగునానిని ప్రవరుఁడు చూచినట్లు పై పద్యము వివరించుచున్నది.

పై పద్యమునందు భావికథా సూచన మున్నదని సాహిత్య మీమాంసకులు వివరించియుండుట అందరెఱింగిన విషయమే! దేవతాస్త్రీయైన వరూథిని మానవమాత్రుని యందమునకు వలచి మిన్నేరు భూమికి పతనమైనట్లు, యామె తన యౌన్నత్యము నుండి దిగజారి వేవుననియు, సిగ్గుమాలి యతనితో సురతసౌఖ్యమును బడయుటగాను నానా యాతనలఁ బడఁబోవు చున్నదనియు, ఆ ప్రయత్నమంతయు వ్యర్థముకాగ విరహ మనుభవింపవలసి వచ్చుననియు కుహనా ప్రవరుని ప్రసంగము, స్వారోచిష మనుసంభవము కాగలదని పై పద్యము తెలుపుచున్నదని విమర్శకుల యభిప్రాయమై యున్నది. ఈ పద్యమే పెద్దన్న కుతపకాలానంతరము మధ్యాహ్నవర్ణనము చేయుటవలన నేర్పడిన దోషమును పరిహరించుట సాయపడగలదు! చూడుడు.

భగీరథుఁడు తపముచేసినచోటు మానస సరోవర ప్రాంతమనియు, వియద్గంగభూమికి దిగినచోటు హరిద్వారమనియు, గిరికన్యపతిగొల్వ నాయాసపడినచోటు, మదనుఁడు ఫాలనేత్రాగ్నిలో భస్మమైనచోటు కైలాస శిఖరమనియు, దేవసేనాని జన్మించినచోటు యించుమించు ఆ కైలాసశిఖరమే యనియు నిర్ణయింపవచ్చును. అటే మనుచరిత్రలో చెప్పిన అలకానది యిప్పటి అలకనందా యనవచ్చును. హిమగిరిలోని ఈ స్థలము లేరేఖాంశములమీఁద నున్నవో చూడుడు. అలకనందానది 79° తూర్పు రేఖాంశముమీఁదను, మానస సరోవరము 81° తూర్పు రేఖాంశము మీఁదను, కైలాసపర్వతము 81° తూర్పు రేఖాంశము మీఁదను, బదరీనాథ్ 79° తూర్పు రేఖాంశము మీఁదను గలవు. దృష్టిదోషమువలన నీరేఖాంశముల నిర్ణయము లించుక దోషపూరితమున్నై యున్నను మన ప్రసంగమునకు విశేష బాధాకరమైనది కాదని మనవి.

ఇంకఁ బ్రవరుని స్వగ్రామమైన యరుణాస్పద పురము 'వరుణా ద్వీపవతీ తటాంచలము'న గలదు. ఈ వరణానది కాశీపట్టణమునకు మిక్కిలి సమీపమున బ్రవహించుచు సారానాథ్‌కుఁ బోవు త్రోవలో గలదు. కాశీపట్టణము 83° తూర్పు రేఖాంశముమీఁద గలదు.

అనగా నరుణాస్పద పురముకూడ నించుమించు 83° తూర్పు రేఖాంశమువీఁద గలదని యూహింపవచ్చును.

ఇట్లు ప్రసక్తమైన ప్రసంగమునకు సంబంధించిన ప్రదేశములు, ప్రాంతములు, పట్టణముల రేఖాంశములను నిర్ణయించుకొన్న పిదప యరుణాస్పద పురమునకు, హిమాలయపర్వతమునందలి ప్రవరుఁడు చూచిన స్థలములకు గల రేఖాంశముల వ్యత్యాసములను తెలిసికొందము. పై చెప్పిన రేఖాంశములలో అత్యధికమైనదానిని, అత్యల్పమైనదానిని తీసికొని వ్యత్యాసమును గమనించెదముగాక.

83° తూ॥ — 79° తూ॥ = 4°. ఒక రేఖాంశమునుండి మఱియొక రేఖాంశమునకు గల కాలభేదము 4 నిమిషములు. 4° లకు 4×4=16 నిమిషముల అంతరమున్నట్లు స్పష్టమగును. అరుణాస్పద పురమునకు ప్రవరుఁడు చూచిన హిమగిరిలోని ప్రదేశములు పశ్చిమమున నున్నవి. అనగా అరుణాస్పద పురమున ఉదయం 10 గంటల కాలమైనప్పుడు, బదరీలో ఉదయం 9—44 గంటలై యుండును. రేఖాంశములు, తన్మూల కాలభేదములను గమనించిన తరువాత కుతపకాల మధ్యాహ్నకాల విషయిక చర్చలో శ్రీ బ్రహ్మయ్యశాస్త్రిగారి వచనము లెంతవఱకు సమంజసములో తెలిసికొందము. సిద్ధుఁడు కుతప కాలమునందు ప్రవరుని యింటికి వచ్చెను. అతిథిపూజా సత్కారానంతరము పాదలేప మనుగ్రహింపబడుట, ప్రవరుఁడు హిమగిరికిఁ బోవుట తటస్థించినది. అక్కడ హిమగిరిలో ప్రవరుఁడు 'మధ్యాహ్నమున్ దెల్పెడిన్' యని యనుకొన్నాడు.

మధ్యాహ్న మనఁగా నేమి ?

అన్హాత్ మధ్యః మధ్యాహ్నః ప్రాతః సంగవ మధ్యాహ్నపరాహ్నా సాయాహ్నేతి పంచతా విభజ్యతి' (ధర్మసింధు) అనఁగా ఒక దినమందలియహః ప్రమాణమును అయిదుభాగములుగా విభజించినచో మొదటి దానికి ప్రాతఃకాలమనియు, రెండవభాగమునకు సంగమకాలమనియు, మూఁడవది మధ్యాహ్నకాలమనియు, నాలుగవది యపరాహ్ణమనియు, అయిదవది సాయాహ్నమనియు ధర్మసింధువునందు తెలుపఁబడియున్నది. అహః ప్రమాణములోని మధ్యభాగమునకు మధ్యాహ్నమని పేరు.

ఉదాహరణకు సోమవారము పంచమి 29 ఘడియలు, 30 విఘడియలు అని పంచాంగమునందు కలదని యనుకొందము. అనగా సోమవారమునాఁడు సూర్యోదయమునుండి పంచమీతిథి 29—30 ఘడియల పర్యంతము కలదని యర్థమగును కదా. ఈ పగలు ప్రమాణమును అయిదుభాగములుగా విభజించినచో నొక్కొక్క భాగమునకు 5 ఘడియలు, 54 విఘడియల కాలమగును. ఈ కొలతలో మూఁడవ భాగమైన మధ్యాహ్నము ఆపగటియందు 11 ఘడియలు 48 విఘడియలనుండి ప్రారంభమై 17 ఘడియలు, 42 విఘడియలవరకు వ్యాపించి యుండును. అటే

'అహ్నో ముహూర్తా
విఖ్యాతాదశ పంచక సర్వదా
తత్రాష్టమో ముహూర్తోయః
సకాలః కుతపః స్మృతః. (ప్రభాసఖండము)

అనఁగా అహః ప్రమాణమును 15 విభాగములు చేయగా అందులోని 8 వ భాగమునకు కుతపమని పేరు. పగటిలోని 15 భాగములకు వరుసగా నీ నామములు గలవు. రౌద్రము, శ్వేతము, మైత్రము, శారభటము, సావిత్రము, విజయము, గాంధర్వము, కుతపము, రౌహిణేయము, విరించము, సోమము, నిర్‌ృతి, మహేంద్రము, వరుణము, భటము.

మధ్యాహ్న కుతపకాల నిర్వచనానుసారముగ వాటి యర్థములను దెలిసికొంటిమి. ఉదాహరణకు దీసికొన్న పంచమీ సోమవారమునందలి 29—30 ఘడియల కాలమును గంటలలోనికి మార్చి చూచెదముగాక. అప్పుడు మధ్యాహ్నకాలము 11—48 ఘడియలనుండి ప్రారంభమై 17—42 ఘడియలకు ముగియును. గంటలలో నీ కాలము ఉ॥ 10—42 నుండి 1—07

వఱకు వ్యాపించి యుండును. కుతపకాలము 13–46 ఘడియలకు ప్రారంభమై 15–44 ఘడియలకు అంతమగును. ఈ కాలము గంటలలో చెప్పినప్పుడు ఉ. 11—30 గం.నుండి 12—17 గం.వఱకు గల కాలమగును. ఇట్లు గంటలలో కాలమును సాధించుటకు గాను ఆనాఁడు సూర్యోదయము ఉ. 6 గం.ల సమయ మని యూహింపబడినది.

సిద్ధుఁడు ప్రవరుని యింటికి కుతపకాలము నందు వచ్చినట్లు చెప్పఁబడినది. అనగా 11—30 గం. నుండి 12–17 గం.వఱకు గలకాలమం దెప్పుడైనను వచ్చియుండును. మన ప్రసంగము నిమిత్తము సిద్ధుఁడు కుతపకాలము చివరిలో వచ్చినాడని యనుకొందము. అనగా 12—17 గం. లప్పుడు సిద్ధుఁడు వచ్చినాఁడు. మధ్యాహ్నకాలము ఆనాడు 10–43 నుండి 1—07 వఱకు కలదు కదా! అప్పుడు 12–17 నుండి 1—07 గంటలవఱకు మధ్యాహ్నమున్నది కదా !

సిద్ధునికి అర్ఘ్యపాద్యాది పూజలు, సంభాషణములు ముగిసినతరువాత ప్రవరుఁడు హిమగిరికేగినాఁడు. దీనికంతయు అర్ధగంటకాలము పట్టినదనుకొన్నచో పాదలేప ప్రభావమునఁ బ్రవరుఁడు మరు నిముసముననే హిమగిరిలో నున్నాడని తలంపవలెను. శ్రీ బ్రహ్మయ్య శాస్త్రిగారు తమ వ్యాసములో 'అప్పుడు సిద్ధ ప్రవరులు కావించిన ప్రసంగము పదినిముసములకాలమో యట్లు గాకున్న నరగంటయో, గంటయో జరుగవలసినదిగా నున్నది. కాని యంతకన్నమించి జరుగవలసినదిగా లేదు' అని వ్రాసియుండుటచే వారు చెప్పిన పదినిముసములుగాని, యెక్క గంటగాని తీసికొనక అరగంటను తీసికొనఁబడినది. సిద్ధుఁడు 'దివి బిసరుహ బాంధవ సైంధవ సంఘంబెంత దవ్వు దగ లేకరుగున్, భువినంత దవ్వు నేమును తవతవలే డరుగుదుము హుటాహుటి నడలన్' అని చెప్పియున్నాఁడు. ప్రవరుఁడు హిమాలయమును జేరినప్పుడు 12–47 గంటలై యుండును. అప్పటినుండి అక్కడ చూడవలసినవి చూచినతరువాతకూడ మధ్యాహ్నముండి యుండును. కనుకనే ప్రవరుఁడు 'మధ్యాహ్నమున్ దెల్పెడిన్' అని చెప్పియున్నాఁడు. ఈ సహేతుకవాదము నంగీకరించినచో శ్రీ బ్రహ్మయ్యశాస్త్రిగారు చూపించిన దోషము లేక పోయి పెద్దన్న సరిగా వ్రాసియున్నాడని చెప్పవలసి యుండును.

ఇంక రేఖాంశములనుబట్టి చూచినచో 83ం తూ, రేఖాంశమునగల యరుణాస్పద పురమునందు కుతపకాలము చివరి సమయమనగా 12–17 గంటలు అప్పుడు 79ం తూ. న గల హిమాలయమునందలి ప్రదేశమునందు 12—01 గంటలై యుండును. కనుకనే ప్రవరుఁడు' మధ్యాహ్నమున్ దెల్పెడిన్' యని చెప్పవలసి వచ్చినది.

కుతపకాల మధ్యాహ్న కాలములను నిర్ణయించి గంటలలో మార్చికొని చూచినప్పుడుగాని, రేఖాంశము లనుబట్టి కాలమును నిర్ణయించినప్పుడుగాని ప్రవరుఁడు హిమగిరిలో నుండిన కాలము మధ్యాహ్న కాలమని నిశ్చయముగా జెప్పవచ్చును. దానినే పెద్దన్న చెప్పియున్నాడు.

మఱికొన్ని యుదాహరణములను చూచెదముగాక. ఒక తిథి యొక సూర్యోదయ కాలమునుండి 46—20 ఘడియ లున్నదని యూహింపుడు. ఆ తిథినాడు కుతపకాలము 21 56 ఘడియల మొదలు 25 04 ఘడియల పర్యంతముండగా మధ్యాహ్నము 18—48 ఘడియల మొదలు 28—12 ఘడియలవఱకుండును. అనగా కుతప కాలానంతరము 3—08 విఘడియలు మధ్యాహ్న మున్నది. 55–14 ఘడియలు గల తిథియందు కుతపకాలము 26–06 మొదలు 30 04 ఘడియల వఱకు వ్యాపించి యుండును. ఆ దినమందలి మధ్యాహ్నము 22–06 ఘడియలనుండి 33—09 వఱకు వ్యాప్తము. అనగా కుతప కాలానంతరము మధ్యాహ్న 3 ఘడియలు 05 విఘడియ లుండును. 22—15 ఘడియలు గల తిథి యందలి కుతపకాలము 9—03 నుండి 10—12

ఘడియలు. మధ్యాహ్నము 8—54 నుండి 13–21 ఘడియల వఱకు నుండును. ఈ యుదాహరణలో కుతప కాలానంతరము మధ్యాహ్న 2—49 ఘడియ లుండును. ఈ యుదాహరణములవలన మనకుఁ దెలి యున దేమనఁగా దినమందలి యొక తిథి వ్యాప్తి అధికముగా నున్నను, అల్పముగా నున్నను కుతప కాలా నంతరము మధ్యాహ్నకాలమునుండియే తీరునని చెప్ప వలసియున్నది. కాని ఏదైన యొక్క ఉదాహరణలో కుతప కాలానంతరము మధ్యాహ్నకాలము లేక యుండి నచో నట్టి దినమునందు ప్రవరుఁడు హిమాలయము నకుఁ బోవలేదని యనుకొనవలెను. ఎందుకనఁగా ప్రవ రుఁడు మధ్యాహ్న మున్నట్లు చెప్పియున్నాడు.

ఇంతవఱకు తిథులను గుఱించి కుతపకాల మధ్యాహ్న కాలములను జర్చించి, కుతపకాలానంత రము మధ్యాహ్నకాల ముండునని వివరించితిమి. ఇప్పుడు 24 గంటలలోని యొక దినమందుగల మధ్యాహ్న కుతప కాలములను చూచెదము గాక. 24 గంటలలో 12 గంటలు రాత్రికాలమును విడిచి పగటిని మాత్రము గైకొనవలెనుగదా. అప్పుడు ఆ దినమందలి అహః ప్రమాణము 12 గంటలు. సూర్యోదయ కాలము ఉదయం 6 గంటలని యనుకొన్నచో ఈ 12 గంటల లోన కుతపకాలము 11—36 గం॥నుండి 12–24 గం॥ వఱకు వ్యాపించియుండగా మధ్యాహ్నకాలము 11—08 గం॥ నుండి 1—42 గం॥ పర్యంత ముండును. కుతప కాలానంతరము మధ్యాహ్న మున్నట్లు తెలియును గదా!

13 గంటల దినమునందు సూర్యోదయము 5—30 గం॥కు అని యనుకొన్నచో, నాటి సూర్యాస్త మయము 6—30 గం॥ అగును. ఆనాఁడు మధ్యాహ్న కాలము 10—42 గం॥ మొదలు—1—18 గంటల వఱకు ఉండును. కుతపకాలము 11—34 గం॥ల 12—26 గం॥ వఱకు వ్యాపించియుండును. ఈ యుదాహరణలో కూడ కుతప కాలానంతరము మధ్యాహ్న కాలమున్నది.

11 గంటల అహఃప్రమాణమున్ గల దినము లోని సూర్యోదయము 6—15 గంట లనుకొన్నచో సూర్యాస్తమయకాలము 5—15 గంటలు. ఆనాటి మధ్యాహ్నకాలము 11—45 గం॥ నుండి 1–55 గం॥ల వఱకు ఉండగా కుతపకాలము 10–23 గం॥ నుండి 11—07 గం॥ వఱకు వ్యాపించియుండును. ఈ యుదాహరణయందు కూడ కుతప కాలానంతరము మధ్యాహ్నకాల మున్నది.

'నలినీబాంధవ భానుతప్త రవికాంత స్యందినీహార కందళ ఛూత్కార పరంపరల' ప్రశంస కలదు. కాబట్టి ప్రవరుఁడు హిమగిరి కేగినది శీతకాలమునందు గాక గ్రీష్మ కాలమునందు పోయినట్లు భావింపవలసి యున్నది. అనగా దినము 12 గంటలు లేక 13 గంటల వఱకు వ్యాప్తమైనదిగా నుండును.

కనుక శ్రీ బ్రహ్మయ్యశాస్త్రిగారి వాదము స హే తుకము కాదనిపించుచున్నది. వారి వాదము సరికాదను టకుగాను ధర్మసింధు, ప్రభాసఖండము మొదలగు గ్రంథముల నాధారముగ దీసికొనబడినవి. కాని శ్రీ బ్రహ్మయ్యశాస్త్రిగా రే గ్రంథములను ప్రమాణీ కరించుకొని కుతప కాలానంతరము మధ్యాహ్నకాల ముండదని చెప్పినారో తెలియుటలేదు. వారి వాదమును ఖండింపఁ గడంగినవారుకూడ సరియైన జవాబు లిచ్చు టకు పూనుకొన్నట్లు కనపడదు.


ఇప్పుడు లభ్యమగు మనుచరిత్ర ప్రతులలో కుతపకాల ప్రశంసను గుఱించిన విమర్శ లేదు. కొన్ని నెలల క్రిందట శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి గారి వ్యాఖ్యాన సహితమైన మనుచరిత్ర ప్రచురింప బడినట్లు పత్రికాముఖమున దెలిసినది. వారేమైన నీ కుతపకాల ప్రశంసను చర్చించియున్నారో లేదో తెలియదు.

పెగా పెద్దన రాయల యాస్థానమందలి యష్టదిగ్గజములలో శ్రేష్ఠతముఁడు. అతఁడు కవి గండపెండేరమును సంపాదించుకొన్నవాఁడు. ఆంధ్ర

కవితా పితామహుఁడు. కవి పండితులు సహజముగా నితరుల యున్నతిని సహించువారు కారు. రాయల కొలువులో నీ గ్రంథమును చదివి వినిపించినప్పుడు పెద్దనలోని మధ్యాహ్నకాల వర్ణన దోషమును అచ్చటి కవి పండితులు ఎత్తిచూపింప కుందురా? ఆనాఁటి పండితులు పెద్దనయందు దోషము లేదని నిర్ణయించి యుండిరి కాబట్టి ఆ ప్రశంసకు తావు లేకపోయినది. కాని మన శ్రీ బ్రహ్మయ్యశాస్త్రిగారికి దోషముగాఁ దోఁచుట వింతగా నున్నది.

పెద్దనయందు లేని దోషము నారోపించి, తమ వాదమును విమర్శించిన ప్రతి విమర్శకులను ఖండించుటకు గావించిన ప్రయత్నమై యున్నట్లు తోచు మన్నది. ఇంతకు పెద్దన్న దోష మొనర్పలేదనియు, జ్యోతిశ్శాస్త్రమం దాతనికి గల పాండిత్యమును ప్రదర్శించియున్నాడని యా మహాకవికి తెలుఁగు నేల యంజలి ఘటించుట యుక్తము.

ఈ నా వాదము విమర్శకు గుఱియై ఖండింపఁబడినచో నాకుఁ గలుగు బాధ యేదియు లేదనియు, శ్రీ శాస్త్రిగారి వాదము సహేతుకము కాదని తేలినచో వారి కీర్తికి లోప మేమాత్రము కలుగబోదని విద్వన్మహాజనులకు విన్నవించుకొనుచున్నాను.



కొందరి తెలుగు రచయిత్రులు : యద్దనపూడి సులోచనారాణి

వాస్తవ జీవితం : పగటి కలలు

శ్రీ ఎ. వి. ప్రసాద్

[తెలుగు నవలలు రాసేవారిలో ఆడ వారికే ఎక్కువ పేరు రావటం గమనించతగిన విషయం. కొంతకాలంకింద పాశ్చాత్య దేశాలలో కూడా ఇటువంటి ధోరణి కనిపించేదని కొందరంటారు. సినిమా ప్రభావానికీ, రచయిత్రుల నవలలకి ఇంత ప్రజాదరణ లభించటానికీ ఏదో సంబంధం ఉందని కొందరి అభిప్రాయం. శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి తరువాత మరి కొందరు రచయిత్రులని గురించికూడా వ్యాసాలు ప్రచురించబోతున్నాము. వ్యాసాలలో వెలువడే అభిప్రాయాలు వాటి రచయితలవని పాఠకులకి గుర్తు చేస్తున్నాము. సం.]

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి ప్రొఫెషనల్ రైటర్. తెలుగులోగాని, ఇతర భారతీయ భాషలలో గాని ఈ కోవకు చెందినవారు, చిన్న వయసులో ఇంత పేరు తెచ్చుకున్నవారు తక్కువ. ఆమె రచనలకు వున్న పాపులారిటీ ప్రస్తుతం మరే తెలుగు రచయితకు లేదని చెప్పవచ్చు. ఏ కారణం వలనైనా గాని ఆమె రచనలు మెచ్చుకొనని వారుగూడా ఆమె 'వ్రాయగలరు' అని అంగీకరిస్తున్నారు. శ్రీమతి సులోచనారాణి తమ రచనల ద్వారా ఏ రాజకీయ, సాంఘిక భావాలు ప్రచారం చేయకపోవడం ఒక తరగతి పాఠకుల, చిన్న చూపుకు కారణమైనా, అదే కారణం ఆమె రచనలు బహుళ సంఖ్యాకుల ఆదరం పొందటానికి తోడ్పడింది.

శ్రీమతి సులోచనారాణి రచనలోని అంతరార్థాలను గురించి పాఠకులు తలలు పగులగొట్టుకొనవలసిన పని వుండదు. ఆమె కథలు, నవలలు హాయిగా చదువుకోవచ్చు. కావల్సినవారు వాటి ఆధారంగా కమ్మగా కలలు కనవచ్చు. సుఖంగా మర్చిపోవచ్చు గూడా. ఆమె వాడే భాష అంతమంచి తెలుగు అని చెప్పటానికి లేదు గాని, ఆమె ఇంగ్లీషు పదాలు తక్కువగానే వాడుతుంది. రచన చాలా ఫ్రీగా, సరళంగా నడుస్తుంది. చాలాకొద్ది వర్ణనలతో, వివరణలతోనే పాఠకుల కళ్ళముందు ఒక చిత్రం రూపుకట్టేట్టు చేయటం ఆమె ప్రత్యేకత. కథ మధ్యలో తనుగా జోక్యం చేసికొని నడిపించవలసిన అవసరం వుండదు. వీలు చిక్కిన చోట స్వంత అభిప్రాయాలు పాఠకులకు అంటించాలనే ఉద్దేశ్యం లేకపోవడం కథ చురుగ్గా నడవటానికి ఒక ముఖ్య కారణం.

చాలా మంది రచయితలు లాగా శ్రీమతి సులోచనారాణి మధ్యతరగతి చెందిన వ్యక్తుల జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొనే రచనలు చేస్తున్నారు. ఇటీవల ఆమె నవలల్లో కొంత వైవిధ్యం కన్పిస్తున్నా స్త్రీ పురుషుల మధ్య వుండే ఆకర్షణే ఆమె రచనలకు ఎక్కువగా ఆధారంగా వుంటున్నది. ఆమె రచనలు వాస్తవికంగా వుండవచ్చు కాని అసహజంగా వుండవు. ఆమె రచనల పాపులారిటీకీ, అవి మంచి సినిమా కథలు కావడానికి ఇది ఒక ముఖ్య కారణం. కథల పత్రికలకు, సినిమాలకు మహారాజ పోషకులు స్త్రీలేనని, ఇప్పుడు అందరూ గుర్తిస్తున్నారు. వారికి

నచ్చే కథలు వ్రాయగలిగిన రచయితలకు ఈ రెండు రంగాలలోనూ మంచి డిమాండు వుంటున్నది. చాలామంది రచయితులు, కొందరు రచయితలు ఈ పక్కీలో కథలు వ్రాస్తున్నా శ్రీమతి సులోచనారాణి కథలకువున్న డిమాండు వారికి వారికి వుండటం లేదు. ఆమె కథల్లో కన్పించే పట్టు, వేగం, క్లైమాక్సు వారు సాధించలేక పోతున్నారు. పాఠకులు, ప్రేక్షకులు కోరుతున్న ఆకర్షణీయమైన పాత్రలు వారు సృష్టించలేకపోతున్నారు. సినిమా కథలకు అవసరమయే మెలుకువలు కొన్ని ఆమె ఇటీవల నేర్చుకొని వుండవచ్చు. కాని అంతకుపూర్వం కూడా ఆమె కథలు సినిమాగా నిర్మించటానికి అనుగుణంగానే వుండేది. ఆమెనుసహజ సినీ కథారచయిత్రి అంటే తప్పు లేదు.

ఆమె నవలల్లో, కథల్లో కథానాయకులు, కథానాయికలు ఒకేలాగా వుంటారని, ఒకేవిధంగా ప్రవర్తిస్తారని పేర్లతోసహా రిపీట్ అవుతుంటాయని వచ్చిన ఆరోపణ సత్యదూరం కాదు. 'ఆహుతి' అన్న నవలలో తప్ప మిగిలిన నవలలలోని కథానాయకులు బలమైన వ్యక్తిత్వం కలవాళ్ళు, అందగాళ్ళు. కథానాయికను స్వతంత్ర ప్రవృత్తిగల మనిషిగా చిత్రించిన సందర్భాల్లోగూడా వారు చివరకు కథానాయకుల గుండెల మీద చాలా తేలికగానే వాలిపోతారు. స్త్రీల ప్రకృతే అలా వుంటుందనో, లేక కథానాయికలు చేయవలసిన పనే అది అనో రచయిత్రి ఉద్దేశ్యమేమో తెలియదు. 'జీవనతరంగాలు' అనే నవలలో కథానాయకుడు విజయ కథానాయిక రోజాపట్ల అత్యంతహీనంగా, ఆత్మాభిమానంవున్న ఏ వ్యక్తి సహించలేని విధంగా ప్రవర్తిస్తాడు. చివరలో రోజా, విజయ్‌ను సంతోషంగా ఆమోదిస్తుంది. 'విజేత' అనే నవలలోగూడా దాదాపు ఇదే విధంగా జరుగుతుంది. ఏది ఏమైనా, పాత్రల స్వభావాలు ఎలాంటివైనా, హీరో హీరోయిన్లు కలవాలి అని ప్రార్థించే పాఠకులు, ప్రేక్షకులు లక్షలాదిమంది వున్నంతకాలం ఒకరకం పాఠకులు, విమర్శకులు పళ్ళు గిట్టి కరుచుకొని వూరుకోవడం తప్ప చేసేదేమీ కన్పించటం లేదు. మామూలు గిరి దాటకపోయినా ఆమె ఇటీవలి నవలల్లో కొంతమార్పు కన్పిస్తుంది. 'ఈ తరం కథ' నవలలో కుటుంబాన్ని ఎదిరించి పెళ్లి చేసుకున్న కథానాయిక చివరవరకు తన వ్యక్తిత్వం నిలబెట్టుకొనటానికి ప్రయత్నిస్తుంది. 'ఆశల శిఖరాలు' అనే నవల కొంత కొత్తపంథాలో నడుస్తుంది. కథానాయకుడు ప్రేమించినవ్యక్తి కథానాయిక అనుకుంటే, ఈ నవలలో చివరలో వీరిద్దరి కలయిక జరగదు. రచయిత్రి కొంచెం వాస్తవికతకు దిగివచ్చి నిరుద్యోగం, ఆర్థిక బాధలు, సామాన్య మానవుడి ఆశ నిరాశలు వంటి వాటికి చోటివ్వటం జరిగింది. 'ఆహుతి' అనే నవలలో కథానాయకుడు బలహీనమైన వ్యక్తిత్వం కలవాడు. పేదరికం, వయసుకు శక్తికి మించిన బాధ్యతలు అతన్ని వెన్నెముక లేని మనిషిగా తయారు చేస్తాయి. తనను ప్రేమించిన ఇద్దరి స్త్రీలలో ఒక స్త్రీ మరణానికి గూడా అతను బాధ్యుడవుతాడు. ఈ నవలలో కథానాయకుడు శ్రీధర్, ఉమ తదితర పాత్రల స్వభావాల చిత్రణలో రచయిత్రి చాలా సమర్థత చూపారు.

నిజానికి శ్రీమతి సులోచనారాణి రచనాశక్తి ఆమె నవలలు కంటే, కథని కలలోనే ఎక్కువగా కన్పిస్తుంది. అపోహలు, అపార్థాల కథల సంగతి పక్కన పెడితే, ఆమె కొన్ని చాలా చక్కని కథలు వ్రాశారు. వాటిలో మంచి వైవిధ్యం, మనస్తత్వ చిత్రణ కన్పిస్తుంది. 'ప్రేమ' అనే కథలో లలితమ్మ అనే పాత్ర కొడుకు పెళ్ళిచేసుకొని తనకు దూరమవుతాడనే భయంతో అతన్ని బ్రహ్మచారిగానే వుంచాలని చూస్తుంది. తల్లిప్రేమ, స్వంత జీవితం ఏర్పరచుకొనాలనే కోరికల మధ్య కొడుకు సతమతమవుతాడు. తల్లిని కాదని పెళ్లిచేసుకొని కూడా అతను చివరకు ఓడిపోతాడు. 'వాడినపూలు' అనే కథలో సుశీల అనే యువతి డాక్టరు అవాలనే పట్టుదలతో ప్రేమించిన వాడిని కాదని, వయసుమళ్లిన వ్యక్తిని పెళ్లాడి, తన కోరిక సాధించి, చివరకు జీవితంలో అన్నివిధాలా ఆనందం కోల్పోయినట్లు భావిస్తుంది. చేయి తిరిగిన

రచయిత కథ అనేది ఏమీ లేకుండానే కథ ఎలా రాయగలడో తెల్పుతుంది. 'రాధపడిన బాధ'. 'తొలి మజిలీ' కథలో కన్నెపిల్ల శోభనం రాత్రి అనుభవం అందంగా వర్ణించటం జరిగింది. జీవితంలో ఒక సారి దెబ్బతిన్న యువతి భయం కథ 'నాకీ పెళ్లి వద్దు' !

శ్రీమతి సులోచనారాణి కథలు చదివినవారికి ఆమె అన్నీ అబ్బాయి—అమ్మాయి కథలు వ్రాస్తుందనే అభిప్రాయం తొలగిపోతుంది. ఒకే గిరిలో కథలు నడుస్తా యనే ఆరోపణకువస్తే, చాలామంది పేరుపొందిన రచయితలు చేస్తున్నపని అదేనని అనవచ్చు. ఆమెకు వున్న విధమైన పాపులారిటీ వారికి లేకపోవటం, వారిపై ఈ విమర్శ రాకపోవటానికి కారణం కావచ్చు. మధ్యతరగతికిచెందిన పాత్రలతోనే ఆమె రచన లన్నీ నడుస్తాయన్నమాట నిజమే. రచయితలు, పాఠకు లలో అధిక సంఖ్యాకులు మధ్యతరగతికి చెందినవారు కావటం వలన మన కథా, నవలా సాహిత్యం ఈ తరగతి పాఠకుల కోసమే సృష్టించబడుతున్నది. తాను మధ్య తరగతి చెందినవాడిని కాబట్టి, ఆ తర గతికి చెందిన వారిని గురించి తప్ప వ్రాయలేనని ఒక రచయిత స్పష్టంగా చెప్పారు గూడా. మధ్యతరగతికే చెంది, ఒక రాజకీయ ఉద్దేశ్యంతో ఇతర తరగతి ప్రజల జీవనం గురించి వ్రాయ ప్రయత్నిస్తున్న వారిలో చాలా మంది రచనలు ఎంత పేలవంగా వుంటున్నాయో గమనిస్తే ఇందులో సత్యం అర్థమవు తుంది. పేదవర్గాలకు చెంది, రచనలు చేయగల స్థాయిని చేరుకొని గూడా తమ తరగతి ప్రజలతో 'టచ్' కోల్పోని వారు వచ్చే దాకా ఈ లోపం సరయే అవకాశం ప్రస్తుత సమాజంలో చాలా తక్కువగా కన్పిస్తున్నది.

వ్రాయగలిగిన శక్తివుండి, పాపులారిటీ సంపా దించుకున్నవారు తమ శక్తిని సద్వినియోగం చేయ వచ్చుగదా, నల్లమందు కథలే వ్రాయాలా అనే విమర్శ ఒకటి వున్నది. వాస్తవ జీవితాన్ని పగటి కలలను వేరుగావుంచి వ్యవహరించేశక్తి లేనివారు, ఈ శక్తి వుండే వయసులో లేనివారు ఈ రకం రచనలవల్ల నష్టపడుతున్నమాట నిజం. దురదృష్టవశాత్తు సినిమాలవల్ల జనం చెడిపోవటం గురించి మాట్లాడటం జరుగుతున్నంతగా పుస్తకాల ప్రభావం గురించి చర్చించటం జరగటంలేదు. వ్యక్తి మనస్సులో ఒక రచనచోటు చేసుకున్నట్లు సినిమా ఎన్నటికి చోటు చేసుకోనలేదు. ఈ కారణంవలన సహజంగా రచయిత లకు ప్రత్యేక బాధ్యత వున్నదని గుర్తించవలసి వుంటుంది. ఇలా గుర్తించటం జరిగినప్పుడు శ్రీమతి యద్దనపూడి సులోచనారాణివంటి సమర్థులైన వారి నుంచి మంచి రచనలును మనం ఆశించవచ్చు.

దత్తయోగీంద్ర శతకము

శ్రీ ఆవంచ సత్యనారాయణ

తెలుగులోని శతకప్రక్రియ సంస్కృతమునుంచి వచ్చినదైనను యిందు విలక్షణము, విస్తృతమైన ప్రత్యేక శాఖగా విలసిల్లినది. మూడువేలకు పైగా గల తెలుగు శతకముల దు సంఖ్యాబాహుళ్యమే గాక విషయ బాహుళ్యమును గలదని చెప్పవచ్చును. ఐనను ముద్రితమై ప్రచారమునందు గల శతకములు శతాధికముకంటె లేవు.

ఈ మధ్య నావద్ద చేరిన తాళపత్ర ప్రతులను పరిశీలించుచుండగా బ[illegible]పల్లి కొండయ వ్రాసిన దత్తయోగీంద్రవర్య శత[illegible] అందు కన్పించినది. తాళపత్రములు అతిశిథిలములైనవి. పరిశీలించి ప్రతి వ్రాయుటకు వీలుగాక పోయినది. మరియొ[illegible] ప్రతికై యెదురుచూచుచుండగా నా బంధువులైన శ్రీ వారణాశి వేంకటకృష్ణమూర్తిగారు వ్రాసి యుంచిన ప్రతి నా వద్దకు పంపిరి. శతకమును పూర్తిగా పరిశీలింపగా చాలా ప్రత్యేకత గల శతకముగా కాన్పించినది.

శ్రీకరా కార భాసిత నిత్య పరిపూర్ణ
యనవంద్య యోగ విద్యా విహార
కారణ గురురూప ప్రకాశ యోగాధ్యక్ష
యక్షీణ యాగకులావతంస
నారదస్తుత పూర్ణ సారాంచిత వినోద
కరుణా కటాక్ష వీక్షణ విశాల
భూతిలేపన జగత్పూత చారుచరిత్ర
సకల లోకాధార సగుణరూప
పరమ పావన మహనీయ భవ్యగాత్ర
విశ్వసంవేద్య మౌనీంద్ర వినుతలోల
చిరశుభాకార మోక్ష లక్ష్మీవిహార
సాంద్రరుచిధుర్య దత్తయోగీంద్ర వర్య

అను పద్యముతో యీ శతకము ప్రారంభమగుచున్నది. ఈ శతకమంతయు అద్వైత వేదాంతపరమైనది. ప్రతి పద్యమునందును ఒక్కొక్క వేదాంత విషయము నిరూపింపబడినది. ఈ శతకమునందలి విశిష్టత ప్రతి పద్యమునకును శీర్షిక యుండుట. ఈ షణ్త్రయ నిరూపణము, అనిత్యభ్రాంతి నిరూపణము, అష్టపాశ నిరూపణం, షడూర్మి నిరూపణం, మిథ్యాజ్ఞాన నిరూపణం, అంతర్మదాష్ట నిరూపణం,—వేషభాషా నిరూపణ, విరాట్రూప ప్రకారం, షట్చక్ర విచారము, ముక్తిద్వారకవాట నిరూపణం, అమనస్కయోగ నిరూపణం, నాదబిందుకళా నిరూపణం, నవచక్ర నిరూపణం, జ్ఞానయజ్ఞం మొదలగునవి యిందలి పద్యములకు గల శీర్షికలలో కొన్ని.

ప్రథమముననే బంధనక్రమ నిరూపణము వివరింపబడినది. జీవుడు—ఆతని బంధించు సాంసారిక విషయములు చక్కగా చెప్పబడినవి.[1] చూడుడు

పరికింప భార్యలు బారి సంకెళ్లను
చర్చింప శిశువులు చిల్లకట్లు
రూపింప మిత్రులు రోజుకాండ్లై యొప్ప
అన్నదమ్ములు వట్టియనుపు కాండ్లు
తలపోయ భాంధవుల్ దగులు కావలికాండ్లు
దౌహిత్రు లర్థము ల్దోచువారు
తలకింప తలిదండ్రులు రుణ బాంధవుల్
పశువులు మత్కుణ మశక చయము
జరుగ నిటువంటి సంసారి ధరణి యెల్ల
కష్టమైనట్టి చెరసాల గాదె తలప ॥చిర॥

---

1. ఇందలి పద్యములను యథాతథముగా ఉదాహరించితిని.

విషయము వేదాంత పరమైనను యీ శతకము నందలి శైలి మిక్కిలి సరళము. ఇట్టి శతకపఠనము నందు క్లిష్టత గాన్పింపదు. శాస్త్రసంబంధమైన రచనము చేయునపుడు యిట్టి శైలి యెంతయో అవసరము. కవి యీ విషయమును గ్రహించినట్టి వాడుగా నున్నాడు. సమస్త మతములు ఒక్కటియే యని మానవుడు మతమునకు ప్రత్యేకత నీయక మతాతీతమైనది నిత్యమైనదియునైన బ్రహ్మవిద్య నాశ్రయింప వలయునని యితని యాశయము. అందువల ననే షణ్మత నిరూపణమను శీర్షిక క్రింద

...యిట్టి దుష్టమతంబు పట్టుబడక
బ్రహ్మ విద్యాంత రంగుఁడై ప్రబలవలయు—

అని తెలిపెను.

భ్రాంతుడైన మానవుడు ఇడాపింగళాదినాడీ స్థానముల నెరుగక నిష్ఫలముగా మోక్షప్రాప్తికొఱకు కాశీరామేశ్వరాదులైన పుణ్యక్షేత్రములందు తిరుగాడుట వలన ప్రయోజనములేదని, దేహమే సర్వతీర్థ సంవాసితమని దానిని గ్రహించి యోగవిద్య నేర్వవలయునని యీతని యాశయము. దీనినే

ఘనత భ్రూమధ్యంబు కాశికా స్థలంబయ్యె
యలహృదయంబు ప్రయాగయగును
శీర్షాగ్ర భాగంబు శ్రీశైలమైయొప్పు
లలి నేత్రములు కుశస్థలి జెలంగు
ఫాలంబు కేదారమై లీల జెలువారు
వడి యిడా పింగళుల్ వరుసతోఁడ
గంగ యము నలయ్యె గరమొప్ప తన్మధ్య
నాడి సరస్వతి నామమలరు
యిట్టి తీర్థంబులను గానకెలమి నరుడు
దిరుగుచుండును భ్రాంతుడై తెలివిలేక ॥చిర॥

పోతన భాగవతమునందు ప్రహ్లాదుడు చెప్పినవి శ్రవణము, దాసత్వము మొదలైన నవవిధ భక్తి భావములను వివరణాత్మకముగా

వినుసంత ముక్తుఁడయ్యెను పరీక్షితుడును
గీర్తింప సురవౌని వార్తకెక్కె
స్మరణచే పుణ్యుడై పరగె ప్రహ్లాదుండు
సేవించి భార్గవి చెలువమొందె
యర్చించి పృథుడు మహాహ్లాదము వహించె
వందారుడక్రూరు డొందెదయను
దాసులై ఘనులైరి తార్క్ష్యమారుత సుతుల్
సఖ్యంబుచే ధనంజయుడు వెలసె
సర్వమును యిచ్చి బలియు నుత్సాహియయ్యె
గాన నవవిధ భక్తులు గలుగవలయు ॥చిర॥

అని పోతన పద్యమునకు వ్యాఖ్యాన పూర్వకముగా వివరించెను. అనేక పద్యములు ప్రశస్త రచనగలవి వ్యాస విస్తర భీతిచే చూపబడలేదు.

ప్రతి—వివరములు

తాళపత్ర ప్రతి చాలా శిథిలమైనది. అందువలననే కాగితపు ప్రతియందును 53 నుంచి 60 వఱకుగల పద్యములలో చాలా గ్రంథపాతము గలదు. మొత్తమీ శతకమునందు సరిగా నూరు పద్యములు గలవు. తాళపత్ర ప్రతియందు యిదిగాక అమనస్క యోగ సంహిత—నూగూరు రామకవి—అను ద్విపద వేదాంత గ్రంథము, తరిగొండ వెంగమాంబ రాజ యోగసారము కొన్ని మంగళహారతి పాటలు మొదలగునవి గలవు.

కవి—జీవితము

శతకాంతమునగల నూరవ పద్యమువలన కవిని గురించిన వివరములు తెలయుచున్నవి. ఆ పద్యమిది.

పరతత్వ వాచ్యార్థ భావంబులన్నియు
వేర్వేర వాక్కొక్క విధముగాగ
సీస పద్యంబులు చెలువంద శతకంబు
చెప్పితి గురుకృపశ్రేష్టు లలర
పరుని దత్తాత్రేయ గురుని కంకితముగా
నా నేర్చు విధమున నవ్యముగను

---

2. ఆంధ్రమహా భాగవతము—సప్తమస్కంధము

3యార్వేల కులాబ్ధి విభుడను బండ్లప
ల్యన్వయుఁడను నాగయ ప్రధాన
సుతుఁడ శ్రీవత్స గోత్రుడ సుకవికొండ
ధన్యుడను వెలయు నాచంద్ర తారకముగ ||చిర||

ఈ కవి4 శతకకవుల చరిత్రమునం దుదాహరింపబడినాడు. ఈ కవి రచించినదే వివేకసింధువను యైదాశ్వాసముల పద్య కావ్యము గలదు. ఇదియు దత్తాత్రేయుని కంకితము. వివేక సింధువును సంస్కృత గ్రంథమును ముకుందయోగియను నాతడు తెలుగుఁన వచన కావ్యముగా రచింపగా యీతడు పద్య కావ్యముగా వ్రాసెనట.

6శ్రీ చాగంటి శేషయ్యగారు యీతడు పదునారవ శతాబ్ది ఉత్తరార్థమునందున్న కవి యని వ్రాసిరి. 7శ్రీ ఆరుద్ర 'ఇందులో వేదాంత విషయాలూ, నీతి విషయాలూ ఉన్నాయి' అని చెప్పారు గానీ నాకు నీతు లిందున్నట్లు తోచుటలేదు. ఆరుద్ర 'ముకుందయోగి మహారాష్ట్ర భాషలో వివేకసింధువును రచిస్తే దానిని కాశీ చెన్నబసవేశ్వరుడనే కవి తెలుగులో వచన గ్రంథంగా వ్రాశాడు. బహుశా మహారాష్ట్ర భాషనుంచే కొండన్న పద్య కావ్యాన్ని అనువదించి ఉంటాడు' అని ఊహించారు. ఈ ఊహకు గల ఆధారమును వారు వ్రాయలేదు. 8శ్రీ బులుసు వేంకటరమణయ్యగారును 'ఈతని కాలమును గూర్చి యితమిత్థమని చెప్పుటకు వలనుపడకున్నది. కాశీ చెన్నబసవేశ్వరుడను కవి తెలుగులో వివేకసింధువును వ్రాసెను. దాని ననుసరించి వేగినాటి కొండయ పద్య గ్రంథముగా రచించె'నని తెల్పిరి. కానీ యీ ఊహల కన్నింటెని ఆధారములు తెలియజేయరైరి. కవి మాత్రము ముకుందయోగి తెలుగున వ్రాసిన వచన వివేక సింధువునే తాను పద్యకృతిగా వ్రాసితినని అందే చెప్పుచున్నాడు. కవిని గుఱించిన మిగిలిన వివరముల కాయా గ్రంథముల పరిశీలింపవచ్చును.

9దత్తాత్రేయ వేదాంత వాఙ్మయశాఖయందు పూచిన యీ సుకృతి సూర్యాలోకన భాగ్యమునందు దినమున కెదురుచూచుచు, 10యీ ప్రశస్త శతక ప్రతి వ్రాసి నాకు ప్రసాదించిన శ్రీ కృష్ణ మూర్తిగారి కత్యంతము కృతజ్ఞుడనై యున్నాను.

---

3. ఇచట గణభంగము—ఇట 'వేగినాటి' అని కలదని గ్రంథాంతరము వలన తెలియుచున్నది. యార్వేల అనునది ప్రతివిలేఖనుని హస్త లాఘవము కావచ్చును.

4. శతక కవులచరిత్ర—వంగూరి సుబ్బారావుగారు అనుబంధ కర్త కళాప్రపూర్ణ నిడుదవోలు వెంకటరావుగారు. పుటలు—743—44.

5. '..............సదానంద సాంద్రుండగు ముకుంద మునీంద్రుండు నాంధ్రభాషను రచియించిన వచన కావ్యంబేను వివేక సింధువు నిరవద్య గద్య పద్యాత్మకంబుగా ప్రబంధంబు జేయసమకట్టి...' వివేక సింధువు పీఠిక.

6. ఆంధ్ర కవితరంగిణి సం—11—పుటలు 162.

7. సమగ్రాంధ్ర సాహిత్యం సం—9—పుటలు 260.

8. ఆంధ్ర కవి సప్తశతి—పుటలు 46, 69.

9. దత్తాత్రేయ వేదాంత వాఙ్మయమును చూడుడు: వ్యాసము Dattatraya cult in Telugu Essays in Philosophy—Presented to Dr. T. M. P. Mahadevan—Essay by Kalaprapurna N. Venkata Rao. pps. 464—475.

10. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమునందు యీ శతకమున నొక్క ప్రతి గలదు. R. No. 633. Vide Descriptive Catalogue of Telugu Manuscripts Vol IV. ఇం దుదాహరింపబడిన రెండు పద్యములకును నావద్ద గల ప్రతిలోని పద్యములకును పాఠములు చాలా భేదించుచున్నవి.

నన్నయ వేగోపమ

శ్రీ శలాక రఘునాథ శర్మ

కుండలమ్ములు వేగ కొనిరమ్ము నాలవ
నాటికి ననిపూని నన్నుఁ బనిచె
గురుపత్ని నేఁడ యక్కుండలంబులు దొడ్గ
దివస మీ దివస మతిక్రమింప
కుండంగఁబోక యెట్లొండఁగూడదు నిన్నఁగ
భవన మెప్పాట వెల్వడఁగఁబోలు
నేఁడు పోవనినాఁడు నిష్ఫలంబిమ్మహా
యత్నమంతయుఁ నని యధికచింతఁ
దవిలియున్న నయ్యుదంకు నభిప్రాయ
మెఱిఁగి దివ్యపురుషుఁ డిట్టులనియె
నీ హయంబు నెక్కి యేఁగుమ యిదివడి
గలదు మనసుకంటె గాడ్పుకంటె

(భార. ఆది. 1—114.)

అను నీ నన్నయగారి పద్యమును విన్న మనసులో నొక విచికిత్స బయలుదేఱును. మనసుకంటె వడి గల దని చెప్పిన పిదప గాడ్పుకంటె వడిగలదనుట చెప్ప వలయునా? మనోవేగము వాయువేగముకంటె నధిక తరముగదా! ఇట్లనుటలో ఛందో నిర్బంధమేమేని గలదా? లేక వస్తుతత్త్వమును స్ఫురింపఁజేయు లోక జ్ఞతయా? మొదటి దానికి బలములేదు. ఛందో నిర్బంధమేయైనచో, నట్టి క్లేశములేని వచనమున నిట్టి క్రమమునే పాటింపనేల? ఈ క్రమము వచన మున నొకటికి రెండుమార్లు ప్రయోగింపఁబడినది.

(1) 'ఇట్లు వచ్చిన వైనతేయు నతిప్రీతిం దద్దివ్య రథసారథ్యంబునందు నియోగించి మనోవాయు వేగంబునం గృష్ణ భీమ విజయు లింద్రప్రస్థ పురంబు ప్రవేశించిరి'. (సభా. 1. 218)

(2) 'తొల్లి వార్ష్ణేయుండు దెచ్చిన తన రథంబునందు నిజహయంబుల నాలక్ష్యమాణ శుభ లక్షణంబులు మనోవాయు వేగంబులు నైన వానిం బూన్చికొనివచ్చిన' (అర. 2. 167)

ఇట్టి వచనములందు ఛందో నిర్బంధమునో వ్యాకరణ నిర్బంధమునో సంభావింపఁజాలము గదా! మఱియు పై పద్యమున ఛందో నిర్బంధమంత అధిగ మింపరానిదియు! 'ఇదివడిఁ జనును గాడ్పుకంటె మనసుకంటె' అన్న సరిపడును గదా! యతిప్రాసయతి సాంకర్యము నన్నయ సీసములలో లేదన్నచో ఈ 'హయంబు నెక్కి యేగుమ యియ్యది గాడ్పుకంటె మనసుకంటె వేగి' అనవచ్చును.

శబ్ద శాసనుఁడును, తెలుఁగున పద్య విద్యకు నాద్యుఁడని సంభావింపఁ దగినవాఁడును నగు నన్నయ మహాకవీంద్రునకు ఛందో నిర్బంధము సంభావ్యమా? 'ప్రమాదో ధీమతామపి' అను న్యాయము ననుసరింత మన్న నట్టి ప్రమాదము మూఁడు తావుల సంభ వించునా? అదియు నేదో యొక ఘట్టమున నున్నచో సరే. అట్లు కాక ఆదిపర్వమున నొకటియు, సభా పర్వమున మఱియొకటియు, ఆరణ్యపర్వమున నింకొక టియు నిట్లు భ్రాంతి రచన మొత్తమువీఁద నిల ద్రొక్కికొని యుండునా? పర్యాలోచింపఁగా నిది యాదృచ్ఛిక ప్రయోగము కాదు. ఇందేదో గూఢార ముండవలయు ననిపించును.

మఱియు సుప్రసిద్ధమగు నాంజనేయ స్తుతి శ్లోకమైన

మనోజవం మారుతతుల్య వేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానర యూథ ముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి

అను దానియందును మనోజవము చెప్పఁబడిన పిమ్మ టనే మారుతవేగము చెప్పఁబడినది. ఈ సంవాదము కూడ నిందేదో రహస్యమున్నదనుట సమర్థించు చున్నది.

వాయువేగ మనోవేగములలో మనస్సువేగ మధిక తరమనుట సర్వజన సంవేద్యమైన విషయము. అందినునుంతయు సందియము లేదు. అట్టిచో వాయు వేగమును మనోవేగమునకు పిమ్మట చెప్పటలో నౌచిత్య మేమి?—పరిశీలింతము. ఈ విషయమున వస్తు తత్త్వజ్ఞు లిట్లు చెప్పిరి. మనస్సు అవ్యాహతగతియై క్షణములో నెంతదూరమయినను తిరిగి రాఁగలదు. కాని గాలికి మనస్సునకు లేని ఒక విలక్షణశక్తి గలదు. అది తాను గమించుచు తనతోపాటు ఎంతభారము నైనను వహించి ఎంత దూరమైనను పోఁగలదు. వాయువునకు మహాబలమను నామాంతరమున్నది గదా. అనగా మనస్సునకు గమనశక్తి మాత్రమే కలదు. వాయువునకు దానితోపాటు వహనశక్తియుఁ గలదు! మనస్సుకూడ కోరికలను బుట్టించి లక్ష్యోన్ముఖముగ మానవుని కొంపోవునే కదా అనుశంక యిటఁ బుట్ట వచ్చును. కాని మనస్సు మానవుని భౌతిక దేహముపై తన ప్రభావమును చూపునేకాని స్వయముగా మోసికొని పోవుట లేదు కదా! మఱియు మనః ప్రేరణచే గమించు జీవియొక్క వేగము మనోవేగమునకు సాటి రాదు. వాయువు అట్టిదికాదు. మోయుచునే వేగముగా పయనించు సామర్థ్యము దానికి గలదు. ఇట్లు పరిశీలింపఁగా మనోవాయువుల శక్తి సామర్థ్యములలో భేదము గలదనియు నెచట వహనము ముఖ్యమో యచట వాయువుదే పైచేయి యనియు కేవల గమన వేగమును మాత్రమే చెప్పవలసినచోట మనస్సునుగాని వాయువునుగాని దేనివి గ్రహించినను ఉచితమే యనియు సారాంశము తేలు చున్నది. ఈ యంతరమును లోకజ్ఞుఁడగు నన్నయ సూక్ష్మేక్షికతో గుర్తించి యనేక సందర్భములలో చాల మెలఁకువతో పాటించెను. ఈ స్ఫూర్తి యాయనకు విజ్ఞాన సంపద్విఖ్యాతుఁడగు వేదవ్యాసుని వాగ్విన్యాసము వలననే కలిగిన దనుట నీ క్రింది భారతశ్లోకముచే గుర్తింపనగును.

దదర్శం తం పితాచాపి
దివ్యరూపం విహంగమమ్
తేజో వీర్య బలోపేతం
మనోమారుత రంహసమ్.

(భండార్కరు ప్రతి) 1.26.6.

పై యభిప్రాయమును ప్రాతిపదికముగా నుంచు కొని నన్నయ వేగము నుపమింపఁ దలఁచిన యనేక సందర్భములను పరిశీలింపఁగా మనోవాయువేగము, మనోవేగము వాయువేగము అను ముప్విధములైన వాని ప్రయోగములో నొక విశిష్టమైన ప్రత్యేకతను ఆయన పాటించినట్లు మనము గుర్తింపఁగలము.

ఎచట వేగాతిశయముతోపాటు మన ఉద్వేగము మిళితమై యుండునో యట్టి పరిస్థితులలో మనో వాయువులు రెండును గ్రహింపఁబడును. మఱియునందు వహనము ప్రధానముగా నుండును. కేవల వేగాతిశయము నుట్టంకింపఁదలఁచిన సన్నివేశములలో మనోవేగము మాత్రము కైకొనఁబడును. హృదయోద్వేగాదికము లేక వేగాతిశయముతోపాటు వహనమును జెప్పఁదలఁచి నచో వాయూపమ స్వీకరింపఁబడినది. నన్నయ భారతమునం దనేక సందర్భములలో నీ కట్టుబాటు గోచరించును. ఈ క్రింది యుదాహరణములచే నీ విషయముయొక్క యాథార్థ్యమును గుర్తింపఁగలము.

1. 'ఈ హయంబు నెక్కి యేఁగుము యిదివడి గలదు మనసుకంటె గాడ్పుకంటె' (భార. ఆ. 1. 114) గురుపత్ని కుండలములు దొడుగు సమయ మాసన్న మైనది. నేను లోకాంతరమున నున్నాను. అవధి నతి క్రమింపకుండఁ బోవుట యెట్లు? ఈ నాగ భవనము వెలువడుట యెట్లు? పోనిచో ఈ మహా ప్రయత్న మంతయు నిష్ఫలము గదా! అని యధికచింతఁ దవిలి

యున్న యుదంకు నభిప్రాయ మెఱిఁగి దివ్యపురుషుఁ డన్నమాట యిది. ప్రకృతమున తురంగము తనంతఁ దాఁ బైలుని యాశ్రమమునకుఁ బోవుట సమాహితము గాదు. ఉదంకునిఁ గొనిపోవలయును. కావున మనోవేగ మొక్కటి యిట నౌచిత్యమును బోషింపదు. కావుననే నన్నయ ఇది మనసుకంటె వడిగఁ దని చెప్పియు గాడ్పు కంటె నని తద్వహన గమన సామర్థ్యమును దృఢీకరించెను. అప్పటికి ఉదంకుని చింత ఉపశమించినది. తత్క్షణము గురు గృహమునకు రాఁగలిగెను.

2. కృష్ణుఁడు జరాసంధుని భీమార్జున సహాయుఁడై మడియించి యాతని కడనున్న దివ్యరథమును రావించి దాని ప్రభావమును వారి కెఱిఁగించి వైనతేయుని స్మరించి తద్రథ సారథ్యమునకు నియోగించెను. అంత 'నతఁడు తేరుగడప మనోవాయు వేగంబునం గృష్ణభీమ విజయు లింద్రప్రస్థపురంబు ప్రవేశించిరి.' (సభా. 1. 218). ఈ సన్నివేశములో వైనతేయ సారథికమగు తేరు కృష్ణభీమ విజయులను వహించికొని పోవుచున్నది కావున వాయూపమ ఆవశ్యకమే. అంతియకాక పూర్వోదాహరణముందు ఉదంకుని హృదయోద్వేగోపశమనమునకుఁగా మనోవేగము గ్రహింపఁబడినట్లే చటను మనోవేగము గ్రహింపఁబడినది. 'సకలక్షత్ర భయంకరుఁడగు బార్హద్రథి'ని సమయించుటకు భీమార్జునులను ధర్మజుఁడు కృష్ణునిమీఁది నమ్మకముతో పంపెను. ఆ కృష్ణుఁడును ననేక పర్యాయములు జరాసంధుని కోడినవాఁడు. తన తమ్ములేమయిరో, తన ప్రాణమునకు ప్రాణము కృష్ణుఁడేమాయెనో అను హృదయోద్వేగముతో ధర్మజుఁడు పరితపించును. ఆతనికి జరాసంధవధ జరిగెనను ఆహ్లాదకరమైన వార్త నెంత శీఘ్రముగానందింతునని కృష్ణుని యెడదలోనున్న ఉత్కంఠాతిశయ మీ మనోవేగ గ్రహణముచే వ్యంజింపఁబడినది.

3. దమయంతీ పునస్స్వయంవరమునకు ఆహూతుఁడై విదర్భకు పోఁగోరిన ఋతుపర్ణునికి సారథ్య మంగీకరించిన నలుఁడు 'తొల్లి వార్ష్ణేయుండు తెచ్చిన తనరథంబునందు నిజహయంబులనా లక్ష్యమాణ శుభలక్షణంబులు మనోవాయు వేగంబులునైన వానిం బూన్చికొని వచ్చెను.' (అర 2.167) ఈ రథము నీ యశ్వము లిప్పుడు స్వయం వరార్థియై చనుచున్న భూపతిని ఒక్క దినమున శత యోజనముల దూరము మోసికొని పోవలయును. కావున నిట వాయువేగ సామ్యము సక్త్వమే.

ఈ ఘట్టమునందలి వేగోపమ మఱియు విచిత్రమైనది. నలుఁడు ఆందోళనా పూరిత మనస్కుఁడు. ఋతుపర్ణుఁడు ఉత్కంఠావ్యగ్రుఁడు. ఒకనికి దమయంతి యను మహానిధి చేజారిపోవునట్లున్నది. మఱియొకని కానిధిని హస్తగత మొనరించుకొనవలయునను ఆశయున్నది. కావుననిట్లు వారి హృదయములందలి విదర్భాగమనకాంక్షను సూచించుచు భట్టారకుఁడు ముందు 'మనోవాయు వేగంబులు' అయిన తురంగములను పూన్చుటను చెప్పెను. కాని యవి యంత దూరము తన్నుఁ గొనిపోవునా? యన్న సందేహము ఋతుపర్ణునకు రాఁగా 'ఈ హయంబులు పవన గతిం బఱచు' (ఆరణ్య. 2. 168) నని నలుఁడు దానిని పరిహరించెను. ఋతుపర్ణునకు విదర్భకు తాను పోవుట ముఖ్యము గదా! కావున పవనగతి మాత్రమే యిందు గ్రహింపఁబడి, మనోగతి పరిహరింపఁబడినది. ఋతుపర్ణుఁడు తన యశ్వముల సామర్థ్యమును శంకింపఁగా దానికిఁ దగిన ప్రత్యుత్తరమును బాహుకుఁ డిచ్చెను. కాని తనకు మాత్రము విదర్భలో మనసు వ్రాలినట్లు వాలవలయుననియే యున్నది. ఆతని మనస్సు ఎప్పుడో దమయంతిని చేరినది. ఈ సారథ్యము మున్నగు వ్యాపారమంతయు అప్రయత్నముగనే సాగుచున్నది. సాగినదని నలుఁడు దమయంతి సఖితో సూటిగా చెప్పనే చెప్పెను.

'వినవె శతయోజనంబులు
సనుదెంచె నయోధ్యనుండి సరినిందుల కా
తని రథ సారథినై యే
నును వచ్చితి నతనితో మనోవేగమునన్

(అర. 2. 188)

ఇచట కేవలము మనోవేగమే చెప్పఁబడినది. అశ్వములు కూడ వదలఁబడినవి. తాను మనోవేగముతో వచ్చితిననుటలో నాతని గుండెలో గూడు గట్టుకొన్న భావవ్యక్తి యంతయు వ్యాఖ్యానింపఁబడినది. ఇట్లే ఘట్టములో మొదట మనోవాయువేగము, వెనువెంట జవనగతి తుదికి మనోవేగము అను వాని క్రమ ప్రయోగము వా తిరుపురి చిత్తవృత్తియందలి సూక్ష్మభావ పరంపర నెట్లు వ్యంజింపఁజేయునో ఆ ప్రయోగ మెంత సముచితమో యనునది సహృదయైక వేద్యము.

ఇఁక కేవలము వాయూపమయే కల సందర్భములు కొన్ని కలవు. అచటి యౌచిత్య మెట్టిదో పరిశీలింతము. వేగము, సహనము అను రెండంశములు ప్రధానములై ఉత్కంఠాదికములకు ప్రాధాన్యము లేని సన్నివేశము లందిది ప్రయుక్తమైనట్లు కానవచ్చును. ఉదాహరణములఁ బరిశీలింతము.

ధర్మరాజుచే రాజసూయ యాగము నిర్విఘ్నముగా పూర్తిచేయించి ద్వారవతికి నెమ్మదితో నరుగుచున్న శ్రీకృష్ణుఁడు 'అనిల జవాశ్వయుక్తమయిన... దివ్యకాంచన రథమెక్కి' చనెను (సభా. 2. 84). ఇచట కృష్ణుఁడు ద్వారవతి కేగుటలో మనోవేగమును జోడింపవలసిన యవసరము కన్పట్టదు.

భీష్ముఁడు కాశీరాజ పుత్రికలను రాక్షస క్రమమున కైవస మొనర్చుకొని తమ్మున కిచ్చి వివాహము చేయుటకై పోవుచుండెను. తనపై నెత్తివచ్చిన రాజలోకము నంతటిని నిర్జించెను. సాల్వుఁడు మొనగాఁడై కన్యకలతోఁ గూడఁబోవుచున్న భీష్ముని మరలించుటను నన్నయ యిట్లు వర్ణించెను.

అనిలజవంబునం బఱచు
నమ్మదనాగ మెదిర్చి క్రమ్మఱిం
చిన పరికాఁడు వోలెఁ గురు
సింహు నెరూథము నిట్లు క్రమ్మఱిం
చునె యితఁడంచు నం దగిలి
చూపఱు సాల్వమహీశు విక్రమం
బొనరఁగ నగ్గడం బొగడు
చుండిరి విస్మయ సక్తచిత్తులై.
(ఆది. 4. 207.)

ఇచట భీష్ముని వేగమునకుఁ జెప్పిన 'అనిలోపమ' అతని గాంభీర్యమును, మనస్సులోని అనుద్వేగస్థితిని చక్కఁగా నభివ్యక్త మొనర్చుచున్నది. మనోవాయువుల వెంటనిఁ జెప్పిన సన్నివేశములందువలె నిందాంతోషనాదిక మేమియు లేకుండుటయు, తదనుగుణముగ అనిలజవమును మాత్రమే పేర్కొనుటయు గుర్తింపఁ దగినది. అక్షణవే నిచట కాశీరాజ పుత్రికలను భీష్ముండు 'వహించి' కొనిపోవుటయు సంభావ్యము.

ఇంద్రుఁ నాజ్ఞచే పౌలోమకాలకేయులపై దండెత్తుచున్న అర్జునుఁడును మాతలిని రథంబు వలయుమని పలుకఁగా 'సతఁడును సప్తమారుత రయంబున దివ్యరథంబు తత్పురాహిత పురి భూరి వప్రవయిం బఱపె'ను (అర. 4. 82) ఈ సందర్భమునను ఉద్వేగరహిత చిత్తవృత్తియగు నర్జునుని తీసుకొని పోవుటయే విషయము కావున మనోవేగ ప్రసక్తి లేక సప్తమారుతరయమే చెప్పఁబడినది.

గరుడుని సామర్థ్యమును వక్కాణించుచుఁ బృహస్పతి సురపతితో నన్న 'ఇభ కచ్ఛపముల రోహిణ శాఖతో నెత్తికొని దివిఁబఱచిన యనిలవేగి' (ఆది. 2. 83) అను వాక్యమునందలి అనిలవేగి అనునదియు గరుత్మంతుని వహన సామర్థ్యమును గమనవేగాతిశయమును, అట్టి స్థితిలోని యాతని అనుద్విగ్నతను చక్కఁగా వ్యక్తము చేయుచున్నది.

మోసికొనిపోవుట యను వ్యాపారము లేకుండుట, వేగాతిశయముమాత్రమే వివక్షితమగుట అను నంశములు గల సందర్భములలో మనోవేగము మాత్రమే ఉపమానముగా గ్రహింపఁబడుట యీ క్రింది యుదాహరణముల వలన నిరూపితమగును.

గరుత్మదుపాఖ్యానమున గరుడుఁడు అమృతమున్న తావునకుఁబోవు నప్పటి యాతని సంరంభ మిట్టిదిగా నన్నయ వర్ణించెను.

వితతోల్కాశని పుంజమొక్కొ
యనగా విస్ఫధి నక్షప్త ప

క్షితి వాతాహతిఁ దూలి తూల
శకలాకారంబులై వారి ద
ప్రతతుల్ సొల్పడి నల్గడం
జెదరఁగా బాఱెన్ మనోవేగుఁడై
పతగేంద్రుండ మృతాంతికంబు
నకుఁ దత్పాలుర్ భయంబందగన్.

(ఆది. 2.92.)

ఇచట గరుత్మంతుఁడు ఏ వస్తువునుగాని మోపికొని పోవుట లేదు. కావున నిట మనోవేగుఁ డను నది యౌచిత్యమును సాధించుచున్నది. అదే యుపాఖ్యానమున అమృతాహరణార్థమరుగుచు కశ్యప ప్రజాపతి యుపదేశము చొప్పున గజకచ్ఛప గ్రహణార్థము పోవు సందర్భమునను 'గరుడండును మనోవేగంబునం బఱచి' (ఆ. 2.68) అనియే యున్నది. అచటను వహనము లేదు. గమనవేగాతిశయమే వివక్షితము.


కాని అదే ఘట్టమున 78 వ పద్యమున మాత్రము గజ కచ్ఛపములను రోహిణశాఖను మోసికొనిపోవునప్పుడును 'గరుడండును మనోవేగంబునం బఱచి' అని వహనమునందును మనోవేగము మాత్రమే చెప్పఁబడినది. ఇది పై యభిప్రాయముతో సమన్వితమగుటలేదు. కాని

స్థావర జంగమ ప్రచితతంబగు
భూవలయంబు నెల్ల నా
లావునఁ బూని తాల్తు
న విలంఘ్యపయోధి జలంబు నెల్ల ర
త్నావళితోన చల్లుదు బృహన్నిజ
పక్ష సమీరణంబునన్
దేవగణేశ యీ క్షణము త్రిమ్మరి
వత్తుఁ ద్రివిష్టపంబులన్

(ఆది. 2. 113.)

అని చెప్పి యంత చేయగలఁడని నిరూపించిన వైనతేయునకు గజకచ్ఛపములయు రోహిణశాఖయు భారమొక భారముగా భాసింపలేదని చెప్పుటకుఁ గావలయు నన్నయ యిట మనోవేగమును మాత్రమే గ్రహించెను.

ఇట్లనేక సందర్భములందు నన్నయ ప్రయోగించిన వేగోపమలను వివేచించి చూడఁగా వస్తుతత్త్వజ్ఞశేఖరుఁడగు నాతఁడు వీనిని యాదృచ్ఛికముగా ప్రయోగింపలేదనియు తత్తత్సందర్భములలో మనస్స్థితి, వస్తుస్థితి, ఔచిత్యము మున్నగువానిని జాగ్రత్తగా గమనించి గమనింపుఁడని పాఠకులకు బోధించుచు ప్రయోగించెననియు వ్యక్తమగుచున్నది. నా చూపున కాని నంతమేరలో నన్నయ భారత భాగమున నిట్టి కట్టుబాటు సడలలేదు. ఇందలి యాథాతథ్యమునకు సహృదయ పరిశీలకుల వాడిచూపు ప్రమాణము.



కలగూరగంప

తెలుగుదేశంలో గీరన గింజలాట

మహాకవి ఆరుద్రగారు తమ సమగ్రాంధ్ర సాహిత్యం ఆరవ సంపుటంలో ఏర్చూరి సింగన్న వ్రాసిన ప్రబంధ రత్నావళిని వివరిస్తూ అడవిలో ఏనుగు కుంభ స్థలాలను సింహాలు చీల్చినప్పుడు రాలిన ముత్యాలను ఏరి శబర బాలికలు గీరన గింజలాట లాడిరని వ్రాశారు.

'గీరన గింజలాట ఎలా ఆడుతారోగాని ఒక నాడు తెలుగుదేశంలోని తెలుగు పిల్లలు దానిని ఆడే వారని—పింగళి సూరన్న (కళా పూర్ణోదయం 6—202), ధూర్జటి (కాళహస్తీశ్వరమహాత్మ్యం 3—33), శేషము వేంకటపతి (శశాంక విజయం 2—19), అయ్యలరాజు నారాయణుడు (హంస వింశతి 3—146) ఈ క్రీడను పేర్కొన్నారు. అయితే ఏర్చూరి సింగన్న వాళ్ళందరికన్నా ప్రాచీనుడు. యతి ప్రాస స్థానాలలో యీ మాట వాడాడు.'

ఉ. 'మీరిన సర భద్రనాగముల మీదికి దాటి
తదీయ కుంభముల్
జూరలు పట్టి కేసరికిశోర నఖావళి
నుండి రాలి సొం
పారిన మౌక్తికంబులు ప్రియంబున
నేరి కిరాత బాలికల్
గీరన గింజలాడుదురు గేలి దలిర్పగ
బక్కణంబులన్'

—ప్రబంధరత్నావళి 474.

'ఇది ఓ నమగుంటలాట కాదు. ఏమంటే పింగళి సూరన 'గీరన గింజలోనమ గుంటల్' అని విడివిడిగా ఆటలు పేర్కొన్నాడు. బహుశా ఇది యీ రోజుల్లో తెలుగు బాలికలు ఆడే చింతపిక్కలాట కావచ్చు' అని శ్రీ ఆరుద్రగారు వ్రాశారు.

ఆంధ్రుల సాంఘిక చరిత్రను వ్రాసిన సురవరం ప్రతాపరెడ్డిగారు కూడ గీరన గింజలాట తీరును వ్రాయలేదు. నేను వివరిస్తాను.

ఈ ఆట చింతగింజలతోగాని యించుమించా పరిణామం గల మరే గింజలతోనైనను ఆడుకోవచ్చును. ఆటలో ఎంతమందయినా పాల్గొనవచ్చు. ఒకడు పదిగింజల్ని తన వంటాగా వేసిన రెండవవాడు మరొకటి హెచ్చుగ అనగా పదునొకటిని, మూడవ వాడు పండ్రెండు గింజలను వేసుకోవాలి. అందరూ వేసిన గింజల్నికలిపి హెచ్చుగా వేసుకున్నవాడు తన దోసిలియందుంచుకొని నున్నగానున్న నేలమీాదికి జేనెడెత్తునుండి విదిలించాలి. నేలమీాదపడిన వాటిలో గింజకూ గింజకూ మధ్య చిటికెన వేలితో గీచి చూడాలి. అట్లు చిటికెనవేలు గీయుటకు సాధ్యం గాక చాలా దగ్గఱగానుండే జంటలను 'బూచీ' లంటారు. ఈ బూచీలను ప్రక్కకు తీసిపెట్టుకోవాలి. తర్వాత బొటనవ్రేలి గోటితో ఒక గింజను మీాటి మరొక గింజకు తగులునట్లు కొట్టాలి. ఆ రెండు గింజలూ కొట్టిన వాని సొంతమవుతాయి. ఆవిధంగా అతడెన్ని గింజలైనా గెల్చుకోవచ్చు. ఒక గింజను కొట్టినప్పుడు అది రెండుగింజలకు తగిలినా, ఏ గింజకూ తగలకపోయినా, ఆదిలో చిటికెనవ్రేలితో గింజలమధ్య గీచినప్పుడు గింజకేమాత్రం వ్రేలు సోకినా ఆటగాడు తన ఆట వదలుకోవాలి. మరిప్పుడాడే దెవరు? హెచ్చు పాటాదారునికన్నా ఒకటి తక్కువగా వేసినవాడు ఆడాలి. క్రితం తీసి ఉంచుకొన్న 'బూచీ' లను మొదటివాడు గెల్చుకోగా మిగిలిన గింజలతో కలిపి ఆడుకోవాలి. ఈ విధంగా వరుసగా అందరూ ఆడుకోవచ్చును. లేదా ప్రతిభాశాలి ఐన ఆటగాడు అన్నింటినీ గెల్చుకొని తక్కినవారిని దుఃఖసాగరంలో ముంచనూ వచ్చు.

ఈ ఆటకే 'బూచీ'లాటలనీ, గీరన గింజలాటలనీ పేర్లున్నాయి. నిజంగా యీ ఆట ఆడడానికి చాలా బాగుంటుంది.

—శ్రీ బొగలూరి బాలకృష్ణ.

వేమన—ఊహాపోహాలు

యువ భారతివారి 'చైతన్య లహరి'లో శ్రీ మరుపూరు కోదండరామిరెడ్డిగారి 'వేమన' వ్యాసాన్ని చదివిన తరువాత, 1974 ఫిబ్రవరి భారతిలోని శ్రీ పులిచెర్ల సాంబశివరావుగారి 'వేమన—ఊహాపోహాలు'—అన్న వ్యాసాన్ని కూడ చదివాను. శ్రీ సాంబశివరావుగారి వ్యాసం నన్ను కొంత కలవరపెట్టింది. రామిరెడ్డిగారి వ్యాసాన్ని, వీరి వ్యాసాన్ని మళ్ళీ చదివాను. నాకు కలిగిన కొంత ఆశ్చర్యాన్ని విజ్ఞుల ఎదుట ఉంచుతున్నాను. తప్పొప్పు లరయుదరు గాక!

శ్రీ పులిచెర్ల సాంబశివరావుగారు మొదటి పేరాలో వేమనను నిస్సందేహంగా కవేనని ఒప్పుకుంటూ విమర్శకులు వేమనని మహాకవిగా మాత్రం స్తుతించుట సాక్షాత్తు వేమనగారికే నచ్చబడదన్న భావాన్ని వ్యక్తంచేసి, వేమన ధనార్జన కొఱకు కవిత్వం చెప్పే కొందరు పూర్వకవులను విమర్శించాడని,

'తోటకూరకైన దొగ్గలికైనను

....

గావ్యములను జెప్పు ఘనులెల్ల ధనపరుల్'

అన్న పద్యాన్ని ఉదాహరించారు.

విమర్శకులు వేమనను యోగిగా విస్మరించి మహాకవిగా స్తుతించుట వేమనకు తెలిసినచో తప్పక ఆ విమర్శకులను వేమన చెడతిట్టుననుటకు సందేహము లేదు—అని అన్న తరువాత పై పద్యాన్ని ఉదాహరించి, 'వేమన తన నాటి కవులను విమర్శించెను' అని అన్నారు శ్రీ రావుగారు.

ఆ మాట తరువాత అదే పేరాతోనే పై పద్యాన్ని ఉదాహరించిన రావుగారి ఉద్దేశ్య మేమైయుండును?

ధనకాంక్ష గలిగిన కవులను విమర్శించిన వేమన మహాకవి కాడనియా! అట్లు గాకున్న శ్రీ రావుగారు ఆ పద్యమును అచట గాక 'వేమన సూటిగా చెప్ప దలచుకున్నది చెప్పును'—అనుటయందో లేక 'నీతులు చమత్కారములను చెప్పటలో సాటిలేనివాడు'—అని అనుటయందో ఉదాహరించియుండిన బాగుండెడిది. అటు గాక అక్కడ ఉదాహరించడంలో మహాకవి, కవులను విమర్శించడనియేనేమో!! అట్లయిన కావ్యకన్యకను కూళలకమ్మి అప్పడుపుకూడు భుజించెడి కవులను విమర్శించిన పోతన మహాకవి కాడా?—

కులమును, మండలమును మనసులో నుంచుకొని విమర్శ సాగించు నేటి విమర్శకులను వేమన బ్రతికియుండినచో బ్రతుకనిచ్చునా?'—ఇది రావుగారి రెండో మాట!

వేమనగారికి తెలిసిన, బ్రతికియుండిన; విమర్శకులను తిట్టుట, బ్రతుక నివ్వకుండుట జరుగునట! వేమనే బ్రతికియుండినచో ఈ విమర్శ లెందుకు? రావుగారి కీ శ్రమ యెందులకు?

ఇంక, 'వేమన' వ్యాసంలో శ్రీమరుపూరు కోదండరామిరెడ్డిగారు 'ఈ లోక కవి తండ్రి రెడ్డన్న' అనియు 'కొండవీటిరెడ్డి— రాజులకు చుట్టమనేది అతి వ్యాప్తి జెందిన జనశ్రుతి మాత్రమే. ఈ కథలన్నీ చరిత్రకు చాలా దూరము'— అనియును జెప్పినారు.

శ్రీ సాంబశివరావుగారు చరిత్రకు భిన్నమైన ముఖ్యాంశ మొకటి కలదంటూ, కుమారగిరికి కుమారుడున్నట్లు చిలుకూరి వీరభద్రరావుగారు శాసనాధారంగా చూపించినారని, కుమారగిరికి సంతానం లేదని నిరూపించడం కష్టమనీ అంటూ 'కుమారగిరికి కుమారుడున్నచో వారికి కోమటి వెంకారెడ్డి, రాచవేమారెడ్డి అని పేర్లుండుట కభ్యంతరమేమి? పెద కోమటి వేమారెడ్డికి రాచవేమారెడ్డి అనుపేరుండవచ్చును. ఈ పేరొక్కనికే యుండవలెనన్న నియమ మేమియు లేదుకదా! ఈ కథ అబద్ధమని నిరూపించుటకేమి సాక్ష్యము కలదు. మన తెలివితేటల నెట్లయినను ప్రదర్శించవలెనను ఉత్సాహము లేకున్నచో నీ కథను విశ్వసించవచ్చును.' అని వ్రాసినారు.

కుమారుడుండిన అవే పేర్లుండవలెనను నియమమూ లేదుగదా! ఈ కథను నిరూపించుటకు

సాక్ష్యమూ లేదు. ఏదో ఒక కథ నల్లి దీనిని అబద్ధమని నిరూపించండి! — అంటే ఎవరేం చేయగలరు. అంతేకాక, 'మన తెలివితేటల నెట్లయినను ప్రదర్శింపవలెను. అను ఉత్సాహము లేకున్నచో నీ కథను విశ్వసింపవచ్చును.' — అని అన్నారు సాంబశివరావుగారు.

అంటే ఈయన వ్రాసిన కథను విశ్వసింపవచ్చునట!

ఎప్పుడు ? ? ఎవరైన ఎట్లైనా సరే వాస్తవాన్ని (వారి దృష్టిలో తెలివితేటలు ప్రదర్శించుట.) ప్రదర్శింపనుత్సాహపడనప్పుడు — మళ్లీ వారే 'ఈ కథలో కొంతయైన సత్యముండును' అని కొంత సర్దుకున్నారు. ఈ కథను కాదని రాళ్లపల్లి వంటివారు పిచ్చి ఊహాలతో తికమక పడినారట. ఇదీ! రావుగారి అపోహ !

శ్రీ రావుగారు రాళ్లపల్లి వారిని వీరి వ్యాసంలో రెండు, మూడుసార్లు ఉడిమినారు.

వేమన దేశమును నిర్ణయించుటకు ప్రయత్నించుచూ రాళ్లపల్లివారిట్లూహించిరని......

'ముఱకు, తాఱడు, సంబళము, నొద్దు, కవళము, కూయు, క్రిచాడి, దుడ్డు, తావిక, బిత్తరి — ఇత్యాదులు కన్నడ సీమకు సమీపమగు తెలుగుదేశమందే వాడుకలో గలవు. మరియు అకువక్క, బైసి, నలికి, ఒక్కపొద్దు, రుద్దు, పీకు, కుళ్లపోతు, మొదలగు శబ్దములు నల్లమల కీవలి వారికితప్ప ఆవలి వారి కర్థమగునా యనియేనా సందేహము. వీనికి తోడు కుంక, చెంబడి, ఊక వంటివి ఈ దేశమున వాడుకలేని పదములు అపురూపముగా గలవుకాని, యివి వేమనవంటి దేశద్రిమ్మరికి వచ్చుట వింతగాదు.'— అన్న రాళ్లపల్లివారి వ్యాసంలోని పేరాను ఉదాహరించి, ఆ పేరాక్రిందనే 'ఈ శబ్దములలో నధికభాగము గుంటూరు మండవాసులకు చక్కగా నర్థమగును. ఈ సంగతి తెలియని రాళ్లపల్లివారు వీని నుదాహరించి వేమన్నను రాయలసీమ వాసిగా నిరూపింప తిప్పలు పడిరి.' అని రావుగారు వ్యాఖ్యానించారు.

రాళ్లపల్లి వారిచ్చిన పదాల్లో 'ముఱకు .... బిత్తరి' ఇత్యాదులు ఖచ్చితంగా కన్నడ భాషా ప్రభావం గలిగిన తెలుగు దేశానివే! అంటే రాయలసీమవే! ఇందులో సందేహంలేదు. కోదండరామిరెడ్డిగారుకూడ 'వేమన వాడిన పదాలు అచ్చటంగా రాయలసీమవే! వీటిలో చాలా వఱకు నెల్లూరు ప్రాంతంలో కూడ వాడుకలో కలవు. దేశద్రిమ్మరి కాబట్టి మరి కొన్ని ప్రాంతాల పదాలు దూరినవి.' అని చెబుతూ రాళ్లపల్లి వారిచ్చిన పదాలనే చాలా భాగం ఉదాహరించారు.

కర్నూలు జిల్లాలో కూడ కన్నడభాషా ప్రభావం కనబడుతుంది. నెల్లూరి ప్రాంతంలోని నాటుక పదాలూ వేమన పద్యాల్లో కలిశాయి. అంతేకాక, 'కటారుపల్లె, కందిమల్లయపల్లెలలో వేమన తిరిగాడు. ఈయనను మావాడు అన్న గ్రామాలు కడప చిట్వేలు, గుంటూరు ఇనుకొండ (వినుకొండ) కర్నూలు క్రిష్టిపాడు'—అని రామిరెడ్డిగారు అనడం వల్ల వేమన, కర్నూలు, నెల్లూరు, గుంటూరు జిల్లాలు తిరగడంచేత తాను వాడిన రాయలసీమ పదాలతో గుంటూరు వారికి కూడ అర్థమయ్యే వాటిని ప్రయోగించి యుండవచ్చును. రాళ్లపల్లివారు 'ఈ శబ్దములు నల్లమల కీవలివారికి తప్ప ఆవలవారి కర్థమగునా అనియేనా సందేహం'—అని అన్నారు. దాన్ని మన శ్రీరావుగారు 'ఈ శబ్దములలో నధికభాగము గుంటూరు మండలవాసులకు చక్కగా నర్థమగును. ఈ సంగతి తెలియని రాళ్లపల్లివారు......'అని ఒక అపోహపడినారు.

రాళ్లపల్లివారు రాయలసీమతో ఉండి, నల్లమలకు ఈవలి వారికి తప్ప ఆవలివారికి అర్థము కావన్నారు. అంటే రాళ్లపల్లివారి ఉద్దేశ్యం, 'మహబూబ్‌నగర్ జిల్లా ఇత్యాది ప్రాంతాలవారి కర్థము కావు!'—అనే కాని గుంటూరి వారికి అని ఏమాత్రం కానేరదు!

కర్నూలు,—నెల్లూరు, గుంటూరు—ఈమూడు మండలాలూ ప్రక్కప్రక్కనే—అన్న సంగతి అందరికీ

తెలిసిందే. కొంత వాస్తవాన్ని గమనించినట్లయితే మూడు నాలుగు జిల్లాలు కలిసే సరిహద్దు స్థలాల్లోని వాడుకభాష అన్ని మాండలికాలనూ సంతరించుకొని యుండుననుటలో సందేహము లేదుకదా!

ఆధునికాంధ్ర సాహిత్యయుగ కర్తయైన వీరేశలింగం పంతులుగారు వేమనను కవిగా స్తుతింపలేదని శ్రీ సాంబశివరావుగారనిరి. ఇదే విషయాన్నే తెలుపుతూ శ్రీ రామిరెడ్డిగారు 'మనవారు చేయని పని' అన్న శీర్షిక క్రింద 'కందుకూరి వీరేశలింగం వ్రాసిన కవుల చరిత్రలో వేమన లేదు. పెంచి ప్రచురించిన ద్వితీయ ముద్రణంలో కూడ లేదు. ఇది కృటు కాకపోయినా కూరిమి లేకపోవుట కావాల'—అని అన్నారు. అంతేకాక శ్రీ సాంబశివరావుగారు, బ్రౌన్ దొరగారి 'వర్సెస్ ఆఫ్ వేమన' అను ఆంగ్లానువాదంతో వేమన జగత్ప్రసిద్ధుడయ్యేనని కొంద రాంధ్రు లమాయకమైన యూహ చేయుచున్నారనీ, ఆ ఆంగ్లీకరణమును తిరిగి ఆంధ్రులే చదువుతున్నారనీ అంటూ ఈనాటివారు వేమనను మహాకవిగా స్తుతింప శ్రమించుచున్నారనీ, వేమన మహాకవి యగుటకు యత్నింపలేదనీ కొన్ని నీతులు చెప్పి కృతకృత్యుడైన వేమన కవిత్వం వ్రాయలేదు. కవి కావాలనే ఊహ వేమనకే లేదు. నేటి విమర్శకులు అయన్ని మహాకవి అని అనుకోడం చింత్యము'—అని అన్నారు.

బ్రౌన్‌దొర కూడ వేమనను కవిగా స్తుతింపలేదని శ్రీ రావుగారన్నారు కదా! 'బ్రౌన్‌దొర వేమనను 'నా కవి' అని సొంతడబ్బుతో నాల్గు చెరగులను వేమన పద్యాలను సేకరించి ప్రతులు వ్రాయించి 2000 పద్యాలను అచ్చువేయించినాడు. ఆ బ్రౌన్‌దొరే ఆ పద్యాలకు ఇంగ్లీషు తాత్పర్యాలు వ్రాసి దానితోసహా కొన్ని పద్యాలు ల్యాటిన్ భాషలోనికి కూడ అనువదించినాడు'—అని రామిరెడ్డిగారు తెలిపిరి. రావుగారి మాట ప్రకారం బ్రౌన్‌దొర ఆంగ్లీకరణాన్ని తిరిగి ఆంధ్రులే చదువుతూఉంటే ల్యాటిన్‌లోని పద్యాలెవరు చదువుతున్నారు?

వేమనను హృదయపూర్వకంగా కవి అని అంగీకరించి, ఆయన పలుకుబడికి జోహారు లర్పించిన అనేకమంది పాశ్చాత్య పండితుల సేవను వారి పేర్లతో సహా వివరించారు శ్రీ రెడ్డిగారు మరి, వేమన జగత్ప్రసిద్ధుడు అయినాడనుట అమాయకమైన ఊహో లేక అపోహో పాఠకులు నిర్ణయించవలెను.

ఇంకొక్కమాట!

శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు తమ—కవిత్వతత్త్వ విచారంలో 'వేమనకు పుస్తక జ్ఞానము ఇంచుమించు సున్న. వ్యాకరణము, ఛందస్సు, అలంకార శాస్త్రము, మొదలగు వాటిలో నీతనికి సక్తి ఎంత తక్కువో, భక్తియు నంత తక్కువ! అట్లుండియు, వేమనను మహాకవులలో చేరినవాడు అని చెప్పుటకై సామాన్యముగా శుష్కపండితులు తప్పనింకెవరును సందియపడరు.—' అని అన్నారు.

శ్రీ రావుగారు, విమర్శకులు వేమనను మహాకవి అని అంటున్నారని, వేమనకీ సంగతి తెలిస్తే చెడ దిట్టును అనిన్నీ ఆయనను మహాకవి అనుట చింత్యమనీ అన్నారుకదా! మరి, కట్టమంచివారు అంతమాట అన్నారే! ??

ఏది యేమైనా శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారన్నట్లు

'గోచీ పెట్టెను పెట్టలేదనుటకున్
కొట్లాట; తిక్కన్నకున్
ప్రాచీనుండని, కాదు తిమ్మనకు
సర్వాచీనుడం చేదియో
పేచీ—యీ సిగపట్ల గోత్రముల
కబ్బే నేను పోలేను—నీ
వాచామాధురి నీ నిరర్గళ
కవిత్వ స్ఫూర్తి కీర్తించెదన్'

అన్న విషయాన్నే అందరూ అంగీకరిద్దాం!

శ్రీ ఇమళ్ళదివెన్నె వేంకటరమణ ప్రసాద్.

వేమనపై రాద్ధాంతము

ఏప్రిల్' 74 'భారతి'లో అచ్చుపడిన 'వేమన వేదాంతము' గురించి ఈ వ్రాత.

వ్యాసకర్తతమని తాము పలుమార్లు ఖండించుకున్నారు. 'విరక్తుడై సంచరించుచు మానవాళికి దివ్యమార్గమును జూపిన దిగంబరకవి వేమన' అన్నారు. పండితుడు కానివాడూ వేదాల నభ్యసింపనివాడూ అయిన వేమన 'వేదాంతార్థములను' సామాన్యునికి సుగమము' చేశాడనీ అన్నారు. ఆధర్వణిక మహావాక్యాన్ని గ్రహించి 'మనకవి' (వేమనకవి'—బహుశా అచ్చు తప్పు) విగ్రహారాధనను విమర్శించేడన్నారు. మరి ఇంతరాసి, వేమన పద్యాల్లో కవిత్వముందని అంగీకరించకపోవడ మేమిటి? వేమన కవే అని ఒప్పుకుంటే

'—తెలుగులో జెప్పబడిన ప్రతినీతి వాక్యము, ప్రతి చమత్కారము, ప్రతి తత్వము కవిత్వమేయని మన మంగీకరింప వలసి'

ఎందుకొస్తుంది?

వేదాంతార్థాలూ సిద్ధాంతాలూ ఎన్నయినా ఉండొచ్చు.

ఏం చెప్పినా అందంగా హృదయంగమంగా చెప్పడం కదా కవిత్వం? ఉదాహరణకి మర్క్సిజాన్ని మార్క్స్ చెప్పేడు. కాని, మార్క్స్‌ని కవి అనం కదా? ఆ తరువాత మార్క్సిజాన్నే జనహృదయాలకు హత్తుకునేలా చెప్పిన వాళ్ళని కవులనీ మహాకవులనీ కూడా అనడం మనం మానలేదు కదా?

నీతులన్నీ కవిత్వం కావు. కాని, కవిత్వంలో నీతులు కూడా ఉండొచ్చు!

అవగాహనలేని ఆర్భాటంతోబాటు అనవసరమైన తొందరపాటులో పొల్లుమాటలు కూడా కొన్ని దొర్లించేరు వ్యాసకర్త. శ్రీ రాళ్ళపల్లివారి మాటల్ని కొన్నిటిని ఉదహరించి 'వేమన పద్యములను జదివిన వారెవ్వరును ఈ వాక్యములను విశ్వసింపరు' అని రాసేరు. విశిష్ట విమర్శకులు శ్రీ రాళ్ళపల్లి వారికి తమ మాటల్లో తమకే విశ్వాసంలేదనా? లేక వారు కూడా 'వేమన పద్యముములను జదువ' లేదనా?

'వేమన తనకు గొప్పతత్వము తెలియునని చెప్పలేదుట. ప్రతిపద్యం చివరా 'విశ్వదాభిరామ వినుర వేమ' అంటూ చెప్పుకున్నాడు కాదా? లేక, వేమనకే తెలియని వేమన వేదాంతాన్ని వేమన పద్యాల్లోంచి లాగేరా వ్యాసకర్తగారు?!

వ్యాసం ఆఖరు పేరాగ్రాఫులో ఒక్కోవాక్యం ఇంకోవాక్యాన్ని ఖండిస్తోంది. కావాలనికూచుని రాసేదా కవిత్వం? 'తాను కవిగాదల'చక వేమనపద్యాలు చెబితే, అది కవిత్వమైతే దాన్ని కవిత్వంగా మనం స్వీకరించ కూడదా? 'తనకు తెలిసిన జ్ఞానము' 'సరళమైన భాషలో' ప్రజలకు పంచితే, వేమన బోధలుకవిత్వం కాకపోయిందా? కవిత్వమంటే తనకి తెలీనివి చెప్పడమా? లేక, సరళమైన భాషలో చెప్పక పోవడమా? విరాగి అయిన వేమన తన తత్వాన్ని 'బ్రతికియుండు లోపల' జనులందరికీ చెప్పాలనుకున్నాడు. జనులందరూ ఇప్పుడిప్పుడే వేమనను కవిగా గుర్తిస్తున్నారు. ఏక సిస్తున్న 'మనవారి తెలివితేటల' గురించి బాధ పడడం ఎందుకో? తనను 'మహాకవి' అని ప్రజలు అంటారని తెలిసుంటే వేమన అసలు పద్యాలే చెప్పేవాడు కాదు అనేది మరీ విడ్డూరమైన మాట.

మహాకవిగా తనని ప్రజలు గుర్తిస్తారని తెలిసుంటే నిజంగానే జాగ్రత్తపడేవాడు వేమన. తన పద్యాల్ని తానే సంపుటీకరించి ముందుతరాల వారికి తన వెలలేని కానుకగా ఇచ్చిపోయుండేవాడు. అప్పుడు అడ్డమైన చెత్తపద్యాలూ వేమన పద్యాలుగా చలామణీ కావడానికి వీలుండేది కాదు. అవకతవక విమర్శలకూ చోటుండేది కాదు.

—కేవస్వీ

మాతృభాషా బోధన — మానసిక సమస్యలు

'భవిష్యత్ కావాగతిః' అన్న ధోరణిలో నడచుచున్నది నేటి విద్యా విధానము. ఏండ్లుపూండ్లు గడచుచున్నను ప్రయోగములే కాని ప్రమాణములు కాన రావు. ఇది విధి వైపరీత్యమో, మానవ కల్పితమో దుర్గ్రాహ్యము. విధిచోదితమైన మానవ కల్పనలుగా

సమర్థించుకొనవలసి యున్నది. ఈ ప్రయోగ సరళి మాతృభాషా బోధనాధ్యయనముల చోటు జేసికొనుట సహజమే గదా! ఈనాట మాతృభాషా బోధనతో నెదురగుచున్న కొన్ని సమస్యలు సామాన్యులకును, ధీమాన్యులకును శిరోవేదన కారకములగుచున్నవి. కళాశాలలతో నెదురగువానిగూర్చి బరిశీలింతము.

'ప్రథమ కబళే మక్షికాపాతః' అన్నట్లుగా కళాశాలలతో మాతృభాషను ద్వితీయ భాషగా నిర్ణయించుట. అనగా విద్యార్థి ఐచ్ఛికభాషయన్నమాట. విద్యార్థి గణనలో దానిని చదివినచో దయ తలచి చదువుట యన్నమాట. అందుచే మన తెలుగే కదా యన్న భావన సర్వేసర్వత్ర యున్నమాట—ఏ నాగరక దేశమందును మాతృభాషను ఐచ్ఛిక పఠనీయముగా జేయుట జరగదేమోనని నా భావము—దీనికి బోధనా కాలము వారమునకు నాలుగు గంటలు. పాఠ్యప్రణాళిక అనల్పము. తక్కిన భాషలకన్న వ్యాకరణాదులందు మిన్న. 'ఆశలావు పీక సన్నము' అనునట్లు 'సాహిత్య కౌముది' వంటి అయ పిండ సాదృశ్య గ్రంథముల నిర్ణయించి కాలవ్యయమును గావించుటే గాక విద్యార్థులలో నతిస్వల్పముగానున్న రసానంద జిజ్ఞాసను చంపివైతురు. విద్యార్థి స్వయంకృషికాఘాతము గల్గించుటకు శక్తివంచనలేక కృషి చేయుచున్న యీ తామర తంపరవంటి 'గైడు'ల పుట్టుక. విద్యార్థులలో కేవలము పరీక్షాదృష్టియేగాని సాహిత్యాధ్యయన వ్యాసంగము శూన్యమగుచున్నది. ఇట్టి గైడులను నిషేధించు శుభ దిన మెన్నడు రానున్నదో ఆనాడు గుణగ్రహణ పారీణులగు ఉపాధ్యాయ విద్యార్థులకు పర్వదినము.

ఈనాడు మాతృభాషా బోధనలో ప్రధానమగు రెండు సమస్యలు' 'పులిమీద పుట్ర' యన్నట్లు, వచ్చినవి—అందొకటి భాషా సమస్య, ప్రభుత్వమువారు శిష్టవ్యావహారికమును పరీక్షలలో వ్రాయుటకు నంగీకరించుటయన్నది యేవిధముగ జూచినను సమర్థనీయము గాదని నా తలంపు. నన్నయాదులనుండి నేటివరకు తెలుగుభాషలో మార్పులు అంతగా లేకుండ నిలచినది గ్రాంథికభాష. అదియే ప్రామాణికభాష. కావనే వేల సంవత్సరముల క్రిందటి కావ్యము లీనాటికిని అవగాహన క్షమత్వము కలిగియున్నవి. ప్రజల భాషయన్న పేరుతో వ్యావహారికభాషను నిర్ణయించుచో దానికి ప్రామాణికత యేది? తెలంగాణాభాష రాయలసీమవారి కర్థము కాదు. అట్లే వారిది వీరికిని. వ్యావహారికభాష సెలయేరు వంటిది—గ్రాంథికభాష నిశ్చలసంద్రము వంటిది—కనుక వ్యావహారికభాషా నిర్ణయము తాత్కాలికముగా మంచిదిగా తోచినను ప్రామాణికత విషయములో సమస్యల తెచ్చిపెట్టును. వ్యావహారికభాష కీయవలసిన స్థానము నిచ్చుచునేయున్నాము. ఏ అంధ్రోపన్యాసకుడును గ్రాంథికభాషలో నుపన్యసింపడు. రాయలసీమ వ్యక్తి తెలంగాణా ప్రాంతమున తన మాండలికమున కేవల ముపన్యసించిననే అవగాహన కలుగదే. అట్టిచో తేలిన ప్రక్రియకు వ్యావహారికభాష నంగీకరించుచో విద్యావిధానమున తెలుగుదేశమును మూడు ముక్కలు గావించినట్లే. పత్రికల భాష యున్నది గదా! యని యన్నచో ఆ భాష కృష్ణా, గుంటూరు ప్రాంతపు భాషయని తక్కినవారి నమ్మకము. ఆ భాషా ప్రాబల్యము తక్కినవారేల అంగీకరింతురు? ఎందు కంగీకరింపవలె? కావున గ్రాంథికభాషనే నిల్పుటకు, తద్ద్వారమున ప్రాచీన సాహిత్య సౌహిత్యము నెరుగుటకు యత్నించుడని విజ్ఞుల మరొక్కమారు ప్రార్థింతును. నిత్యచైతన్య చకచ్చకితమగు ప్రపంచమున మనకు అన్యథా సమస్యలు లేనట్లు మరల ఈ భాషా సమస్యను మరల రచ్చ కీడ్వవద్దని, యథాతథ పరిస్థితిని కొనసాగింపుడని నా మనవి.

మాతృభాషా బోధనలోని మరొక సమస్య. 'గ్రూప్ ఒరియంటేషను' పేరుతో డిగ్రీ తరగతులకు ఆయా గ్రూపుల ననుసరించి వేర్వేరు గ్రంథముల నిర్ణయించుట. ఇది ఎంత ప్రమాదకరమో అను భవముమీదగాని తెలియదు. భాషను, సాహిత్యమును వేరుచేయు ఈ ఆశయము ఆచరణలో విఫలముగాక తప్పదు. అనగా విద్యార్థి మాతృభాష సంస్కృతుల నెఱుగడు. ఆపని లేదు. మాతృభాషద్వారా గ్రూపు

విషయముల గ్రహించును. ఆ భాషగూడ సాంగో పాంగముగ నెఱుగడు. వ్యావహారికభాష నను గ్రహించి ఆతనికి వ్యాకరణముతో నిమిత్తములేకుండ జేసితిమి గదా! తెలుగు తరగతులలో నతడు గ్రూపు విషయము లనే నేర్చును. సాహిత్య ప్రావీణ్యమునందడు. దీనికి సాహిత్యాచార్యు డవసరముకూడ లేదు. తెలుగుభాష వచ్చిన యే సైన్సు ఉపాధ్యాయుడైనను తెలుగు 'సైన్సు' గ్రంథమును, తెలుగుభాష మాతృభాషగా గల వాణిజ్య శాస్త్రోపాధ్యాయుడైనను తెలుగు 'కామర్సు' గ్రంథమును జెప్పగలడు. ఇక ఆంధ్రోపన్యాసకుడు తాను కష్టించి నేర్చిన బ్రహ్మానంద సబ్రహ్మచారి యగు సాహిత్య రసానందమునకు తిలోదకము లర్పించి, శాస్త్ర పాఠ్యాంశములను, కొఱుకుడుపడని వాణిజ్యశాస్త్రాంశ ముల నెఱిగి విద్యార్థులకు బోధింపవలయును. ఇతడును విద్యార్థియే. ఇట్టి 'విద్యార్థి' తరగతులెంత క్రమ శిక్షణా నిలయములుగ నుండునో అనూహ్యము. విద్యార్థి సాహిత్యాధ్యయనము చేయుటకు 'ఐచ్ఛిక విషయము' (ఆప్షనల్ సబ్జక్ట్)గా తీసికొనవచ్చును గదా! యని యనవచ్చును. సాహిత్యపరిచయమే మననుగావింప నపుడు ప్రావీణ్యము కొఱకైచ్ఛిక విషయముగా తీసి కొనవలెననెడి వాంఛ విద్యార్థికెట్లు కలుగును? ఈనాడు ఇంతగా సాహిత్య పరిచయగ్రంథములను చదువుచున్నను గ్రూపు సాహిత్యము చదువు విద్యార్థు లత్యల్పమని జగమెరిగిన విషయము. అట్టిచో సాహిత్య పరిచయమే లేని తెలుగు గ్రంథములను చదివిన విద్యార్థి గ్రూపులో చేరునన్నది గగనకుసుమము. కాల క్రమేణ తెలుగువారి సాహితీ సంస్కృతులు మరుగున పడుటకు చేయుచున్న చక్కని, చిక్కని ప్రయత్నమిది యని చెప్పక తప్పదు.

ఇట్టి పరిస్థితులలో మాతృభాషా బోధన వైక్లబ్యమునొందిన ఈ తరుణములో నీ క్రింది సూచనలు సంస్కరణ ప్రాయములగునేమో సహృ దయు లాలోచింపుడు. మాతృభాషను నిర్బంధ పఠ నీయముగా నుంచుట; తక్కిన భాషాబోధనల గంటలనే వీనికి నుంచుట; తెలుగుభాషా బోధనా ప్రణాళికలో సంస్కృతమును, వ్యాకరణమును నిర్బంధముగా కొంత నుంచుట; పూర్వమువలె సరళ గ్రాంధికమునే తప్పని సరిగా ప్రశ్నపత్రములలో నుంచుట. 'గ్రూపు ఓరి యంటేషను' పేరుతో సాహిత్య హింసావలోకనము సేయకుండుట; విద్యార్థులకు వాచ్యక లేఖన ప్రక్రియ లందు ఎక్కువగా అవకాశము నిచ్చునట్లు పాఠ్య ప్రణాళికను సవరించుట. ఇట్టి సంస్కరణలు మాతృ భాషా బోధనయందలి అవకతవకలను సరిదిద్ది మాన సికముగా విద్యార్థికి భాషాసాహిత్యాభిరుచులను సమా నాంతరముగ గలిగించి తెలుగువెలుగును దీపింప జేయును. అస్తు.

'ఆంధ్రత్వ మాంధ్రభాషా చ
ప్రాభాకర సమన్వితమ్
తత్రాపి యాజుషీస్యాఖా
నాల్పస్య తపసః ఫలమ్'

—'సుచంద్ర'

'రనండి' తెలుగు పదమే— మాండలికం!

1974 మార్చినెల 'భారతి'లో శ్రీ టి. జి. కృష్ణా రావు వ్రాసిన 'మణిప్రవాళమూ— ఆరుద్రా' అనే వ్యాసం చదివిన తర్వాత ఒకటి రెండు విషయాలను పునఃప్రస్తావనకు తేవడం అవసర మని పించింది. వారు తమ వ్యాసంలో 'ఆధునిక మణిప్రవా ళా'నికి ఆరుద్రగారి 'త్వమేవాఽహం'నుంచి ఉదాహర ణలు ఉటంకించుతూ, 'రనండి నా పంథా' అనే పాదంలోని 'రనండి' అనే విధ్యర్థక క్రియాపదాన్ని ఆంగ్లాంధ్ర మిశ్రమ పదబంధమని భ్రమ పడటమే కాకుండా,—'కాని ఎవరూ, రనండి, రనుతూ ఉన్నారా? రనుతామా? ఇత్యాది కృతకరూపాలు వాడరు' అని అన్నారు. చివరి రెండింటి విషయంలో ఇది నిజమే అయినా, మొదటిది మాత్రం వారి మాటకు అపవాదం.

'రనండి' అనేది అచ్చమైన తెనుగుపదమే; మాండలికం. నెల్లూరుజిల్లావాళ్ల నోళ్లలో నిత్యమూ

నానుతూఉండే పదం. నెల్లూరు మండల వ్యవహారంలో, జానపదులు, నాగరకులు అనే భేదం లేకుండ దాదాపు చాలమంది 'రనండి' అనే పదాన్ని 'రండి' (Come) అనే అర్థంలో వాడుతుంటారు. అంతేకాదు, 'పొండి' (Go) అనే మాటకు 'పొనండి' అని కూడ వ్యవహార ప్రతీతి.

'రండి' అనే క్రియ భ్రష్టమై 'రనండి'గా రూపొందినది. ఇక్కడ శబ్ద విపరిణామమేకాని అర్థంలో మార్పులేదు. శబ్ద విపర్యాసం (Sound Change) తో బాటు అర్థ విపర్యయమూ (Semantic Change) జరిగితీరాలని నియమం లేదుకదా. ఇక పోతే—మాండలి కాలలో వర్ణలోప, వర్ణాగమాదేశాలు పలువిధాలుగా ఉంటాయని, అవి ఒక నియమానికి లొంగి ప్రవర్తించ వనే సత్యం భాషాభిజ్ఞు లెల్లరకు తెలిసిందే. 'రనండి' పదాన్ని రన్ (ఇంగ్లీషు పదం)+అండి—అని ఆంగ్లాంధ్ర పదాలుగా వింగడించడంలో బుద్ధి చమత్కారమేకాని శాస్త్రీయమైన పద్ధతి గోచరించటంలేదు. ఎందు కంటే—'రనండి'కి సంబంధించినంతవరకు అట్లాంటి విభజనకు (రన్+అండి) వీలున్నా, 'పొనండి'కి అటు వంటి విభజన కుదరదుకదా. పై రెండు మాండలి కాలు కృష్ణారావుగారి చెవికి సోకి ఉండకపోవచ్చు నను కొంటాను.

ఆరుద్ర 'త్వమేవాఽహం'లో ఆంగ్లాంధ్ర కృతక పదబంధాలను బహుళంగా వాడిన మాట నిజమే అయినా, 'రనండి' మాత్రం ఆయన ఆ ఉద్దేశంతో గాక నెల్లూరి మాండలికాన్నే స్వీకరించినాడేమోనని నా ఊహ. ఇందుకు ఆరుద్ర నెల్లూరివాడు కాకపోవడం ప్రతిబంధకం కాబోదు. ఎందుకంటే—కవిగా ఆరుద్రపై నెల్లూరి 'అతినవ్యకవి పఠాభి' ప్రభావం చాల ఉంద నటం నిర్వివాదం. నిర్వివాదం అని ఎందుకంటున్నా నంటే, ఒకసారి ఆరుద్రగారే గూడూరులో తనకు జరి గిన సన్మానసభలో స్వయంగా చెప్పకొని, ఒప్పకొన్నాడు కూడ. దీనికితోడు శ్రీ కె. వి. రమణారెడ్డి, స్వర్గీయ నారపరెడ్డి, రామిరెడ్డివంటి నెల్లూరి కవులాయనకు మిత్రులుకూడ. కాబట్టి 'రనండి' అనే మాటను వారి నోటివెంట విని తన కావ్యంలో ప్రయోగించి ఉంటా డని నా అనుమానం. ఆరుద్రగారే తను ఉద్దేశాన్ని వెల్లడించితే ఏ చిక్కూ లేదు.

కృష్ణారావుగారు 'ఆధునిక మణిప్రవాళానికి ఆచార్యపీఠం ఆరుద్రదే' ననడం కూడ ఇంచుక అసంగతమే. ఈ 'ఆచార్యుడి'కి ఆచార్యుడైన 'పఠాభి' సంగతేమిటి ? 'లోహవిహంగాలు' గేయంలోని — 'అసూర్యం పశ్యలు, హాయిహీలు యానలు గూడ్సు గమనలు' అనే పాదంలోని 'హాయిహీలుయాన' 'పఠాభి ఫిడేల్ రాగాల డజన్'లోంచి నడచివచ్చినదే. 'గూడ్సుగమనలు' 'హాయిహీలుయాన'కు తోబుట్టువు లనడంలో సందేహం ఉండనవసరంలేదు. అసలు 'త్వమేవాఽహం' అంతా— కావ్యవస్తువును మినహా యించితే—భాషావిషయికంగా అడుగడుగునా 'పఠాభి' సాక్షాత్కరిస్తూ ఉంటాడు. 'ఈనాడు ఆరుద్రముద్ర అంటారే అది (ఫోర్జరీ అనబోనుగాని) నిస్సందేహంగా పఠాభిముద్రే. అది దాటి యిప్పటికి యింకా ఆరుద్ర బైటపడలేదు.' అని 'నగ్నముని తూర్పుగాలి'కి పీఠిక వ్రాస్తూ శ్రీశ్రీ అన్నాడు. పరిస్థితి ఈ నాటికి కూడ అట్లా ఉన్నప్పుడు, ఇక 'త్వమేవాఽహం' నాటి సంగతి వేరే చెప్పనక్కరలేదుకదా. కాబట్టి గురువును విడిచి శిష్యుడికి ఆచార్య పీఠాన్ని అంటగట్టడం న్యాయం కాదని మనవి. ఆధునిక మణిప్రవాళానికి గురుపీఠం 'పఠాభి'. ప్రసారకేంద్రం (బ్రాడ్‌కాస్టింగ్ స్టేషన్) ఆరుద్ర.

ఇక 'వైచిత్రి'ని గురించి ఒక చిన్న విన్నపం. నవ్యతను ఆహ్వానించవలసినదే—ఆదరించతగినదే. కాని, ఎప్పుడు ? అది ఔచిత్యంతో అలరారుతున్నప్పుడు. ఔచిత్యమంటే ఏమిటి? అర్థగౌరవం, అర్థగాంభీ ర్యమూ కలిగి ఉండటమే కదా! ఔచిత్య విహీనమైన నవ్యత— అది ఎంతటి నవ్యమైనాసరే— నిరాదర ణీయం. పైగా దాన్ని 'వైచిత్రి' అనడంకూడ సబబు కాదు, ఎందుకంటే — కేవలం శాబ్దికమైన నవ్య

తకు, ఆర్థికమైన నవ్యతకు లక్ష్యాలు భిన్నమైనట్లే లక్షణాలు కూడ భిన్నంగా చూపడం శాస్త్రవిహితం. శాబ్దిక పటాటోపంతోకూడిన నవ్యతకు మనం వేరే ఏదైనా లక్షణాన్ని, 'వైచిత్ర్యాభాస' అనో, లేదా మరేదైనా అనో పేర్కొనడం ధర్మం. ఔచిత్య సంశోభితమైన నవ్యతకు, ఔచిత్యరహితమైన నవ్యతకు ఒకేలక్షణం పొసగదు కదా!

లేదా, మనం 'వైచిత్రిని శబ్దవైచిత్రి, అర్థ వైచిత్రి, భావవైచిత్రి అని మూడువిధాలుగా విభజించుకోవడం మంచిది. కేవల శబ్దవైచిత్రి అనేది ఒకరకమైన మాటలగారడి. ఇందులో అర గౌరవం కాని, భావనైశిత్యం కాని స్ఫురించదు. కాబట్టి ఇది నిరర్థకము, నీరసము నిస్తేజముకూడ. కడమ రెండింటిని సహృదయు లెప్పుడూ ఆదరిస్తూ, ఆనందించుతూ ఉంటారు.

'పఠాబి' చూపిన వైచిత్రి విభజననుబట్టి మొదటి రకానికి చెందినది — గుణాన్ని అనుసరించి అధమం. ఆరుద్ర 'త్వమేవాఽహం' ఇందుకు భిన్నం కాదు. కాని, ఆయన వ్రాసిన ఒకటి రెండు సినిమా పాటలలో కొన్ని పాదాలను చివరి రెండింటికి (అర్థ భావ వైచిత్రులకు) లక్ష్యంగా చూపించవచ్చు. ముఖ్యంగా 'కొండగాలి వీచింది; గుండె ఊసులాడింది' అనే గీతంలో 'పడుచుదనం అందానికి తాంబూలమిచ్చింది' అనే పాదం భావుకులను మెప్పించే గొప్ప వైచిత్రి.

—శ్రీ పాకాల వెంకటకృష్ణయ్య.



గ్రంథవిమర్శలు

కొత్త కెరటాలు

(కవితా సంకలనం)

(సంపాదకుడు:—శ్రీ వోడపల్లి వేంకట అప్పారావు. పేజీలు:—56; వెల:— రు. 2–00లు ప్రచురణ:— సారస్వత మేఖల; మహబూబాబాదు; వరంగల్లుజిల్లా.)

వివిధ కవుల కవితా సంకలనమిది. ఈ సంకలనంలో సంప్రదాయిక రీతిలో కవిత్వం రాసిన వారున్నారు; ఆధునిక పద్ధతిలో కవిత్వం రాసిన వారున్నారు. సామాజిక ప్రయోజనాన్ని ఆశించినవారు, వారితోపాటు సాహిత్య ప్రయోజనంలో సంబంధంలేని వాళ్ళు ఉన్నారు. కవిత్వ ప్రయోజనం మాట ఎలా ఉన్నా ఈ సంకలనంలో కవిత్వంపాలు ఎంత? అన్నది ప్రశ్న. సాహిత్యనీరాజనములో ముళ్ళపూడి సచ్చిదానందమూర్తిగారు 'ధ్వని ప్రధానమ్ కావ్యమ్ అన్న దానినే అందరూ సమర్థిస్తున్నారు. ధ్వనిలేని కవిత్వం ప్రాణం లేని శరీరం. ఎక్కడైతే శబ్దము తన అర్థమును, ఆ అర్థము తనను అప్రధానం చేసుకుని వేరొక అర్థమును స్ఫురింపచేయునో అది ధ్వని— అని సారాంశం' అంటూ కవిత్వంలో ధ్వనికున్న స్థానాన్ని గురించి చెప్పారు. అలంకార, వస్తు, రస ధ్వనులలో ఏ ధ్వని అయినాసరే—అసలు ధ్వనికీ— ఈ సంకలనానికి ఏ మాత్రం బాంధవ్యం లేదు. ఈ సంకలనంలో కనిపించే కవులందరూ దరిదాపుగా కొత్త కవులు. అంచేతనే ఈ సంకలనానికి కొత్త కెరటాలని నామకరణం చేశారేమో! కొత్తకవులు కావడం వలన భావపరమైన గందరగోళం కొంత ఈ సంకలనంలో కనిపిస్తున్నది. ఇది వారి తొలిప్రయత్నం కాబట్టి మలి ప్రయత్నంలోనైనా ఈ లోపాన్ని కొంతలో కొంత సరిదిద్దుకోగలరని ఆశించడంలో దోషం లేదు.

'పుష్పాలు విరిసిన కన్నుల నుండి
బాష్పాలు కురిపిస్తున్నారు
చీకటి ఎడారిలో దారి తెలియక
వెలుగుల్ని వెతుక్కుంటున్నారు
ఆ కన్నుల్లో దాగిన చీకటి నీడలు కనుగొన్నావా?
ఆ కన్నుల్లో కాగిన స్వేచ్ఛా
కాంక్షరేఖల్ని చూశావా?
వాళ్ళు నవసమాజ నిర్ణేతలు
వాళ్లు సమసమాజ నిర్మాతలు
స్వేచ్ఛ కావాలని అరుస్తున్నారు
అణగారిన గుండెల్ని ఆహ్వానిస్తున్నారు
అయితే విన్నారా ఆ పిలుపు
నిద్రాణమైయున్న జగతికి మేలుకొలుపు.'

అంటూ కె. వి. నరసింహారెడ్డిగారు పిలుపు అనే గేయంలో శ్రామికవర్గంలోని చైతన్యజాగృతిని గురించి చెబుతున్నారు. ఈ సంకలనంలోని మంచి గేయాల్లో ఇదొకటి. నరసింహారెడ్డిగారు శ్రామిక వర్గాన్ని ఏ వైపుకు పిలుస్తున్నారో మాత్రం మనకు తెలియదు. ఆయనచెప్పే చైతన్య స్వరూపం కూడా మనకు తెలియదు. స్తబ్ధ జీవితంలోకి చైతన్యం ప్రవేశించింది అని మాత్రమే నరసింహారెడ్డిగారు పసిగట్టినట్లున్నారు.

పాతూరి ప్రసన్నంగారు 'నన్ను నేను చంపుకుంటున్నాను' అనే ఖండికలో మానవ మహాప్రస్థానంలోని అధోగతి దశల్ని చక్కగా వివరించారు. మనిషి తన్నితను ఏవిధంగా మోసం చేసుకుని మానవత్వాన్నుంచి చ్యుతుడవుతున్నాడో వివరించారు.

'యుగయుగాల వికాసవాహిని
అందించిన నరజన్మలో
ఒక్కక్షణంలో విజృంభించే
పశుత్వాన్ని ఎదిరించలేక

నరత్వంనుంచి పశుత్వానికి,
అసురత్వానికీ దిగినప్పుడు
నన్ను నేను చంపుకుంటున్నాను
అనిపించింది నాకు'

అన్నంతవరకు గేయం బాగానే సాగింది.

'నన్నావరించిన తమస్సునుచీల్చి,
మృత్యువును జయించి
వాడై వ నరసంతతికి నాలోని
అమృతధారలను పంచి
'అమృతస్యపుత్రాః' అన్న
ఆర్యోక్తిని నిలబెట్టినపుడు
నన్ను నేను చంపుకుంటున్నాను
అనిపించింది నాకు'

అనడంలో క్రిందిపాదానికి పై మూడు పాదాలకు అన్వయం కుదరదు. 'ఆర్యోక్తిని నిలబెట్టినప్పుడు' అనేటట్లయితే ఈ క్రింది పాదానికి అర్థస్ఫూర్తి ఉంటూంది. ఇది పాతూరి ప్రసన్నంగారి దోషమో ముద్రారాక్షసమో స్పష్టంగా తెలియదు. తిరునగరి బాల భాస్కర్‌గారు అర్జీఅనే గేయంలో శ్రీమన్నారాయణుణ్ణి ఈనాటి సామాజిక అవ్యవస్థని సరిదిద్దమని ప్రార్థిస్తున్నారు.

'అరిష్టాల నరికట్ట లేక
దుండగులను దండించ లేక
గోళ్ళు గిల్లుకుంటూ నీళ్ళ నములుతూ
గుడ్లప్పగించి చూచే యేమి చేతగాని నీవు
నా అర్జీకేమి జవాబిస్తావు
ఈ దుర్దశనెలా తొలగిస్తావు'

అని దేవుణ్ణి అడుగుతున్నారు. కనబడని దేవునికి బాధ్యతను అప్పగించి చేతులు కడుక్కునే బదులు చైతన్యవంతులైన వీరి బాధ్యతను వీరు గుర్తించ గలగడం మంచిది గదా!

'అందట్లు నాకోసం తపనపడుతుంటే
'అసలొద్దు' అంటావేమిటి నువ్వు?
ఒకసారి కళ్ళు తెరచి
ఒళ్ళు విరుచుకుని చూడు
నీకూ...నీతోటి వాడికీ
నీడలాంటి సంబంధం లేదూ...?'

అని చెబుతూ గేయం చివరిలో 'అయ్యో నేను మానవత్వాన్ని' అని ధ్వని సిద్ధాంతాన్ని దిగంబరం చేశారు. పి. వి. ఆర్. ఎస్. ప్రసాద్‌గారు నేను అనే ఖండికలో. అందట్లు శబ్దప్రయోగం ఎలాంటిది?

మొత్తం మీద కావ్య సంకలనంలో పెద్దగా ప్రతిభద్యోతకం కాక పోయినప్పటికీ ఇందులో భవిష్యత్కవులవాణి కొంత వినబడుతున్నది. ఈ సంకలనంలోని కవులు ఏదో తోచింది రాసేస్తున్నాం అని ఇప్పటిదాకా అనుకున్నట్లుగాక ఏం రాస్తున్నాం? ఎందుకు రాస్తున్నాం? ఎట్లా రాస్తున్నాం? అని ప్రశ్నించుకుని వచ్చే సమాధానాలతో కొంత సాధన చేస్తే భవిష్యత్తులో మంచి కవులుగా పరిణమించవచ్చు.

ఇసిత్రం

(విశిష్ట స్వచ్ఛందకవితలు)

(పంచరెడ్డి లక్ష్మణ. పేజీలు:—42; వెల:— 2—00లు ప్రతులకు:—ఇందూరు భారతి; తెలుగు రచయితల సమాఖ్య 3—12—32 అశోకవీధి; నిజామాబాద్—503001.)

తెలంగాణా మాండలికంలో రాయబడిన స్వచ్ఛంద కవితా సంకలనమిది. కవి పంచరెడ్డి లక్ష్మణ. నవ్యాధునిక కవిత్వంలో వస్తున్న ఒకానొక పరిణామం భాష పరంగా కొత్తమార్గాన్ని త్రొక్కడం. ఈనాటి కవిత్వం సామాజిక చైతన్యాన్ని ద్విగుణీకృతం చేసేదిగా ఉండటం కాల లక్షణం. సామాజిక చైతన్యాన్ని సాహిత్యం ద్వారా కలిగించడం అంటే సాహిత్యానికి గల సామాజిక ప్రయోజనాన్ని గుర్తించడమేనన్న మాట. కవి ఏ వర్గాన్ని తన కవిత్వంతో ప్రభావితం చెయ్యాలని ఆశిస్తాడో ఆ వర్గానికి తన కవిత్వం సునాయాసంగా అర్థం అయ్యేలాగు కవిత్వం చెప్ప

గలిగి ఉండాలి. ఆధునిక కవిత ఆరంభంలో సామాజిక ప్రయోజనాన్ని ఆశించిందేగాని దానికి తగిన మార్గాల్లో భాషా ప్రయోగం కూడా ఒకటి అని అంతగా గుర్తించ లేదు. వ్యవహారిక భాషనే కావ్యభాషగా చేపట్టినా అభ్యుదయ కవిత్వం అనుకున్నంతగా తన ప్రయోజ నాన్ని సాధించలేక పోవడానికి మూలకారణం భాషే. ఈ తరం కవిత్వంలో భాషకు గల స్థానాన్ని బాగా గుర్తించింది. ఎవర్ని గురించి వీళ్ళ కవిత్వం రాస్తు న్నారో, ఎవరికోసం కవిత్వం రాస్తున్నారో వాళ్ళభాష లోనే ఆ రాసేదేదో రాస్తే వారాశించిన ప్రయోజనం కొంతవరకు నెరవేరుతుందని అధిక సంఖ్యాకుల నమ్మకం. 'ఇస్రితం' అనే కవితా సంకలనం భాషా దృష్టితో చూస్తే ఒక ప్రయోగం. ప్రత్యేకించి ఇది ఒక మాండలికంలోనే రాసినా కనీసం ఆ ప్రాంతాల వారినైనా కొద్దిలో కొద్ది ఈ సంకలనం ప్రభావితం చెయ్యగలదు.

ఈ కవికి వర్తమాన సమాజంపట్ల గల భావనే ఈ కవితా సంకలన మంతా విస్తరించుకున్నది. స్వాతంత్ర్యం వచ్చి రెండు దశాబ్దాలు దాటినా ఈ స్వాంతత్ర ప్రయోజనాన్ని ఏ వర్గం అనుభవిస్తున్నదో 'పంద్రాగస్టు' అనే ఖండికలో చక్కగా వ్యజకం చేశాడు.

'ఆడవోల్లో పెద్దదొర జెండమీది కెక్కించిండు
అందరూ ఒక్కటేగ బత్కాలి
కులంలేదు తలంలేదు
అందరూ సమానంగుండాలి అని బాగా చెప్పిండు
గిదంతా సెప్పినగా స్వరాసిగాడు
నన్ను కెంకిపట్టి సావమోదిండుగాని
మిఠాయి పెట్టలేదు.'

మరణించిన మహనీయుల ఆశయాలు ఈనాటి నాయకుల ఉపన్యాసాల్లో ఎలా నిష్ప్రయోజన మవు తున్నాయో పంద్రాగస్టులో స్పష్టమవుతుంది. ఈ ఆవేదన 'గియ్యాల' అనే ఖండికలో ఇంకా తీవ్రంగా వ్యక్తమయింది. నెహ్రూని సంబోధిస్తూ రాసిన ఖండిక ఇది.

నువుపుట్టినదేశం నువు మాకిప్పించిన దేశం
ఇప్పుడు కూడు లేక అలమటిస్తున్నది
కుక్కలుచంపిన ఇస్తరౌతున్నది
ఓ నెహ్రూ!
గడపెద్దోల్లంత నీపేరు సెప్పుకుంటున్నారు
నీలాగే టోపీలు పెట్టుకుంటున్నరు
మాకందరికీ టోపీవేస్తున్నారు.'

అన్నపాదాల్లో గాంధీ, నెహ్రూ సిద్ధాంతాల నినాదాలలో వర్తమాన నాయకులు పొందుతున్న వైయక్తికవికాసం ధ్వనిస్తోంది. ఇంకా ఈదేశంలో ప్రజలకు తమ చేతిలో ఉన్న వోటుకు విలువతెలియదు. బుడ్లకి, నోట్లకి అమ్ముడుపోతున్న వోట విధానంమీద ఈ కవికిగల తీవ్ర తిరస్కారం అమ్ముడు బోకుండ్రి' అనేఖండికలో వ్యక్తమయింది.

'కండ్లుతెరిసి ముందుకు సూడుండ్రి
మీరెంతి అనుకోకుండ్రి
మీతోనే గీదేశం
అంతాసమజ్ జేసుకుండ్రి
సమజున్నోల్లనే గెలిపియ్యండ్రి
ఒక్కపీసకు అమ్ముడు పోకుండ్రి'
అంటూ జనాలకు హితబోధ చేస్తున్నారు.

ఈ వ్యవస్థలో అధికభాగం జనాభా దోపిడీ చెయ్యబడుతున్నారు. వీళ్ళ ఉత్త అమాయకులని, వీళ్ళకు కల్లాకపటం తెలియదని, అందుమూలంగానే వీళ్ళ మోసగింపబడుతున్నారని కవి ఉద్దేశం. వాళ్లలో ఉన్న అమాయకత మూఢవిశ్వాసాల రూపంలో విస్త రిస్తున్నది. వాన కురవక పోవడానికి జానపదుల విశ్వా సం ఎలాంటిదో 'ఆవల్ పడకచ్చినై' అన్న ఖండికలో చెబుతున్నాడాయన.

'హోడో ఇంగిలీసోడు రాకిటుమీద
సంద్రుడి దగ్గర్కి పొయ్యిండంట
గందుకే ఆవల్ పడకచ్చిన యంటి
దొంగ సచ్చినోల్లు అల్లకు పనిలేదు
మాపానాలు పోతున్నయ్

సందురుడికి కోడ మొచ్చిందంట
మరి గందుకే ఆ నతిపడకచ్చిన యంట'

దోపిడీ చెయ్యబడుతున్న వర్గం మొత్తం ఒక్కటిగ సంఘటిత శక్తిలో ఎదురుతిరిగితే ప్రపంచం వాళ్లవెంటే వస్తుందనే నమ్మకం ఈకవికి ప్రగాఢంగా ఉన్నది. ఆ విశ్వాసం 'ఎలుగులకు' అన్నగేయం ముగింపులో ద్యోతకమవుతున్నది.

'గిట్లసువ్వు ఎన్నిరోజులు జేసినా
ముంగిట పడవని నీతోటోల్లకు సమ్దాయించు
అందర్నీ ఒకటేసారి తీసుకునెగురు
నీ శక్తేందో అందరికీ ఎదురైతదీ
ఎలుగునీతోనే అస్తది.'

అట్లాగే దోపిడీచేసేవారికి గూడా చివరి హెచ్చరికగా 'గప్పుడే ఏమయింది'అన్న ఆఖరి ఖండికలో—

'నీపని అయిపోయింది
నీ మేూను ఎత్తి సింద్రంటే
నెత్తిపల్గి సచ్చిపోతావ్
నీదీనాల్ దగ్గిర కచ్చినయ్'

అని రాబోయే పీడిత జనవర్గ చైతన్యాన్ని గూర్చి చెబుతున్నారు. సమాజ సంస్కరణకు మూలం ఆర్థిక సంస్కరణ. ఆర్థిక సంస్కరణ జరగనంత కాలం సమాజం ఉద్ధరింపబడదు అనే విశ్వాసం ఈకవికి బలీయంగా ఉంది అని ఈసంకలనం బుజువు చేస్తున్నది. వచన కవితాభిమానులు చదవతగ్గ సంకలనం. కాగా మాండలిక భాషలో ఒక సంకలనంగా వచన గేయాలు రావడానికి ఇలాంటి సంకలనాలు పునాదిగా నిలబడతాయి.

అనలతల్పం

(కవితా సంపుటి)

(రావెళ్ల వెంకటరామారావు పేజీలు: 96. వెల: రు 4-0 లు ప్రతులకు:—విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్; ఏలూరురోడ్డు;—విజయవాడ.)

ఈ సంకలనానికి ముడిముక్కలు రాసినవారు అభ్యుదయ కవితాచార్యులు పురిపండా అప్పలస్వామి గారు. ఆయన రాసిన పీఠికలో ఆధునిక కవిత్వంలోని వివిధ ఉద్యమాలను, వాటి లక్షణాలను స్థూలంగా వివరించారు. 'అవతారిక'లో పొడపాటి నారాయణ గారు కవి శ్రీ రావెళ్ల వెంకటరామారావుగార్ని పాఠకులకు పరిచయం చేశారు. ఆ పరిచయంలో ఆయన 'అభ్యుదయ కవితోద్యమం ధృతిసడలి, చైతన్య కవితోద్యమం వ్యాప్తిలోనికివచ్చిన సంధియుగంలో కలం పట్టినకవి శ్రీ రావెళ్ల. అందుకే వీరి రచనల్లో అభ్యుదయ పరంపరాగతశైలి, చైతన్యకవితోద్యమచ్ఛాయ సమ్మిశ్రితరూపం కనబడుతుంది!' అంటున్నారు. ఆధునిక తెలుగు కవిత్వంలో ఇప్పటిదాకా చెప్పుకోతగ్గ ఉద్యమాలు నాలుగొచ్చాయి. ఒకటి భావ కవిత్వోద్యమం! రెండు అభ్యుదయ కవితోద్యమం; మూడు దిగంబరకవిత; నాలుగు విప్లవకవితోద్యమం. నే నెరిగింతవరకు చైతన్య కవితోద్యమం అనేది ఒకటి తెలుగు కవిత్వంలో రాలేదు. అభ్యుదయ కవిత్వానికి అనంతరం దిగంబర విప్లవ కవితోద్యమాలకి సామాజిక చైతన్యం ప్రాతిపదిక. ఇదిగాక వేరొక చైతన్యం అభ్యుదయ కవిత్వం తరువాతనుంచి తెలుగు కవిత్వంలో లేదు. 'చేతనావర్త' సంకలనకర్తల చైతన్యానికి అభ్యుదయకవులు ఆశించిన సామాజిక చేతనకు ఎలాంటి సంబంధమూ లేదు. అదీగాక చేతనా వర్త కవుల చైతన్యాన్ని ఒక ఉద్యమంగా అంగీకరించే అవకాశం అంతకంటె లేదు.

ఈ సంకలనం సంపూర్ణంగా అభ్యుదయభావన కల సంకలనం. శ్రీ రావెళ్ల వేంకట రామారావుగారు స్వాతంత్రం సిద్ధించినప్పటినుంచి ఇప్పటిదాకా మన దేశంలో వర్ధిల్లుతున్న వ్యవస్థమీాదగల భావ సమూహమే ఈ సంకలనంగా రూపుదిద్దుకుంది. ఆయన కవితా లకాృన్ని స్వేచ్ఛాగానంలో చెప్పారు.

'గతి దప్పిన బ్రతుకుబాట
మతిమాలిన వెతుకులాట
మెతుకు చేదు, వెతలపాదు
కుతకుతమను అంతరాలు
నైరాశ్యపు పెనుతుఫాను

నరమేధల చిరయజ్ఞం
పురిగొల్పే అసురాళిని
పతిమార్చే నవగీతం
సంగీతపు సరాగాల
సరిగమలలో నొదగదు'

ఈ పాదాల్లో ఆయన కవిత్వపు ఇతివృత్తం ధ్వనిస్తోంది. దాంతోపాటు చివరి రెండు పాదాల్లో సంప్రదాయం మీద తిరుగుబాటుకు కూడా వ్యంజక మవుతున్నది. సంప్రదాయకమైన భావన మీద తిరుగు బాటు తప్పదు. భావానికి, క్రియకు విడదీయరాని సంబంధం ఉన్నది కదా! ఈ తిరుగుబాటుకు మూల కారణం వ్యవస్థాగీతమైనది. ఒకడు శ్రమిస్తున్నాడు; మరి ఒకడు దాని ఫలితాన్ని అనుభవిస్తున్నాడు. ఫలి తంగా వ్యవస్థలో రెండు వర్గాలు ఏర్పడుతున్నాయి. ఒకటి దోపిడీ చేస్తున్న వర్గం; రెండోది దోపిడీ చెయ్యబడుతున్న వర్గం.

'నా రక్తపు అడుసుతోడ
నాగరకతా హర్మ్యం
తనరూపును దిద్దుకొంటు
దాష్టీకం చేసిందమ్మా!' అని చెబుతూ—
'మనిషిలాగ బ్రతకాలను
మమతా ఝరినిండి పొరలి
తల యెత్తుక తిరగాలని

స్థైర్యంతో నిలిచాను' అంటూ సామాజిక అసమానతపై తనలోని తిరుగుబాటు తత్వాన్ని విశద పరుస్తున్నారు. 'నీకోసం వెతుకుతున్నాను' అనే ఖండిక మనదేశ స్వాతంత్ర్యం మీద సెటైరులాంటిది. రాజకీయ స్వాతంత్ర్యం మనకొచ్చింది. మానసిక, సాంఘిక, ఆర్థిక స్వాతంత్ర్యం మనకు ఇంకారాలేదు. స్వాతంత్ర్యాన్ని ఏ కొద్దిమందో తమ సొంతం జేసు కొనడంవలన ఈ అనర్థం సంభవించింది. ఈ యథార్థ్యాన్ని ఈ ఖండికలో చక్కగా చెప్పారు.

'అద్దాలలో పసిపాప ఆడుకొంటుందన్నారు
నలుగురికంటె పడితే దృష్టిదోషం తగిలి
నీరశించి పోతుందన్నారు.'

ఈ పాదాల్లో మన స్వాతంత్ర్యం అల్ప సంఖ్యా కుల చేతిలో కీలుబొమ్మగా మారినదన్న ధ్వని ప్రస్ఫుటమవుతున్నది. స్వాతంత్ర్యాన్ని తమ హక్కు భుక్తం చేసుకున్న మహానుభావుల జాబితా ఈ క్రింది పాదాల్లో గమనించవచ్చు.

'కాంట్రాక్టుల కామయ్యలు
కాలానికి గాలంవేసి, కాంతా కనకవర్షం
కాకుంటే పానీయ ప్రవాహం
జోకర్లను, బ్రోకర్లను జోహుకుం చాకర్లను
ఎరగా ప్రయోగించి
ఎన్నెన్నో మజాలు గుప్పించి
కోటికి పడగలెత్తుతూ
కులుకుతూనే ఉన్నారు'

ఇది సమాజంలో శ్రామిక వర్గానికి జరుగు తున్న అన్యాయం. ఈ అన్యాయం మీద సామాజిక ప్రగతివాదులంతా తీవ్రంగా తిరుగుబాటు తీసుకు రావాలనేది కవి ఆశయం. అంచేతనే ఆయనలోని వ్యక్తి చైతన్యానికి, సామాజిక చైతన్య స్వరూపాన్ని ఆపాదిస్తూ ఈ క్రింది విధంగా అంటున్నారు.

'నిరంతరం గుండెల్లో ఘూర్ణిల్లే
పరితాపానల సంరంభం
సంవర్తనాల వెలుగు సంతరించగా
సముద్ధికోత్సాహ సంఘటితుడవై
సాహసంతో శిరమెత్తుక
సైనిక క్రమశిక్షణతో
ప్రళయగీత పారాయణ
గళకాహళ ధ్వానాలను
కరదీపికగా గైకొని
కన్నుల్లో వత్తులతో
నిలువెల్లా గాలిస్తూ
నీ రూపం కనుగొంటా'

అంటూ నిజమైన స్వాతంత్ర్య సాధనకు పీడిత సమాజాన్ని పురిగొల్పుతున్నారు. 'నాటుధున్' అనే గేయం వ్యక్తి స్వార్థంమీద సెటైరు.

'దేశభక్తి వ్యాపారం తేరగున్నదనుకొన్నాం
పెట్టుబళ్లు లేని గిట్టుబాటుకునుగొన్నాం
స్వయం సమృద్ధిని సాధించుతూనే ఉన్నాం'

దేశపరమైన స్వయం సమృద్ధి స్వతంత్ర భారతంలో వ్యక్తి పరమైన స్వయం సమృద్ధిగా పరిణామం చెందిందనే నిజాన్ని ఇక్కడ వ్యంజకం చేశారు.

'లయిస్తుంది గింపారితి
జయిస్తుంది విశ్వక్రాంతి'

అంటూ తనలోని భవిష్యదాశావాదాన్ని కావ్యం ముగింపులో వ్యక్తంచేశారు.

సామాజిక ప్రగతి ప్రధానధ్యేయంగా ఇప్పుడొస్తున్న కవితా సంకలనాలలో ఈసంకలనం ఉత్తమమైనది. ఎంచేతంటే—కవికి ఎంతవరకూ తనుచెప్పింది ఆచరణసాధ్యమో అంతవరకీ చెప్పి ఊరుకున్నారు. పోగా ఈయన స్వయంగా ఉద్యమాల్లో పాల్గొన్నవారు కనుక ఆయనలో నిజాయితీని శంకించవలసిన పనిలేదు. ఆయనే చెప్పుకున్నట్లుగా ఈరచనలు ఏకకాల జీవితాలు కానందున అంతర్గత సూత్రానికీ లొంగని తావులున్నాయి. పునరుక్తులు పోగుచేసుకున్నది' దీనికి ఆయన పాఠకలోకానికి క్షమాపణ చెప్పుకున్నారు, అభ్యుదయ కవిత్వంనుంచి ఇప్పటిదాకా ప్రణయాపరంగా కనబడుతున్న స్వరూపాలు రెండు. మాత్రా ఛందస్సులు, వచనగేయం. ఈరెండు ప్రక్రియల్లోనూ వేంకటరామారావుగారు కవిత్వం రాశారు. రాసినంతవరకు సంయమనంతో, శిల్ప సంపదతో, సహజ సుందరమైన శైలిలో, సరళమైన భాషలో రాశారు. అందుకు కవి శ్రీ రావెళ్ల వేంకటరామారావుగారు అభివందనీయులు.

—శ్రీ టి. ఎల్. కాంతారావు

జాతీయ గీతాలు

(భారత జాతీయోద్యమానికి సంబంధించిన పద్యాల, గేయాల సంకలనం; సంపాదకుడు—'కవిశేఖర' శ్రీ గురజాడ రాఘవశర్మ; ప్రచురణ—ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, సైఫాబాదు, హైదరాబాదు—4; పుటలు 8+6+80+592 (6×6 పుటలు); వెల పన్నెండు రూపాయలు.)

భారతదేశపు రాజకీయరంగంలో గాంధీజీ అవతరణకు పూర్వం, తరవాతా స్వరాజ్యప్రాప్తికై సాగిన జాతీయోద్యమం బహుముఖాలుగా విస్తరించింది. స్వరాజ్యలక్ష్య సాధనకై ఒకప్పుడు ప్రజలు నడిపిన వివిధోద్యమాలు, చేసిన తపస్సూ, త్యాగాలూ ఎవరికైనా ఒడలు పులకరింపజేస్తాయి. అహింసాయుతంగా, అప్రతిహతమైన బ్రిటిషువారి అధికారశక్తిని నిర్భీతిగా ఎదుర్కొని స్వాతంత్ర్యసిద్ధితో విజయం సాధించిన ఆ మహోద్యమం యేదో ఒక ప్రాంతానికీ లేదా ఒక వర్గానికీ మాత్రమే సీమితం కాలేదు. అవిభక్తభారతంలోని అన్నిప్రాంతాలలోనూ, అన్నివర్గాలలోనూ కూడా నూతన జాగృతి ఒకటే తల యెత్తింది. ఒక ప్రాంతాన్ని మించి మరొక ప్రాంతం అహమహమికతో పోటీలు పడి, త్యాగములు చేసి భారతజాతీయోద్యమంలో భాగస్వామిత్వం వహించింది. తెలుగుప్రాంతం కూడా దేశంలోని యే యితర ప్రాంతానికీ యీ విషయంలో వెనుకపడలేదు. ఇంకా, సహజంగానే ఆవేశపరులు కావడం వల్ల యితర ప్రాంతాలకంటే కూడా యిక్కడే యెక్కువ త్యాగ ప్రదర్శనలు జరిగాయని చెప్పవచ్చు. స్వరాజ్య ప్రాప్తికై సాగిన యీ జాతీయోద్యమానికి అంగాలుగా, దానికి మరింత పుష్టినీ, బలమునూ చేకూర్చడానికీ—ప్రజల్లో ఉద్యమలక్ష్యంపట్ల సద్భావమూ,

సౌముఖ్యమూ పెంపొందడానికి విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమం, ఖద్దరు ఉద్యమం, హరిజనోద్యమం, సహాయ నిరాకరణోద్యమం, మద్యపాన నిషేధోద్యమం లాంటి చిన్నచిన్న ఉద్యమాలు కూడా చాలా సాగాయి ఆయా ఉద్యమాలలో ప్రత్యక్షంగా పాల్గొన్నవారూ, ప్రాణాలు కోల్పోయినవారూ అనేకులు. వారిలా ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం లేనివారుకూడా చేతులు ముడుచుకొని కూర్చోలేదు. తమ ఆవేశాలనూ, దేశభక్తినీ పద్యములుగానూ, గేయములుగానూ వ్రాసి ప్రజలను ఉద్యమంపట్ల జాగృతులను చేశారు. స్వాతంత్ర్య సందేశం దేశంనలుమూలలా అందడానికీ, ఉద్యమ లక్ష్యాలు ప్రజలకు హృద్గతం కావడానికీ, ఉద్యమ నాయకులపట్ల వారికి భక్తివిశ్వాసాలు పెంపొందడానికీ ఎంతో కొంత ప్రచారసాహిత్యం ప్రతిభాషలోనూ ఆనాడు అవసరమయింది. ఉద్యమంలో పాల్గొన్న వారిలో కూడా అవసరంకొద్దీ కవితావేశం పొంగి తమ తీవ్రమయిన భావాలను గేయరూపంలో గూర్చి వాటి గానంతో ప్రజలను కర్తవ్యనిష్ఠులను చేశారు. ఉద్యమానికి దూరంగా ఒడ్డున కూర్చున్నవారు కూడా తమ దేశభక్తినీ, దేశనాయకులమీద తమకున్న గౌరవాదరాలనూ కవితారూపంలో ప్రకటించి కృతార్థులయినారు. దేశంలో ఉద్యమంయొక్క ప్రగతికీ, విజయానికీ ఈ సాహిత్యంచేసిన దోహదం తక్కువది మాత్రం కాదు. ఈ సందర్భంలో స్మరించవలసిన పుణ్యమూర్తి శ్రీ గరిమెళ్ల సత్యనారాయణ. దేశనాయకుల ఉపన్యాసాలకంటే కూడా ఆయన రాసిన 'మా కొద్దీ తెల్లదొరతనమూ' అనేపాట ఎంతగా ప్రజలను జాగృతం చేసిందో, ఉద్యమంలోకి దూకే తెగువను వారికి కలగజేసిందో ఆ రోజుల్లో జీవించినవారికి అనుభవంలోఉన్న విషయం. తెలుగుదేశంలో ఆనాడు పేరుమోసిన కవులు అందరూ కూడా ఎంతో కొంత ఉద్యమానికి సంబంధించిన కవిత్వం చెప్పినవారే. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, కాటూరి వేంకటేశ్వరరావు, త్రిపురనేని రామస్వామిచౌదరి, పురిపండా అప్పలస్వామి, బసవరాజు అప్పారావు, తుమ్మల సీతారామమూర్తి, మంగిపూడి వెంకటశర్మ, వేదుల సత్యనారాయణశాస్త్రి, మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి, కొడాలి ఆంజనేయులు, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, జంధ్యాల పాపయ్యశాస్త్రి, అడివి బాపిరాజు, ఆదిపూడి సోమనాథరావు, పాటిబంబ మాధవశర్మ, దాశరథి — వీరందరూ కూడా తమ కవితలతో స్వాతంత్ర్య దేవతను ఉపాసించినవారే. వీరుకాక చెఱుకువాడ నరసింహం, 'దేశభక్త' కొండా వెంకటప్పయ్య, గురజాడ రాఘవశర్మ, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కొండపల్లి జగన్నాథదాసు మొదలయినవారు ఎందరో ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం ఉన్నవారు కూడా పద్యరూపంలో, గేయరూపంలో తమ సందేశాలను అందించడానికి యత్నించారు. శ్రీ విశ్వనాథవారు అన్నట్టు ఈ కవితలో పద్యానికీ, గేయానికీ భేదం లేదు. ఒక మహోద్యమంలో అలాంటి భేదానికి ఆస్కారం ఉండదు. వక్తృవివక్షకు మాత్రమే అక్కడ స్థానం. అక్షరరూపం ధరించడంలో అది యే రూపమైనా ధరించవచ్చు. ఈ కవితలను అన్నిటినీ ఆ రోజుల్లో పత్రికలు ప్రకటించాయి. ముఖ్యంగా ఆంధ్ర పత్రిక, భారతి, కృష్ణాపత్రికలలో వీటిలో విశేషభాగం ప్రకటింపబడింది. కవిత్వపు విలువలకంటే వీటికున్న చారిత్రకపు విలువ యెక్కువ. కవిత్వపు విలువలు కల రచనలు కూడా యిందులో కొన్ని లేకపోలేదు. ఒక మహోద్యమం సాగుతుండినప్పుడు అవసరమయిన యిలాంటి సాహిత్యం ఉద్యమ లక్ష్యం నెఱవేరి దాని అవసరం తీరినప్పుడు క్రమంగా స్మృతిపథంలోనుండి తొలగిపోవడం సహజం. దాన్ని కూడా అధిగమించి కవిత్వపు విలువలతో నిలదొక్కు మనేవి నిలదొక్కు కుంటాయి. కానీ ఉద్యమ విజయానికి తోడ్పడిన యీ రచనలు అన్నీ భిన్నకాలాలలో, భిన్నసందర్భాలలో పత్రికలలో ప్రకటితములై చెల్లాచెదరుగానే తప్ప ఒక చోట లభించడంలేదు. అంచేత ఉద్యమానికి యీ సాహిత్యం యిచ్చిన ఉత్తేజనం ఎలాంటిదో ఈ తరంలో వాళ్లకు తెలిసే అవకాశం లేదు. చరిత్ర దృష్టితో వీటిని సేకరించదలచిన విద్యార్థికి కూడా యిది చాలా కష సాధ్యమయిన విషయం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు శ్రీ గురజాడ రాఘవశర్మగారు సేకరించిన యీ పద్యగేయ సముచ్చయాన్ని ఒక సంపుటంగా ప్రకటించడం ఈ దృష్ట్యా చాలా ప్రయోజనకారి అయిన పని. వీటిని సంకలించిన శ్రీ రాఘవశర్మ

గారు అప్పటి ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం కలిగిన వారు. ఆ రోజుల్లో జాతీయతా ప్రాణవాయువులను పీల్చిన అనేకమంది యువకులలో ఒకరు. స్వయంగా కవిత్వం చెప్పగలిగి సొంతంగా కూడా ఎన్నో జాతీయ గీతాలు రాశారు. ఈ రచనల సేకరణకై ముప్పై సంవత్సరాలుగా జిల్లాలు తిరిగి ఎంతో సామగ్రిని చేకూర్చారు. ఇంచుమించుగా యాభై సంవత్సరాలు గడచిన కాలంలో అప్పటి రచనలను సేకరించడం అంటే తేలికైన పని కాదు. అలాంటి పని చెయ్యడానికి శ్రీ శర్మగారికంటే అర్హులు ఎవ్వరూ ఉండరు. సంకలనకర్తకు స్వయమూ ఆ విషయంలో ప్రత్యయం, తాత్పర్యం, నిష్ఠ ఉండాలికదా! శ్రీ శర్మగారికి ఈ మూటి విషయంలోనూ ఎలాంటి కొరతా లేదు. ఇటీవల గాంధీ సాహిత్య ప్రచురణాలయంవారు గాంధీ మహాత్ముడికి సంబంధించి రెండు పద్యసంపుటాలు ప్రచురించారు. కాని అవి ప్రత్యేకంగా గాంధీగారికి మాత్రమే సంబంధించినవి. శ్రీ రాఘవశర్మగారు సంకల్పించి సేకరించిన వాటిరీతి వేరు. వారు ఈ సంపుటంలో జాతీయోద్యమానికి సంబంధించి వెలువడిన సాహిత్య సర్వస్వమునూ సంకలించారు. ఆ రోజుల్లో ఏ పద్యములు, ఏ పాటలు, ఏ గేయాలు స్వాతంత్ర్య సమరంలోని వివిధ దశల్లో ప్రజలను కార్యోన్ముఖులను చేశాయో ఈ సంపుటిని తిలకించినప్పుడు ఎవరికైనా యిట్టే అవగతమవుతుంది. తాము అవిరతంగా పరిశ్రమించి వివిధ పత్రికలనుండీ, గ్రంథాలనుండీ సేకరించిన పద్యగేయ రచనలను వారిందులో కొన్ని ప్రత్యేక శీర్షికలకింద విభజించి ప్రదర్శించారు. ఉద్యమం యావత్తూ ప్రధానంగా స్వాతంత్ర్య సముపార్జన లక్ష్యంతోనే సాగడంవల్ల దానికి అంగభూతాలయిన యితర చిల్లర ఉద్యమాలనూ, వాటికి సంబంధించిన రచనలనూ వేఱుచేయడం కొంత కష్టసాధ్యమే అవుతుంది. అసహాయోద్యమానికి సంబంధించిన రచనల్లో గాంధీ ప్రశంస, గాంధీ ప్రస్తుతిలో ఆయన అభిమానించిన యితర ఉద్యమాల ప్రసక్తిరాక తప్పదు. అలా ఒక దానితో ఒకటి ముడిపడిన మహాసందర్భం అది. కానీ సౌకర్యంకోసం వాలా రచనలను భారతజనని, జాతీయజెండా, తిలక్ నిర్యాణం, పాంచాల పరాభవం ఇత్యాదిగా పధ్నాలుగు శీర్షికలకింద విభజించి ప్రకటించారు. దీనికంతా మకుటాయమానంగా వారు రచించిన విపులమైన పీఠిక స్వాతంత్ర్య సమరానికి సంబంధించిన అనేక ఆశ్చర్యకర విషయాలను, ముఖ్యంగా ఆంధ్రదేశానికి సంబంధించిన పల్నాడు సత్యాగ్రహోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం, హరిజనోద్యమం, మొదలైన సన్నివేశాలకు సంబంధించి ఆసక్తికరములయిన విషయాలను తెలియజేస్తున్నది. వారు చేసిన మరొక గొప్ప ఉపకారం శ్రీ గరిమెళ్ల సత్యనారాయణగారి సంక్షిప్త జీవితచరిత్రను కూడా యిందులో చేర్చడం. శ్రీ గరిమెళ్ల తమిళజాతీయ కవి శ్రీ సుబ్రహ్మణ్యభారతికి ఏ మాత్రమూ తీసిపోని ప్రతిభాశాలి, త్యాగశీలి, స్వాతంత్ర్యవీరుడు. కానీ ఆ కవివీరుడు జీవిత చరమదశలో కటిక దారిద్ర్యంతో, యే ఆదరణా లేక కన్నుమూయడం ఆంధ్రజాతి దౌర్భాగ్యం. ఏ స్వాతంత్ర్యంకోసం ఆయన అనేక త్యాగాలుచేసి, అనేకులను తన పాటలతో, రచనలతో ఉద్బోధించారో ఆ స్వాతంత్ర్యం సిద్ధించినతరవాత జాతి అతని త్యాగాల్ని గుర్తించకపోవడం నిజంగా చాలా దురదృష్టం. ఈ సంపుటిలో వారి త్యాగమయ జీవితచరిత్రను సంక్షిప్తంగానైనా ప్రచురించి ఆయన ఋణం కొంత తీర్చడానికి ప్రయత్నించడం ముదావహమైన విషయం. నిజానికి ఆయన శిలావిగ్రహం ఒకటి రాజధానిలోనో, రాజమండ్రిలోనో నిర్మించడం మన జాతి చెయ్యవలసిన కనీస కర్తవ్యం. శ్రీ రాఘవశర్మగారు ఇందులో చేర్చిన రచనలు ఏయే పత్రికల్లో, ఎప్పుడు ప్రచురింపబడ్డాయో వివరాలు వీటిలో కొన్నిటికి యిచ్చినట్టే అన్నిటికీ కూడా యిచ్చిఉంటే చారిత్రక విద్యార్థికి ఎంతో ఉపకారకంగా ఉండేది. వీటి సేకరణలో చూపిన శ్రద్ధాసక్తులనూ, కర్తవ్యనిష నూ శ్రీ శర్మగారు ఎడిటింగులోనూ, ముద్రణ విషయంలోనూ కూడా చూపిఉంటే ఎంతో బాగుండేదనిపిస్తుంది. యిందులో దొర్లిన అచ్చుతప్పులనూ, యితర దోషాలనూ చూసినప్పుడు. మట్టిబెడ్డలతో, చిన్నచిన్నరాళ్లతో కలిసిఉన్న 'దేవతాపులుసు' జైళ్లలో మగ్గుచుండిన స్వాతంత్రవీరులకు చర్వణదశలో ఎంత బాధాకరంగా ఉండిందో ఉత్సాహంతో యిందులోని

రచనలను చదువుతున్న పాఠకుడికి యీ అచ్చు తప్పులు, యితర తప్పులూ ఒక్కొకసారి కలుక్కు మనిపిస్తాయి. ఎన్నోచోట్ల గణభంగాలు ఛందో దోషాలు, అర్థావగతికి అచ్చుతప్పులూ లేకుండా నివారించి ఉండవలసింది. అవన్నీ ఆయా రచయితల దోషాలనలేం. 'జయ జయ భారత జనగణమాతా' అన్న మంగిపూడి వెంకటశర్మగారి గేయం 46 పుటలోనూ, 58 పుటలోనూ రెండుసార్లు ప్రకటింపబడింది. ఏమయినా శ్రీ శర్మగారుచేసిన యీపని చాలా గొప్పది— శ్రీ విశ్వనాథవారు అన్నట్లు 'ఈ పని పరదేశములలో నయినచో శిరసావహింపబడెడిది. ఒక వాల్టేరు, ఒక కార్లైల్, ఒక గోర్కిచేసిన పనులవంటి పనిగా దీనిని పరిగణించెడివారు.' కనీసం యీ పని విలువను గుర్తించి, దీని ప్రచురణభారం వహించి, తమ బహుకాల పరిశ్రమకు గుర్తింపులేకుండా పోయిందనే నిర్వేదం పోగొట్టి, అది ఒకరూపం దాల్చిందన్న సంతృప్తినైనా వారికి కలిగించినందుకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారిని అభినందించాలి. స్వాతంత్ర్య సమరయోధుడుగా, జాతీయకవిగా ఆయన చేసిన త్యాగాలకూ, ఉద్బోధలకూ ఈ సంతృప్తి ఒక్కటే వారికి మిగిలింది. శ్రీ గరిమెళ్లకు అదీ లేదు కదా! వీటిని 'జాతీయగీతాలు' అనడంకంటె 'జాతీయోద్యమ గీతాలు' అని కానీ, 'జాతీయోద్యమ కవిత్వం' అని కానీ అనడం భావ్యమనిపిస్తుంది. 'జాతీయగీతాలు' అన్నప్పుడు కలిగే అర్థస్ఫూర్తి వేరు. ఇందులో చాలా భాగం ప్రచారసాహిత్యంగా వెలువడింది. ఇందులో కవిత్వంగా నిలిచేది యెంత అంటే ఆ సంగతి వేఱు. వీటికి ఉన్న చారిత్రకపు విలువలనిమాత్రం ఎవరూ కాదనలేరు.

—డా॥ తిమ్మావజ్ఝల కోదండరామయ్య.

బ్రౌన్ జాబులు

(సంకలనం—బంగోరె. వెల 5 రూపాయలు. ప్రచురణ — బంగోరే. (జమీన్‌రైతు ఎదురుగా) నెల్లూరు (ఆం. ప్ర)

సాహిత్య చరిత్ర అన్వేషణ, పరిశోధనలలో అమిత అభినివేశంగల తెలుగు యువకుల పేర్లు లెక్కపెట్టేటప్పుడు మొట్టమొదట పేర్కొనవలసినవాడు బంగోరే. తనకున్న అభినివేశం ఇతరులలో లేక పోతూందే, వుంటే ఎంత బాగుండేదనే బాధ, ఆక్రోశం ప్రకటించేటంత తత్పరత ఆయనది.

అప్పుడప్పుడు జమీన్ రైతు పత్రికలో వ్రాస్తూ వచ్చిన నూరేళ్లనాటి నెల్లూరుజిల్లా చరిత్రలూ, జీవితాలూ, కబుర్లూకాక ఇప్పటికే కన్యాశుల్కం మొట్టమొదటి ముద్రణ, చంద్రిక కథలను ప్రచురించి శ్రద్ధాళులైన పరిశోధకులుగా పేరు తెచ్చుకొన్నారు. సి. పి. బ్రౌన్ సమీకరించి పెట్టిన సారస్వతం పరిశీలించి చేసిన కృషిలో భాగంగా ఈ 'బ్రౌన్ జాబులు' ప్రచురించేరు.

ఈ నాడు తెలుగు సాహిత్యాన్ని గురించి మనం మాట్లాడుకోగలుగుతున్నామంటే అది బ్రౌన్ పెట్టిన భిక్ష. నూరేళ్లక్రితంవరకూ తెలుగునాట పండితులూ, విద్వాంసులు తెలుగుభాష అంటే, తెలుగులో వ్రాయడం అంటే ఎంత వ్యతిరేకత చూపే వారో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి అనుభవాలూ—జ్ఞాపకాలూ చదివిన వారు అర్థం చేసుకోగలరు. అప్పుడే బ్రౌన్ కృషి అర్థం అవుతుంది.

చిన్నయసూరి సాతాని చిన్నయ్యమాత్రమేఅయినా మహాపండితుడేయైనా, ఒక నీతిచంద్రికతోనో, మరొక దానితోనో తెలుగుభాష ప్రగతిని అడ్డగించేడన్నా, గ్రాంథికభాషకు ప్రాణప్రతిష్ఠ చేయగలుగుతాడన్నా నమ్మలేము.

వృత్తాంతి, వర్తమాన తరంగిణి మొదలైన పత్రికలనుంచి లేఖలు, సమాచారాలు సేకరించి బ్రౌన్ మనకు మిగిల్చిపోయారు. అవి చదివినా, ఏనుగు వీరాస్వామయ్యగారి కాశీయాత్ర చరిత్ర చదివినా, రావిపాటి గురుమూర్తిశాస్త్రిగారి 'పంచతంత్రకథ' మొదలైన పేర్లువిన్నా ఆ నాటికి తెలుగులో వచన రచన వ్యావహారికంలోనే సాగేదని అర్థం చేసుకోగలం. అంతప్రాచుర్యంలోవున్న రచనా విధానం చిన్నయసూరి వల్లనో, ఆయన వ్రాసిన ఒక్కపుస్తకంవల్లనో తల్లక్రిందులయిందంటే నమ్మలేము. సాహిత్య సృష్టికి ఆధారంగావుండే పండిత ప్రకాండులకు ఈ వచన భాష ఇష్టం లేదు. కావ్యభాషకు అభ్యంతరం లేదు. ఆ దశలో కావ్యభాషలో వచన రచన సాధ్యమేనన్న

నమ్మకం కలిగించడానికి చిన్నయసూరి కారణ భూతుడయ్యాడా? అయినా ఒక వ్యక్తివలన సాహిత్య పంథా పూర్తిగా మారడం ఆశ్చర్యకరమే. దానికిగల ఇతరేతర చారిత్రక కారణాలను పరిశోధకులు అన్వేషించడం ఉచితం.

తెలుగు జర్నలిజం చరిత్రను అర్థం చేసుకొనేందుకు బ్రౌన్ సేకరించిన ఈ లేఖలు చాల అధికంగా తోడ్పడుతున్నాయి.

1839 లో జూలియా తామస్ అనే యామె వృత్తాంతిని అనే పత్రికలో వచ్చే వ్రాతలను గురించి చెప్తూ రాణిగారి మంచం, పక్కగురించిన వార్తలు, ఆమె గట్టినేలని, వట్టి చాపమీద, దుప్పటీయేనా కప్పుకోకుండా పడుకుంటుందని చూసినంత గట్టిగా వ్రాస్తారనీ- ఇల్లాంటివే ఇంగ్లీషునుంచి అనువదించి వేస్తారనీ వ్రాసింది. నేటికీ మన భాషలోని పత్రికలు అదే వరవడిలో సాగుతూండడం కనిపిస్తుంది.

పైగా, సాంఘిక దురాచారాలను గురించి ఆనాటిలా కాకుండా నేడు అసలు వేయడమే మానుకొన్నాం. సెన్సేషన్‌కోసం రంగు పులిమి చూపడం తప్ప సామాన్య ప్రజల కష్టాలు, అధికార్ల దురంతాల ప్రసక్తి రానివ్వకుండా జాగ్రత్తపడుతున్నాం అనిపిస్తుంది.

కడపజిల్లా రైతు గవర్నరును అడ్డగించి న్యాయం చెయ్యమని నిలేసిన వార్తను వర్తమాన తరంగిణినుంచి బ్రౌన్ సేకరించి వుంచడానికి ప్రత్యేకమైన కారణం లేదు గదా అనిపిస్తుంది. 'న్యాయాన్యాయమును విచారించకుండా జయిలుఖానాకు పంపించినట్లు విన్నాము.'—'ఫిర్యాదికి న్యాయము కలుగునని నమ్ముచున్నాము.'వంటి పత్రికా వ్యాఖ్యలు ఆనాటి పరిస్థితులలో మెత్తని మందలింపులుగా భావించలేము.

వర్తమానతరంగిణిలో కోమలేశ్వరపురం శ్రీనివాసపిళ్లె మరణవార్తమీద దానిని వ్రాసిన స్ఫూర్తి కేయునికి ఫుట్‌నోట్‌లో బంగోరే యిచ్చిన ప్రశంస సముచితంగా లేదనేది నా అభిప్రాయం. ఆ వార్త ఇచ్చిన విధానంలో వ్రాసినవాని అల్పబుద్ధి మాత్రమే కనబడుతూంది.

అలాగే—

మహాభారత ముద్రణల సందర్భంలోనూ, బ్రౌన్ సేకరణల నుపయోగించుకొన్న సందర్భంలోనూ ఇతరేతర పండితులమీద బంగోరే విసిరిన విసురులు ఆయన కృషినే కించుపరుస్తున్నాయని నా అభిప్రాయం. తెలుగులో పరిశోధనలు చాలా ప్రాథమికదశలో, పైపై మెరుగులుగా సాగుతున్నాయేగాని బంగోరే మాదిరిగా తల స్పర్శిగా జరపాలన్న ప్రయత్నం చాల తక్కువగావుంది. ఈ పరిస్థితికి తోడు సమాచార సేకరణలోవున్న కష్టాలు దొరికిన సమాచారాలలో భాగాలను, కొన్నిచోట్ల ఆ పుస్తకాలనే కూడ పూర్వ పరిశోధకులు ఎవరో స్వాయత్తం చేసేసుకొని వుండడం సామాన్యంగా జరుగుతూంది. అయినా తమకు తోచినంతవరకు, ఓపికమేరకు వారు వారు చేసినదే గొప్పగా తీసుకొని తప్పుచేసినచోట సకారణంగా నిరూపించుకొంటూపోతే ఆరోగ్యకరమైన విమర్శనకు అవకాశం కలిగించవచ్చునని నా అభిప్రాయం. ప్రస్తుతం కావలసిందది. బ్రౌన్ లేఖలుగా చేతికి వచ్చినప్పుడు జి. ప్లెఖనోవ్ వ్రాసిన 'అన్‌డ్రెస్‌డ్‌లెటర్స్' చదువుతున్నా. దానిలో ఆయన బ్యూకెర్ వ్రాతలనూ, అభిప్రాయాలనూ విమర్శించినతీరు మనసుకి పట్టివుందేమో బంగోరె ఇతర విమర్శకులపై చేసిన వ్యాఖ్యలూ, విసురులూ బంగోరెకృషిని అభినందించేవారిలో కూడ ఆయన సహృదయతమీద అవిశ్వాసం కలిగిస్తున్నాయని పించింది.

బంగోరే తమ రచనాభాగంలో వుపయోగించిన కొన్నిపదాలు ఎబ్బెట్టుగా కనిపిస్తున్నాయి. అది ప్రాంతీయమైన అర్థఛాయా భేదాలవలన అలా కనిపిస్తున్నాయేమో రచయితకూడా ఆలోచించవలసిందే.

17 వ పుటలో రాజమండ్రీ వచ్చేనాటికి బ్రౌన్ గ్రంథ సాంగుడై వున్నాడు' అనే వాక్యంవుంది.

'గ్రంథసాంగుడు' తరవాయిలన్నీ తీరేయి' 'ఎన్నోచేతులు చూసేడు' వగైరా పదబంధాలను శుద్ధ వ్యభిచారి అనే అర్థంలో వుపయోగిస్తారు. బంగోరే వుపయోగించిన అర్థంవేరు. బాగా చదువుకొని, పుస్తకాలుకూడా వ్రాసి ప్రచురించిన సమర్థుడనేది ఆయన వుద్దేశం. గంథశబ్దంతో బంగోరే

తప్పుదారి పడ్డారా? లేక నెల్లూరు ప్రాంతంలో ఆ అర్థంలో వుపయోగిస్తారా?

అలాగే అట్టమీద త్వరలో ప్రచురించగల పుస్తకాల జాబితాలో 'నూరేళ్లునిండిన నెల్లూరు జర్నలిజం చరిత్ర'ను పేర్కొన్నారు. నూరేళ్లు నిండడం చనిపోవడం అర్థంలో వుపయోగిస్తారు. నెల్లూరు జర్నలిజం నూరేళ్ల చరిత్ర అనే అర్థం ఆమాటకు లేదనుకుంటున్నాను.

ఇలాంటి ప్రయోగాలే మరి ఒకటి రెండు కనిపించేయి.

బ్రౌన్‌లేఖలు ప్రచురించి బంగోరె తెలుగు సాహిత్యానికీ, భాషా చరిత్రకు ఎనలేని సాయంచేశారు. ఆయనశ్రద్ధ ఇతరులకు మార్గదర్శకల కావాలని కోరిక.

—'అవంతి'

ఆరోగ్య నికేతనము

(తారాశంకర్ బంద్యోపాధ్యాయ బెంగాలీ నవల)

(అనువాదం: శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి. ప్రతులకు: సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ–1. వెల: రూ. 12/–)

ప్రసిద్ధ నవలలకు బెంగాలీ పుట్టినిల్లు. వంగ దేశం రచయితల పుట్ట. శరత్‌బాబు తరవాత మరొక శరశ్చంద్రుడు తారాశంకర్ బంద్యోపాధ్యాయ.

దేవీపుర గ్రామంలో తరతరాలుగా వస్తున్న చికిత్సాలయం ఆరోగ్య నికేతన్. దాని పుట్టుక, మనుగడ, ప్రఖ్యాతి—తదుపరి దాని ప్రాభవం ఎలా దిగనాసిల్లి దుమ్ములో కలిసిపోయిందో, కళ్లకు కటి నట్టు చిత్రిస్తుంది నవల. 'ఆరోగ్య నికేతన్'ను నమ్ముకుని, దేవీపురం ఆ చుట్టుపక్కల ఊళ్లనూ వైద్యవృత్తితో ఏలుకుంటూ పోషణ జరుపుకుంటున్న దీనబంధు దత్తూ, ఆయన కుమారుడు జగద్బంధు మహాశయుడూ, ఆయన కొడుకు జీవన మహాశయుడూ మనకు తారసపడే ప్రముఖ నేటివ్ వైద్యులు.

రోజులు మారాయి, అల్లోపతి వైద్యం వచ్చి దేశవాళీ చికిత్సల్ని కొట్టివేసింది. కాలానుగుణంగా జీవన డాక్టరు మారాడు, అయినా లాభం లేకపోయింది. ప్రద్యోత డాక్టరు ప్రభావం ఎక్కువ కావడంతో జీవనం ప్రాక్టీసు దెబ్బతిని, చిక్కులో పడ్డాడు. ఇంట్లో గయ్యాళిభార్య, ఊళ్లో పరపతి తగ్గటం — వీటి మాటకేం?—పాలిటిక్సు పుట్టుకొచ్చాయి. కక్షలూ కావేషీలూ పెరిగాయి. ఇన్నిటి మధ్యా ఎలానో జీవితం గడుపుతున్నాడు జీవనం. 'వద్దండి నాయనా, నేను వృత్తి మానేశాను' అంటున్నా వినక, పేషెంట్లు తమ హస్తాలను జీవనం డాక్టరు చేతికి అప్పగిస్తూనే వున్నారు. ఆయన అనుభవిస్తున్న ఈ అంత్యదశ ఎంత కఠినుడికయినా కళ్లనీళ్లు తెప్పించి తీరుతుంది.

చక్కటి నవల, నవలకు తగిన తెనిగింపు. ఎకాడమీవారి సాహిత్య సేవలో ఎన్నదగిన మరి ఒక మణిపూస.

బ న్ గ ర్ వా డి

(మ రా ఠీ న వ ల)

(మూలం: వ్యంకటేశ్ మాడ్గూళ్కర్, అనువాదం: శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రి, ప్రచురణ: నేషనల్ బుక్‌ట్రస్ట్, న్యూఢిల్లీ, 154 పేజీలు. రూ. 2—75.)

అది 1954 దీపావళి. మరాఠీ సాహితీ లోకంలో చిన్న సంచలనం కలిగింది. కారణం?—ఒకానొక మరాఠీ వారపత్రిక పత్రికమాత్రమే కాదు. అందులో ప్రచురితమయిన ఒక నవల అదే'బన్‌గర్‌వాడి.'

నవయుగ భావాలతో ముందడుగువేసే యువతరాన్ని సయితం ఆకట్టిన ఈ నవల ఇంగ్లీషు, డేనిష్, తదితర భాషల్లోకి – ఇప్పుడు తెలుగులోకి అనువదింపబడి, అంతర్జాతీయ ఖ్యాతిని గడించుకున్నది.

పాలంగోట్టెలసంచీ వీపుకి తగిలించుకుని కొత్తగా బదిలీఅయిన బడిపంతులు బంగర్‌వాడి బయల్దేరాడు. పంతులుతోపాటే కథలో అడుగు పెట్టిన పాత్రలు ఆ వాతావరణంలోనే ఐక్యమై పోయారు, అక్కడి మంచి చెడ్డలను పంచుకున్నారు. పంతులుతోపాటు పల్లెటూరిబడి పునరుద్ధరణకు ఉరకలు వేశారు. ఈ

ఉత్సాహం మధ్య రాచకీయాలు కక్షలు, కావేషీలు— ఇన్నిటినీ నిగ్రహించి పంతులు ఎలా నెగ్గుకువచ్చాడు? కర్తవ్యాన్ని ఎలా నిర్వహించాడు? పల్లీయులతోపాటు కరువు కాటకాలను ఎలా ఎదుర్కొన్నాడు? ఎంతటి ప్రతికూల పరిస్థితులకూ లొంగని ఆ యువకుడు 'నేను వెళుతున్నాను. సర్కారువారు నన్ను వెనక్కు పిలిపించారు' అంటూ నిష్క్రమించాడు.

ఉజ్వలమైన, కళాత్మకమయిన, ఉత్తమ గ్రామీణ నవల. తెనుగుదనం ఉట్టిపడే చక్కటి అనువాదం.

— శివకుమారి.

మృగతృష్ణ

(ఖండకావ్య సంపుటి : కవి : కాళహారి హనుమంతరావు; ప్రతులకు : కె. వి. శేషుబాయి, ఓయు బి ఎఫ్ 7 యూనివర్శిటీ కాంపస్, హైదరాబాద్— 500007; 33 పేజీలు వెల రూ 1.)

సంప్రదాయంపై గౌరవమూ, ఆధునికత్వంపై అనురక్తీ ఉన్న పండితకవి శ్రీ కాళహారి హనుమంతరావు. 'మృగతృష్ణ' అనే ఖండకావ్య సంకలనంలోని కవితలు పదునెనిమిదేండ్ల కాలవ్యవధిలో అప్పుడప్పుడూ రచించినవి. సంప్రదాయబలంతో ఆధునికత్వంలోకి చొచ్చుకుపోగలిగిన వారి ఆలోచనాశక్తికి నిదర్శనంగా ఉన్నాయి. ఛందోబద్ధంగా రచించినవీ, స్వచ్ఛందంగా రచించినవీ పదమూడు ఖండకావ్యాలీ సంకలనంలో ఉన్నాయి. కవిత్వం ఛందోబద్ధంగా ఉంటే ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటుందనీ, ప్రస్తుతం తెనుగు ఛందస్సులో ఉంటున్న యతిప్రాసలు మాత్రం చాలా కఠిన నియమాలని హనుమంతరావుగారి అభిప్రాయం.

వీరి కవితలు దోషరహితంగా సాగిపోయినా హృదయాన్ని అలరించేవిగా లేవు. 'మానవోత్తమ పశస్తి' ('రామప్రశస్తి) 'రఘువంశ నృపప్రశస్తి' కవికి రామాయణగాథపైగల గాఢమైన అభిమానాన్ని చాటుతున్నా కవిత్వమనదగిన భావుకశక్తిగాని వ్యంగ్యోక్తిగాని లేదు. ఇది కేవల ప్రశస్తులు మాత్రమే.

'వేణుగానము,' 'ఆభాసి' అనే గీతాలు భావ కవిత్వపు పోకడలతో శ్రీకృష్ణునిపైన, ప్రేయసిపైన వ్రాసిన అమలిన శృంగార గీతాలు. ఉత్తమభావ కవిత్వం రుచిచూచిన వారివి చదివి ఆనందించటం అసాధ్యం. 'వసంతఘోష' సంస్కృత కావ్యాలలోని వసంతఋతువర్ణనల సారాన్ని వడబోసినట్లున్నది. 'అభిజ్ఞాన శకుంతల'గూడ ప్రశంసిస్తూ వ్రాసిందేగాని కావ్యకళ కనుపించదు. 'నగరంలో ఋతువులు' అనేది యాంత్రిక వాతావరణంలో ఋతువుల మార్పు నాగరికులనేమీ చేయవనటాన్ని చమత్కారంగా చెప్పారు. చమత్కారం ఆనందస్థితికి చేరుకోలేదు. 'ఉత్తర విలాపము'ను గాంధారి శ్రీ కృష్ణున కెఱింగించిన విధమును మహాభారతమునుండి యనువదించారు. ఈ అనువాదము హృద్యముగా ఉన్నది. అట్లే రామాయణమునుండి 'సముద్ర లంఘనము'ను అనువదించారు. ఈ రెండు అనువాదాలు కవికి యితిహాసాలపైగల అధికారాన్ని ధృవపరుస్తున్నాయి.

'మృగతృష్ణ' అనే వచన గీతికలో గీతి మాధుర్యంకంటె కేవల వచనమే అధికంగా ఉన్నది. 'విజ్ఞానాన్ని పెంపొందించుకొంటూ జ్ఞానాన్ని కోల్పోతున్నాం; మృగతృష్ణలో నీళ్ల త్రాగుతున్నాం' అనేది కవి ఆవేదన. దీన్ని వచనంలో చెప్పినట్లున్నదే కాని వచన కవిత్వంలో చెప్పినట్లు లేదు. నగరంలో ఈ వారం అనేది తెలివైన 'జర్నలిస్టు' వ్రాసిన 'వీక్లీ రిపోర్టు'లా ఉంటే తప్ప కవిత్వ మనిపించదు. 'శశిపై మానిసి' అనే గీతంలో కవి మానవ విజయాన్ని శంకిస్తూ

'భూమి, తాజెడ్డ కోతి!
గ్రహసముదాయ వనాన్నంతా చెరుపుతుందా?
మానవుని మేధ అతనిని చంద్రమండలం చేర్చగా
ఎప్పటిలాగే మానవుని హృదయం
దుండగులు రైలుని పట్టాలు తప్పించి పడవేసినట్లు
మనిషిని భూమిమీద నిలవనియ్యక
కూలదోస్తూనే ఉంటుందా?' అని ప్రశ్నించారు.

'మృగతృష్ణ' కావ్యసంకలనంలో ఛందోబద్ధ

మైన రచనలలో పటిష్ఠమైన పద్యరచన, వచన కవితలలో ఊహావైచిత్రి కన్పిస్తాయి. కావ్యానందం కలిగించే భావుకతగాని, వచన కవితకు కావలసిన అంతర్లయకాని కన్పించవు.

—శ్రీ రామమోహనరాయ్.

సౌ జ న్య

సునాబెడా — ప్రవాసాంధ్రులచే స్థాపించబడ్డ తెలుగు విజ్ఞాన సమితి—ఈ సంవత్సరం తన ద్వితీయ సంచిక 'సౌజన్య'ను విడుదల చేసింది. సర్వాంగ సుందరంగా వెలువడిన ఈ సంచిక మా కార్యాలయానికి చేరింది. 33 శీర్షికలతో—వివిధ విషయములున్నవి. వెల లేదు. కావలసినవారు తగినన్ని స్టాంపులు అంటించిన కవరు పంపిన పక్షంలో—ప్రతులు పంపబడును. ప్రతులు దొరికే చోటు: శ్రీ వి. రామారావు సహాయ కార్యదర్శి, సాహిత్యశాఖ. తెలుగు విజ్ఞాన సమితి, క్వార్టరు నెంబరు డి–116 హెచ్. ఎ. ఎల్. టౌన్‌షిప్, సునెబెడా–2. ఒరిస్సా.

'శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు అభినందన గ్రంథము'

తపోజీవిగా స్థిరపడి, ఆర్షేయ సంస్కృతిమయముగా భారతీయ జీవన మూల్యములను ప్రతిఫలించుచు ఉజ్జ్వల సుందరమైన సాహిత్య గ్రంథములను రచించినవాడు శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు. ఈయన రచించిన 'ధర్మ నిర్ణయం' నవల విశ్వసాహిత్యానికే అలంకారమనీ, తిక్కన సోమయాజి నవల—ఆంధ్ర సాహిత్యమున చారిత్రక రచనలలో మౌలికమైన మహారచన అనీ, పోతన్న సహజపాండిత్యము అనే విమర్శగ్రంథము ఆంధ్రసాహిత్య విమర్శగ్రంథములలో ప్రథమ గణ్యమనీ ప్రశంసాభినందనలతోనున్న అభినందన గ్రంథమిది. కాశీ కృష్ణాచార్య, పింగళి లక్ష్మీకాంతం. కాటూరి, వేలూరి, సర్వేపల్లి, బూర్గుల, విశ్వనాథ, దివాకర్ల మొదలైనవారి ప్రశంస చేశారు.

శ్రీయుతులు యార్లగడ్డ వెంకన్నచౌదరి. బోడపాటి రాజన్న, డా. బెజవాడ గోపాలరెడ్డి మొదలైన వారు పూనుకొని వెలువరించినదీ అభినందన గ్రంథము—ఇది మా కార్యాలయానికి చేరింది.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-600001. Editor : S. Radhakrishna.